అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 4-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 9 | సంచిక : 226 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

ఇదే మన తెలంగాణ



నాడు నీళ్లు లేక బీళ్ళయిన నేలలో

నేడు బంగారు పంటలు పండించాం

మనుగడే ప్రశ్నార్థకమైన సమయంలో ముందుకు సాగాలనే నిశ్చయించుకున్నాం... తెలంగాణ భవిష్యత్తు గురించి అనుమానాలు లేవనెత్తినవాళ్ళే, ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిని ప్రశంసిస్తున్నారు... పదేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానం దేశానికే మార్గనిర్దేశనం చేస్తున్నది... ఇది గౌరవ ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** దార్శనికతకు నిదర్శనం.

ప్రతి ప్రయత్నాన్ని తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా... ప్రతి నిర్మాణాన్ని తెలంగాణ అభివృద్ధికి గుర్తుగా... ప్రతి అవకాశాన్ని తెలంగాణ అవసరాలకు అనుగుణంగా మలచుకుంటున్న చారిత్రక సందర్భం.

తెలంగాణ సాధించిన సర్వతోముఖాభివృద్ధి ప్రపంచ చరిత్రలో ఓ మరపురాని విజయం. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా మరింత బలోపేతం చేస్తూ సాగుతున్నది ఈ జైత్రయాత్ర.

తెలంగాణ రాష్ట్రం
సుసంపన్నమైంది
తెలంగాణ ప్రజల
స్వప్నం సాకారమైంది

జారీ చేసినవారు: స్పెషల్ కమీషనర్, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 4-10-2023

సంపుటి : 9 | సంచిక : 226 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50



భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

స్టాక్‌హోమ్ : భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి ఈ సంవత్సరం ముగ్గురు శాస్త్రవేత్తలను వరించింది. అమెరికాకు చెందిన పెర్రీ అగోస్తినీ, జర్మనీకి చెందిన ఫెరెన్స్ క్రౌజ్, స్వీడన్‌కు చెందిన అన్నే ఎల్ హుయ్లియర్‌లకు రాయల్ స్వీడిష్ సైన్స్ అకాడమీ ...11లో

బీఆర్ఎస్, కాంగ్రెస్‌వి
తెరవెనుక నాటకాలు

ఎన్డీఏలోకి గులాబీ పార్టీ చేరికను తిరస్కరించాం

- కాంగ్రెస్ ఓట్లు కొనుక్కునే కాంట్రాక్ట్ పార్టీ
- పసుపు బోర్డుతో రైతుల అభివృద్ధి : బీజేపీ జనగర్జన సభలో ప్రధాని మోడీ



నవతెలంగాణ-నిజామాబాద్(నవీపేట్)

కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కేసీఆర్ తెలంగాణ ఖజానా అందించారని, అది 100 శాతం నిజమని ప్రధాని మోడీ వెల్లడించారు. కర్నాటకలో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కేసీఆర్, ఓవైసీలు కృషి చేశారని, ఎలాగైనా ఓట్లు కొనే కాంట్రాక్టుకు తెర వెనుక ఉండి సహకరించారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలవి తెరవెనుక నాటకాలని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రధాని మోడీ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం చేపట్టి జాతికి అంకితం చేశారు. అనంతరం జీజీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ జనగర్జన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.


రూ.8వేల కోట్లతో ఆధునిక సాంకేతికతో చేపట్టిన ఎన్టీపీసీకి చెందిన 800 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణకే ఎక్కువ భాగం దక్కుతుందని తెలిపారు. దాన్ని ప్రజలకు అంకితం చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తెలంగాణలో క్రిటికల్ కేర్ కనెక్టివిటీ పెరుగుతూ తెలంగాణ వికాసం చెందుతుందని తెలిపారు. ఇదే బీజేపీ సంకల్పమని అన్నారు. మహిళలు తనకు స్వాగతం పలికిన తీరు జీవితంలో మర్చిపోలేనని చెప్పారు. వందల మంది యువకుల బలిదానాలతో వచ్చిన తెలంగాణలో.. రాష్ట్ర ఖజానా ఒకే కుటుంబం దోచుకుంటుందని, మీరు వేసే ఓటు మీకోసం కాకుండా కల్వకుంట్ల కుటుంబ అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. అలాంటి వారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ పాపాలను ఎండగట్టే బాధ్యత తనదని తెలిపారు.

కేసీఆర్ గురించి మీకెవరికీ తెలియదని, మీకెప్పుడూ చెప్పని నిజం ఇప్పుడు చెబుతున్నానని, జీహెచ్ఎంసీ ఎన్నికలకి ముందు కేసీఆర్ తనని కలిశారని, పెద్దపెద్ద పూలదండలు తీసుకొచ్చి సన్మానం చేశారని తెలిపారు. నా హయాంలో దేశం దూసుకుపోతుందని భజన చేశారని చెప్పారు. ఎన్డీఏ కూటమిలో భాగం అవుతామని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సహకరించాలని కోరారని తెలిపారు. కానీ ప్రజల తీర్పే అంతిమమని, ప్రతిపక్షంలో అయినా ఉంటాం కానీ తాము బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వమని స్పష్టంచేశామని తెలిపారు. ఎన్నికల తర్వాత మళ్ళీ ఒకసారి ఢిల్లీకి వచ్చి తన కుమారుడు కేటీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారని, ప్రజలే ఆశీర్వదిస్తారని, ఎవరు కావాలో ప్రజలే నిర్ణయిస్తారని తిరస్కరించండతో అప్పటి నుంచి పత్తా లేకుండా పోయారన్నారు. తెలంగాణలో ఇంకా ...11లో





పత్రికా స్వేచ్ఛపై పంజా..



న్యూస్‌క్లిక్‌పై మళ్లీ దాడి

- పాత్రికేయుల లాప్‌టాప్‌లు, ఫోన్లు స్వాధీనం
- ఉపా కేసులో పుర్కాయస్థ సహా పలువురి నిర్బంధం
- పోలీసు కార్యాలయానికి తీసికెళ్లి ప్రశ్నల వర్షం

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛపై మరోసారి పంజా విసిరింది. భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాసింది. దేశానికి వ్యతిరేకంగా చైనా నుండి నిధులు పొందుతోందన్న ఆరోపణ మోపి ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్‌క్లిక్‌పై కక్ష సాధింపు చర్యలకు దిగింది. అందులో పనిచేస్తున్న పలువురు పాత్రికేయులు, ఉద్యోగుల నివాసాలపై ఢిల్లీ పోలీసులు దాడులు జరిపారు. కొందరు పాత్రికేయులను నిర్బంధించి వారి నుండి ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కొందరిని అరెస్ట్ కూడా చేశారని సమాచారం.

న్యూఢిల్లీ : దేశ రాజధానిలో అప్పుడే తెలతెలవారుతోంది. ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్‌క్లిక్‌కు చెందిన పలువురు పాత్రికేయులు, వ్యాఖ్యాతల నివాసాలపై నగర పోలీసులు ఒక్కసారిగా దాడులు చేశారు. న్యూస్‌క్లిక్ సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్థ, రచయిత గీతా హరిహరన్, వీడియో జర్నలిస్ట్ అభిసార్ శర్మ, సీనియర్ పాత్రికేయులు భాషా సింగ్, ఊర్మిలేష్, వ్యాఖ్యాత అనింద్యో చక్రవర్తి, చరిత్రకారుడు సొహైల్ హష్మీ, వ్యంగ్యకారుడు సంజయ్ రాజౌర నివాసాలపై దాడులు జరిగాయి. పుర్కాయస్థను ఆయన నివాసం నుండి తొలుత న్యూస్‌క్లిక్ కార్యాలయానికి, ఆ తర్వాత ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం కార్యాలయానికి తీసికెళ్లారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం పదిహేను మంది పోలీసులు ఉదయం 6.30-7.00 గంటల మధ్య పుర్కాయస్థ నివాసానికి చేరుకొని ముందుగా ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పుర్కాయస్థ భాగస్వామి గీతా హరిహరన్‌కు చెందిన పరికరాలను కూడా తీసుకున్నారు. ఆ సమయంలో వారు ఎలాంటి పత్రాలు చూపలేదని, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకున్నట్లు రశీదు కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. న్యూస్‌క్లిక్‌లో వివిధ హోదాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, పాత్రికేయుల ...10లో

ఆందోళనకరం

- పాత్రికేయ సంఘాలు

న్యూస్‌క్లిక్ పోర్టల్ పాత్రికేయులపై జరిగిన దాడిని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ పరిణామం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపాయి. దాడుల విషయంలో తగిన ప్రక్రియను అనుసరించాలని ప్రభుత్వానికి ఎడిటర్స్ గిల్డ్ సూచించింది. ఈ దాడి మీడియాను అణచివేసేందుకు ...10లో

గొంతు నొక్కుతున్నారు

- ఇండియా కూటమి మండిపాటు

న్యూస్‌క్లిక్ పోర్టల్‌పై జరిగిన దాడిని ప్రతిపక్ష ఇండియా కూటమి తీవ్రంగా ఖండించింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా నిజాన్ని నిర్భయంగా చెప్పే మీడియా సంస్థలను ఉద్దేశపూర్వకంగానే వేధిస్తోందని, వాటి గొంతు నొక్కుతోందని విమర్శించింది. దీనిని పరిణితి ...10లో

సీతారాం ఏచూరి నివాసంలోనూ సోదాలు

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అధికారిక నివాసంలో కూడా ఢిల్లీ పోలీసులు సోదాలు నిర్వహించారు. సీపీఐ(ఎం) కార్యాలయంలో పని చేసే శ్రీనారాయణ్ ఇంటిపైనా తనిఖీలు చేపట్టింది. నారాయణ్ కుమారుడు న్యూస్‌క్లిక్‌లో పనిచేస్తున్నాడు. అయితే సీపీఐ(ఎం) అధికార నివాసాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేరిట కేటాయించారు. తన నివాసంలో జరిగిన దాడులపై ఏచూరి స్పందించారు.

మీడియా నోరు నొక్కేందుకే..?

సీతారాం ఏచూరి



"ఢిల్లీ పోలీసులు మా నివాసానికి వచ్చారు. ఎందుకుంటే అక్కడ మా కామ్రేడ్ నివాసం ఉంటున్నారు. ఆయన మా కార్యాలయంలో పని ...10లో

ఎన్నికల్లో అక్రమాలను అరికట్టాలి

- పారదర్శకంగా నిర్వహించాలి: ఈసీకి సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం వినతి

వివరాలు 2లో

రాష్ట్రంలో బీసీ గణన చేయండి

- సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బయటపెట్టండి
- సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

వివరాలు 11లో



107 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై ద్వేషపూరిత ప్రసంగాల కేసులు

- బీజేపీ నేతలే అత్యధికం



వివరాలు 11లో

5 లక్షల అభ్యర్థులకు... 5 వేల పోస్టులా?

- 13 వేలతో మెగా డీఎస్సీ ప్రకటించాలి : కోదండరామ్ డిమాండ్



- ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయ అభ్యర్థుల బహిరంగసభ

వివరాలు 10లో

10న ఎన్నికల షెడ్యూల్?

తెలంగాణతోపాటే రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరంలకు.. ప్రధాని హడావిడి పర్యటనలు అందుకే

- సీఎం పీఆర్సీ ప్రకటనా ఆ కోవలోనిదే
- వేగాన్నందుకున్న ఎన్నికల సన్నాహాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు భారత ఎన్నికల సంఘం గంట మోగించనుంది. ఈనెల రెండోవారంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసింది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈనెల 10న ఐదు రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ వెలువడనుంది. ఆ తర్వాతే రాష్ట్రాల వారీగా నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్టు తెలిసింది. కొత్తగా ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రక్రియ ఏదైనా మిగిలి ఉంటే, ఈనెల 14లోపు పూర్తిచేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. నిజానికి పాఠశాలల్లో దసరా రోజున ప్రారంభించాలనుకున్న 'సీఎం అల్పాహార పథకం' ఈనెల ఆరునే శ్రీకారం చుడుతున్నారు. ఈనేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్ ...2లో



హైదరాబాద్ విచ్చేసిన కేంద్ర ఎన్నికల అధికారులు

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించండి

- నగదు,మద్యం పంపిణీని అరికట్టాలి
- బోగస్ ఓట్లు తొలగించాలి : కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రాజకీయ పార్టీల విజ్ఞప్తి

వివరాలు 3లో

పర్మినెంట్ చేయాల్సిందే

చిన్నచూపు చూస్తే వదలబోం

- సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 8 నుంచి సమ్మె : మున్సిపల్ కార్మికుల మహాధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- వేలాదిగా తరలొచ్చిన కార్మికులు...హోరెత్తిన ఇందిరాపార్క్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'చాలా ఏండ్ల నుంచి పనిచేస్తున్నారని వీఆర్ఏలు, లెక్చరర్లు, పలువురు కాంట్రాక్టు ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేసింది. మంచిదే. స్వాగతిస్తున్నాం. తాతల కాలం నుంచి అదే పనిగా బతుకుతున్న మున్సిపల్ కార్మికులు ఇంకెంత కాలం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ...11లో



దిక్కుమాలిన బీజేపీ దేశానికి అవసరమా?

గాంధీని చంపిన మొట్టమొదటి టెర్రరిస్టు నాథురాం గాడ్సే

- ఆ దుర్మార్గులతో పొత్తుపెట్టుకునే ఖర్మ మాకు లేదు
- జగిత్యాల ప్రగతి నివేదన సభలో మంత్రి కె.తారకరామారావు

నవతెలంగాణ - జగిత్యాల

"జాతిపిత మహాత్మాగాంధీని చంపిన మొట్టమొదటి టెర్రరిస్టు భారతదేశంలో నాథూరామ్ గాడ్సే అనే ఒక వెధవ.. వాడిని ఆరాధించే దిక్కుమాలిన పార్టీ బీజేపీ. అలాంటి బీజేపీ మన దేశానికి అవసరమా?.. ప్రతి సంవత్సరం 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ అధికారంలోకి వచ్చి 9ఏండ్లు అవుతోంది.. 18కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారో? మోడీ చెప్పాలి" అని మంత్రి కేటీఆర్ అన్నారు. అలాంటి దుర్మార్గులతో పొత్తు పెట్టుకునే ఖర్మ తమకు లేదన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి పనులను హోం మంత్రి మహమూద్ అలీ, సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రగతి నివేదన సభలో మాట్లాడారు.

బీజేపీకి, బీఆర్ఎస్‌కు సంబంధం ఉందని చాలా మంది అంటున్నారు.. కానీ మోడీని కేసీఆర్ విమర్శించినంతగా ఈ దేశంలో ఎవరూ మాట్లాడలేదన్నారు. మోడీ ...11లో

ఆ ముగ్గురే టార్గెట్

సబిత, రోహిత్, సుధీర్‌ను ఓడించడమే లక్ష్యం

- ఉమ్మడి రంగారెడ్డిలో ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్న కాంగ్రెస్
- అక్కడ పాగా వేసేందుకు కార్యాచరణ సిద్ధం
- కలిసిరానున్న సిట్టింగ్ అభ్యర్థులు, అధికార పార్టీపై వ్యతిరేకత



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలను ఈసారి ఎలాగైనా ఓడించేందుకు కాంగ్రెస్ ప్రత్యేక వ్యూహాలు రచిస్తోంది. తమ పార్టీ గుర్తుపై గెలిచి, అధికార పార్టీలో చేరిన వారి ఓటమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఆయా నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టి, సిట్టింగ్‌లపై ఉన్న వ్యతిరేకతను అందిపుచ్చుకుని వీరిని ఓడించేందుకు కసరత్తు ముమ్మరం చేసింది.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో టార్గెటెడ్ పాలిటిక్స్ మొదలయ్యాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం, తాండూరు, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో ...11లో

ఆ మూడు నియోజకవర్గాలపై గురి

మహేశ్వరంలో సబితాఇంద్రారెడ్డి, ఎల్బీనగర్‌లో సుధీర్‌రెడ్డి, తాండూరులో పైలెట్ రోహిత్‌రెడ్డిలను ఓడించడమే లక్ష్యంగా ఆ ప్రాంతాల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు కాంగ్రెస్ రంగం సిద్ధం చేసింది. సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థికి దీటుగా గౌడ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్‌ను బరిలో నిలుపనుంది. ఇక మహేశ్వరంలో సబితాఇంద్రారెడ్డికి గట్టి పోటీనిచ్చేందుకు బలమైన నాయకుడి కోసం అన్వేషణ చేస్తోంది. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ గెలుపు కోసం ఆశావహులు ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావాలని అధిష్టానం అల్టిమేటం జారీ చేసింది. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత తీగల కృష్ణారెడ్డిని పార్టీలో చేర్చుకుని ఈ ప్రాంతం నుంచి బరిలో నిలిపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. తాండూరు నియోజవర్గంలో పైలెట్ రోహిత్‌రెడ్డికి పోటీగా సీనియర్ నాయకులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్)ని బరిలో దింపాలని పార్టీ భావిస్తోంది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	57,380	▼ 660
22 క్యారెట్లు	52,600	▼ 600
కిలో వెండి	73,500	▼ 2000



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 124
రిటైల్ (లైవ్)	రూ. 146
స్కిన్‌తో	రూ. 212
స్కిన్‌లెస్	రూ. 241

అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాల్సిందే...

- రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలి : మోడీ సర్కారుకు ఎస్‌కేఎం, కార్మిక సంఘాల హెచ్చరిక



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్‌ఖేరిలో (అక్టోబర్3,2023) రైతులు చేపట్టిన శాంతియుత ర్యాలీపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా కుమారుడు వాహనాలతో తొక్కించారని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ దుస్సంఘటనకు ఏడాది గడిచినా కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించాయి. అందుకు నిరసనగా మంగళవారం హైదరాబాద్‌లోని నారాయణ గూడ ఫ్లై ఓవర్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ డౌన్, డౌన్, కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తేవాలి. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలి. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి. సాగర్, పశ్యపద్మ, ప్రసాదన్న, ఎన్ బాల మల్లేష్, పాలడుగు భాస్కర్ (సీఐటీయూ), బాలరాజు (ఏఐటీయూసీ), చంద్రశేఖర్ (ఐఎన్‌టీయూసీ), సూర్యం (ఐఎఫ్‌టీయూ) మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఉత్తరప్రదేశ్ లఖింపూర్ ఖేరిలో శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న రైతులను కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశీష్ మిశ్రా కార్లతో తొక్కించి నలుగురు రైతు ఉద్యమకారులను అత్యంత కిరాతకంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేసినా కేంద్ర మోడీ ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. హత్యాకాండకు కారణమైన కేంద్రహోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అతని కుమారున్ని బీజేపీ గుండాలను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ అంశాన్ని యావత్తు దేశం ముక్తకంఠంతో నినదించినా కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా లఖింపూర్ ఖేరి హత్యాకాండకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అజయ్ మిశ్రాను కేంద్ర మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.

హామీల అమలేది?

ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేస్తోందని విమర్శించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకొవస్తామని చెప్పి ఒక కమిటీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణ విమోచన చట్టాన్ని తెచ్చి రైతాంగాన్ని ఆత్మహత్యల నుంచి రక్షిస్తామంటూ ఉత్త మాటలు చెబుతున్నారని విమర్శించారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లులో వ్యవసాయరంగాన్ని మినహాయిస్తామంటూనే మాట తప్పిందన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేలా కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. రైతు ఉద్యమం సందర్భంగా పెట్టిన కేసులను రద్దు చేస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. దొడ్డి దారిన వ్యవసాయచట్టాలను తిరిగి పునరుద్ధరించే కుట్ర చేస్తోందన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా అనేక ప్రయత్నాలను మోడీ ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలని కోరారు. మోడీ ప్రభుత్వ రైతాంగ,కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక,కర్షక ఐక్యతతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

మంత్రి అజయ్‌కుమార్ మిశ్రాను బర్తరఫ్ చేయాలి

- సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో నిరసనలు

నవతెలంగాణ- విలేకరులు

లఖింపూర్ ఖేరి దుస్సంఘటనలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో మంగళవారం దేశ వ్యాప్తంగా బ్లాక్ డేకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జనగామ జిల్లా పాలకుర్తి చౌరస్తాలో నిరసన తెలిపారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని మంచికంటి భవన్ నుంచి ప్రదర్శనగా బస్టాండ్ సెంటర్‌కి చేరుకొని అక్కడ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని కొత్త బస్టాండ్ దగ్గర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. భువనగిరి జిల్లాకేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోనిని సుభాష్ చంద్ర బోస్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మిర్యాలగూడలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి బ్లాక్ డే నిర్వహించారు. నకిరేకల్ పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, జె వెంకటేష్, రమ, వంగూరు రాములు (సీఐటీయూ), రెబ్బరామారావు(హెచ్ఎంఎస్), ఏఐఎఫ్‌టీయూ (న్యూ) మోడెం మల్లేష్, మూడ్ శోభన్ (తెలంగాణ రైతు సంఘం), బుర్రి ప్రసాద్ (తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం), బాలమల్లేష్, కాంతయ్య (వ్యవసాయకార్మిక సంఘం), శ్రీరాంనాయక్, ధర్మానాయక్ (తెలంగాణ గిరిజన సంఘం), కిషోర్, ప్రేమ్ పావని, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో అక్రమాలను అరికట్టాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీని అరికట్టాలని కోరింది. మంగళవారం హైదరాబాద్‌లో కేంద్ర ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, డిజి నరసింహారావు, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి పాల్గొన్నారు. వివిధ అంశాలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో నంద్యాల నర్సింహారెడ్డి, డిజి నరసింహారావు మాట్లాడుతూ 2018లో అసెంబ్లీ, 2019లో పార్లమెంటు ఎన్నికల్లో ఉత్పన్నమైన సమస్యలు పునరావృతం కాకుండా ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఓటరు జాబితాలో ఇబ్బందులొచ్చాయని చెప్పారు. అదే సమయంలో ఇక్కడ పోలింగ్ తక్కువగా నమోదైందని అన్నారు. ఎన్నికల సందర్భంగా డబ్బును జప్తు చేశారని వివరించారు. వాటిపై ఏం చర్యలు తీసుకున్నారో ఈసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితాను సమగ్రంగా రూపొందించాలని కోరారు. ఒక్కొక్కరికీ రెండు, మూడు ఓట్లు లేకుండా చూడాలని సూచించారు.

ఒక మనిషికి ఒక ఓటు ఉండాలన్నారు. దీంతో శాంతిభద్రతల సమస్య లేకుండా ఉంటుందని చెప్పారు. హైదరాబాద్‌లో పోలింగ్ తగ్గడానికి ఇక్కడ ఉంటే వారికి రెండు చోట్ల ఓట్లుండడం, పోలింగ్ బూత్‌లపై అవగాహన లేకపోవడమే కారణమని అన్నారు. క్రిమినల్ కేసు ఉండనే పేరుతో ఎన్నికల ఏజెంట్, లెక్కింపు ఏజెంట్‌గా ఉండనివ్వడం లేదన్నారు. నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసు రుజువై శిక్ష పడిన వారినే ఏజెంట్‌గా నియమించడానికి వీల్లేదని చెప్పారు. కేసు ఉన్నంత మాత్రాన నేరస్తులు కాదనీ, దీన్ని ఈసీ గుర్తించాలని కోరారు. ఎన్నికల సమయంలో అవినీతి, డబ్బు, మద్యం పంపిణీ విచ్చలవిడిగా సాగుతున్నదని విమర్శించారు. నిబంధనలను ఉల్లంఘించి పలు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఖర్చు చేస్తున్నారని అన్నారు. వాటిమీద ఈసీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. సాంకేతికంగా న్యాయం చేస్తున్నామంటూ అధికారులు చెప్తున్నారని వివరించారు. ఇప్పటికే కొందరు అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వివిధ రూపాల్లో ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు.

దుబ్బాకలో ఓ పార్టీకి చెందిన అభ్యర్థి చీరలు పంచారని గుర్తు చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం, డబ్బు, మద్యంను నియంత్రించాలని కోరారు. అధికారులు పక్షపాతంతో కాకుండా నిష్పక్షపాతంతో వ్యవహరించాలని చెప్పారు. ఆస్తులు, క్రిమినల్ కేసులకు సంబంధించిన వివరాలను అభ్యర్థులతోపాటు ఈసీ కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 80 ఏండ్లు దాటిన వృద్ధుల ఇంటివద్దకే వెళ్లి ఓటును తీసుకోవాలని ఈసీ నిర్ణయించడాన్ని స్వాగతించామని అన్నారు. వికలాంగులు వరుసక్రమంలో నిలబడకుండా నేరుగా వెళ్లి ఓటేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అంశాలపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల కమిషన్ అధికారులు సమాధానమిచ్చారని చెప్పారు.

10న ఎన్నికల షెడ్యూల్ ?

(మొదటిపేజీ తరువాయి)

14న రానుందనే ఊహాగానాలు కూడా వస్తున్నాయి. కేంద్రం ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్ బృందం ఇప్పటికే కసరత్తు పూర్తిచేసినట్టు సమాచారం. తెలంగాణ(119 సీట్లు)తోపాటు రాజస్థాన్(200), మిజోరం(40), ఛత్తీస్‌గఢ్(90), మధ్యప్రదేశ్(230)లలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాలకు ఒకేసారి షెడ్యూల్ విడుదల చేసేందుకు కేంద్రం ఎన్నికల సంఘం సమాయత్తమైంది. ఈనేపథ్యంలోనే ప్రధాని మోడీ ఆయా రాష్ట్రాల్లో వేగంగా పర్యటిస్తూ హామీలు గుప్పిస్తున్నారు. కొత్త సీసాలో పాతసారా లాగా పాత హామీలను మళ్లీ కొత్తగా ఇస్తున్నారు. గతంలో ప్రకటించినవే మళ్లీ చెప్పడం గమనార్హం. మహబూబ్‌నగర్ పర్యటన పూర్తికాగానే వెంటనే పసుపు బోర్డు మంజూరు పేరుతో నిజామాబాద్ జిల్లా పర్యటన పెట్టుకున్నారు. అలాగే తెలంగాణ సీఎం సోమవారం ఉద్యోగులకు ప్రకటించిన పీఆర్సీ, ఐఆర్ కూడా ఆకోవలోనిదేనని సమాచారం. పీఆర్సీ ప్రకటనతో సంతోషించిన ఉద్యోగులు, ఐఆర్ పై పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం కంటే దారుణంగా ప్రకటించారని అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఐఆర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఇదిలావుండగా ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన బందం మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకున్నది.

తెలంగాణకు వచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ సారథ్యంలోని 17 మంది అధికారుల బందం హోటల్ తాజ్‌కష్ణాలో బసచేసింది. అక్కడే సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నది. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో సమావేశం కానుంది. కాగా, సీఈసీ బందం రాకతో అతిత్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నట్టు స్పష్టమైంది. రాష్ట్రానికి విచ్చేసిన ఎన్నికల అధికారుల బందంలో ఎలక్షన్ కమిషనర్ అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్, సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీశ్‌కుమార్ వ్యాస్, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు అజయ్ భాడూ, హిర్దేశ్‌కుమార్, ఆర్కే గుప్తా, మనోజ్‌కుమార్ సాహూ తదితరులు ఉన్నారు.

సీఈసీ బందంలోని అధికారులు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, సన్నద్ధతపై ఎన్నికల నిర్వహణ అధికారులు, సంస్థలతో సమీక్షిస్తారు. జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సమావేశమవుతారు. ప్రభుత్వపరంగా అందిస్తున్న సహకారంపై చర్చించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతోనూ ఈ బందం ప్రత్యేకంగా సమావేశమవుతుంది. పర్యటన చివరిరోజున పత్రికా సమావేశం నిర్వహించి వివరాలు చెప్పనున్నారు. కాగా మొత్తం ఐదు రాష్ట్రాల్లో 619 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నికల గడువు 2014, జనవరి 24తో ముగియనుండగా, ఒక్క మిజోరంలో మాత్రం ఈ ఏడాది డిసెంబరు 17 వరకే ఉంది. అందుకే ఒకేసారి ఐదు రాష్ట్రాల ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తున్నది.

ఎన్నికల ప్రణాళికలో
మత్స్యకారుల సమస్యలు పొందుపర్చాలి

సంక్షేమానికి రూ. వెయ్యి కోట్లు కేటాయించి అమలు చేయాలి

- తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల ప్రణాళికల్లో మత్స్యకారుల, కార్మికుల సమస్యలు పొందుపర్చాలనీ, వారి సంక్షేమానికి రూ. వెయ్యి కోట్లు కేటాయించి ప్రణాళికా బద్ధంగా ఖర్చు చేయాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లలోని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి ఎన్నికలకు ముందే ఎన్సీడీసీ ద్వారా రూ. 1000 కోట్లతో 64 రకాల సంక్షేమ పథకాలు అమలు చేసి మత్స్యకార కుటుంబాలని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి మత్స్య సొసైటీకి రూ. 10 లక్షల ఆర్థిక సహాయం చేయాలన్నారు. మత్స్య మహిళా సొసైటీలకు రూ.5 లక్షలివ్వాలనీ, 50 ఏండ్లు నిండిన ప్రతి మత్స్య కారుడికి రూ. 5 వేల వృద్ధాప్య పింఛ ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మత్స్య కారులకు ఎంతో మేలు చేస్తున్నట్టు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందనీ, అదంతా ప్రచారమేనని విమర్శించారు. వాస్తవంగా క్షేత్ర స్థాయిలో మత్స్యకారుల పరిస్థితి కడు దీనంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వారికి మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకుంటున్నారనీ, ఆ తర్వాత వారికిచ్చిన వాగ్దానాలు మరిచిపోతున్నారని విమర్శించారు. మత్స్యకారులు, కార్మికుల అభివృద్ధి జరగాలంటే మేము ప్రతిపాదిస్తున్న 15డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కమిషనర్ లచ్చిరాం భూక్యా, ఫెడరేషన్ చైర్మెన్ పిట్టల రవీందర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మురారి మోహన్, చనమోని శంకర్, రాష్ట్ర కార్యదర్శులు ఎం.రమేష్, గొడుగు వెంకట్, రాష్ట్ర నాయకులు సిహెచ్ వెంకన్న, బొడ్డు బాల సైదులు, బక్క బాలమణి, చంద్రి పుష్ప, కె లక్ష్మీ, ఎస్ మంగమ్మ, బోద్రమోని నర్సింహ్మా, రావణమోని రాజు, నీళ్ళ కృష్ణ, సాదు యాదయ్య, కె.నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఐఐటీ బాంబే జరిమానా

- శాఖాహారులకు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటుపై నిరసన ఫలితం

ముంబయి: శాఖాహార భోజనం చేసే వారికి ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించినందుకు ఓ విద్యార్థి కి ఐఐటీ బాంబే పదివేల రూపాయల జరిమానా విధించింది. మూడు హాస్టళ్లకు చెందిన ఉమ్మడి క్యాంటీన్‌లో మాంసాహారం తినని వారి కోసం ఆరు టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఐఐటీ మెస్ కౌన్సిల్ గత వారం ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శాఖాహారులకు కేటాయించిన ఓ టేబుల్‌పై గత నెల 28న కొందరు విద్యార్థులు మాంసాహారాన్ని భుజించారు. తమ నిరసనను ఈ-మెయిల్ రూపంలో అధికారులకు తెలియజేశారు. విద్యార్థుల నిరసనను మెస్ కౌన్సిల్ ప్రస్తావిస్తూ 'ఈ చర్య భోజనశాలలో శాంతియుత వాతావరణానికి, సామరస్యానికి విఘాతం కలిగించేదిగా ఉంది. విద్యార్థి వ్యవహారాల అసోసి యేట్ డీన్ సలహాను ధిక్కరిం చేదిగా ఉంది' అని తెలిపింది. కాగా ఇది ఆధునిక కాలంలో అంటరానితనాన్ని ప్రోత్స హించేదిగా ఉన్నదని అంబేద్కర్ పెరి యార్ పూలే స్టడీ సర్కిల్ విమర్శించింది. బాంబే ఐఐటీ లోని భోజనశాలలో శాఖాహారులకు అనధికారికంగా కొంత ప్రదేశాన్ని కేటాయించడంపై జూలైలోనే వివాదం చెలరేగింది.

రైలు ప్రారంభోత్సవంలో పోటాపోటీగా నినాదాలు

- బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఉద్రిక్త వాతావరణం
- సీఎం కేసీఆర్ ఫోటో లేకపోవడంతో.. మోడీ ఫ్లెక్సీ చింపివేత



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట నుంచి సికింద్రాబాదకు వెళ్లే ప్యాసింజర్ రైలు ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు సముదాయించినా కార్యకర్తలు ఎవరూ కూడా తగ్గ లేదు. కార్యకర్తలు, పోలీసుల తోపులాటలో కుర్చీలన్నీ చిందరవందరగా పడిపోయాయి. అలంకరించిన పూలకుండీలన్నీ విరిగిపోయాయి. స్టేజీ మీద ఉన్న ఫ్లెక్సీలో సీఎం కేసీఆర్ ఫోటో లేదంటూ బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీలను చింపి వేశారు. ఏర్పాటుచేసిన ఎల్ఈడీ టీవీలను తొలగించారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. కానీ నాయకులను చూసి కార్యకర్తలు మరింతగా పోటాపోటీగా నినాదాలు చేసుకోవడంతో, తోపులాట మూలంగా పేరుకు మాత్రమే జెండా ఊపి రైలును ప్రారంభించినట్టుగా కార్యక్రమం జరిగింది. ప్రధాని మోడీ నిజమాబాద్‌కు ఆలస్యంగా చేరుకోవడంతో మూడు గంటలకు వెళ్లాల్సిన రైలు 4 గంటల 20 నిమిషాలకు మోడీ వర్చువల్ ద్వారా ప్రారంభించిన తర్వాతనే సిద్దిపేట నుంచి కదిలింది.

గృహలక్ష్మిపై ప్రశ్నించిన మహిళ పట్ల ఎమ్మెల్యే దురుసు వ్యాఖ్యలు

- దు:ఖంతో వెళ్లిపోయిన బాధితురాలు



నవతెలంగాణ-వేములపల్లి

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భాస్కరరావు మహిళ పట్ల దురుసు వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో.. గ్రామానికి చెందిన వనం విజయ తనకు గృహలక్ష్మి పథకం కింద పేరు నమోదైతే తొలగించారని ఆవేదన వెలిబుచ్చింది. ప్రసంగం మధ్యలో మాట్లాడటంతో అసహనానికి గురైన ఎమ్మెల్యే ఆమెపై ఆగ్రహంతో ఊగిపోయారు. 'పనికిమాలిన దానా.. నీకు ఇల్లు పెట్టను పో.. ఏం చేసుకుంటావో చేసుకో.. దాన్ని బయటకి నెట్టేయండి' అంటూ రాయలేని విధంగా అసభ్యకరంగా వ్యవహరించారు. అక్కడే ఉన్న పోలీసులు ఆమెను బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాటల తో అవమానానికి గురైన ఆ మహిళ తీవ్ర దు:ఖంతో బయటకు వెళ్లిపోయింది. ఎమ్మెల్యే ప్రవర్తించిన తీరు పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగానే పోటీ

ఎంపీ రాంజీ గౌతమ్

- సిర్పూర్ నుంచి అర్.ఎస్.ప్రవీణ్ కుమార్ పోటీ
- బీసీలకు 60-70 స్థానాలు
- అభ్యర్థుల తొలిజాబితా విడుదల :ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాబలంతో వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుస్తామని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ బీఎస్పీ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఆచరణ కానీ అబద్ధపు హామీలతో మోసపూరిత ప్రణాళికలను ప్రజలెవరు నమ్మొద్దన్నారు.

ఈ మేరకు 20 మంది అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేశారు. సిర్పూర్ (జనరల్)- అర్.ఎస్. ప్రవీణ్ కుమార్, జహీరాబాద్ (ఎస్సీ) - జంగం గోపీ , పెద్దపల్లి (జనరల్) - దాసరి ఉష,తాండూరు (జనరల్) - చంద్రశేఖర్ ముదిరాజ్ ,దేవరకొండ (ఎస్టీ)- డా.ముడావత్ వెంకటేష్ చౌహాన్,చొప్పదండి (ఎస్సీ) - కొంకటి శేఖర్ , పాలేరు (జనరల్)- అల్లిక వెంకటే శ్వర్ రావు, నకిరేకల్ (ఎస్సీ) - మేడి ప్రియదర్శిని, వైరా (ఎస్టీ)- బానోత్ రాంబాబు నాయక్ , ధర్మపురి (ఎస్సీ) - నక్క విజయ్ కుమార్, వనపర్తి (జనరల్) - నాగ మోని చెన్న రాములు, మానుకొం డూరు (ఎస్సీ) - నిషాని రామ చందర్, కోదాడ (జనరల్) - పిల్లుట్ల శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ (జనరల్) - కొత్తపల్లి కుమార్ , ఖానాపూర్ (ఎస్టీ)- బాన్సీలాల్ రాథోడ్, అం దోల్ (ఎస్సీ) - ముప్పారపు ప్రకాష్ , సూర్యాపేట (జనరల్) - వట్టే జానయ్య యాదవ్, వికారాబాద్ (ఎస్సీ) - గోర్లకాడి క్రాంతి కుమార్ , కొత్తగూడెం (జనరల్) - ఎర్ర కామేష్ , జుక్కల్ (ఎస్సీ) - ప్రద్యుకుమార్ మాధవరావు.

న్యూస్‌క్లిక్‌పై కేంద్రం దాడులకు జర్నలిస్టు సంఘాల ఖండన

నవతెలంగాణ-హైదరాబాద్

ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్‌క్లిక్‌కు చైనాతో సంబంధాలు ఉన్నాయంటూ అక్రమ కేసులు పెట్టి దాడులు చేయడాన్ని పలు జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. వాస్తవాలు చెబుతూ, ప్రజా సమస్యలను సమాజం దృష్టికి తీసుకుపోవడమే న్యూస్‌క్లిక్ చేసిన నేరమా అంటూ ప్రశ్నించాయి. ఇప్పటికే పలుమార్లు రకరకాల కారణాలతో దాడులకు దిగిన కేంద్రం, తన జేబు సంస్థలను అందుకు పావులుగా వాడుకుంటున్నదని విమర్శిం చాయి. న్యూస్ క్లిక్ ఆఫీసులు, ఆ సంస్థలో పనిచేసే జర్నలిస్టుల ఇండ్లల్లో ఢిల్లీ పోలీసులు భారీగా సోదాలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడాన్ని నిలదీశాయి. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి దాడుల చేయాల్సిన అవ సరమేంటని అడిగాయి. 500 మంది పోలీసు లతో 100 ప్రాంతాల్లో దాడులు చేసి ప్రజాస్వామ్యా న్ని కేంద్రం హత్యచేసిందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ (ఈడీ)తో దాడీ చేయించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ఢిల్లీ పోలీసులను వాడుకోవడాన్ని దివాళాకోరుతనంగా పేర్కొన్నాయి.



ఖమ్మంలో...



కరీంనగర్‌లో...



ఆశాలపై పోలీసుల పిడిగుద్దులు

మంత్రి గంగుల ఇంటి ఎదుట ఉద్రిక్తత | అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులు | కాళ్లతో తన్నుతూ లాక్కెళ్లి అరెస్ట్

ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి.. పారితోషికంలో లేని పనులను తమతో చేయించొద్దంటూ సమ్మె చేస్తున్న ఆశాల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. సమ్మెపై ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యాలయాల ముట్టడి చేపట్టారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ ఇంటి వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సీఐటీయూ నాయకులు, ఆశాలపై పిడిగుద్దులు గుద్దుతూ.. కాలితో తన్నుతూ బట్టలు చింపేసి దాడి చేశారు. మంత్రిని కలిపిస్తాం.. లోపలికెళ్లండంటూ తీసుకెళ్లి అరెస్టు చేశారు.

- రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యే కార్యాలయాల ముట్టడి
- సమస్యలను పరిష్కరించాలని వినతి
- పలుచోట్ల అడ్డుకున్న పోలీసులు

నవతెలంగాణ - విలేకరులు

కరీంనగర్‌లో భారీ ర్యాలీ తీసి మంత్రి గంగుల కమలాకర్ ఇంటి ముట్టడి చేపట్టారు. శాంతియుతంగా నిరసన చేపట్టి వినతిపత్రం ఇస్తామని, మంత్రిని కల్పించాలని కోరిన సీఐటీయూ నాయకులను పోలీసులు అడ్డుకోగా తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. సీఐటీయూ నాయకులు ఎడ్ల రమేష్, గుడికందుల సత్యం, ఉప్పునుటి శ్రీనివాస్‌పై పోలీసులు పిడి గుద్దులు గుద్దారు. కాలితో తన్నుతూ బట్టలు చింపేసి దాడి చేశారు. ఆశా కార్యకర్తలైన మహిళలపై పోలీసులు చేతులు వేస్తూ తోసేశారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ వచ్చి పది మంది మాత్రమే లోపలికి వెళ్లాలని సూచించగా, వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న తరుణంలో ముకుమ్మడిగా అరెస్టు చేశారు. నాయకులను టూటౌన్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఆశావర్కర్లు 40మందిని త్రీటౌన్‌కు తరలించారు. 75మంది ఆశా కార్యకర్తలును సీపీటీసీకి తరలించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా కోశాధికారి విజయలక్ష్మి, నాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్ ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు నల్ల జెండాలు పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన మధ్యంతర భృతిలో ఆశాల పేరు లేకపోవడం వారిని దగా చేయడమే సీఐటీయూ నేతలు అన్నారు. మధ్యంతర భృతి, పీఆర్సీతో సంబంధం లేకుండా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ర్యాలీకి వస్తున్న 40 మంది ఆశాలను సికింద్రాబాద్ రేతి ఫైల్ బస్ స్టేషన్ వద్ద అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం ఆశా వర్కర్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు కూడా వినతిపత్రాలు అందజేశారు. బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు రిక్షా తొక్కుతూ నిరసన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు, చేవెళ్లలో ఎమ్మెల్యే కాలే యాదయ్యకు వినతిపత్రం అందజేశారు.

హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ క్యాంప్ ఆఫీస్ ఎదుట ఆశాలు ధర్నా చేపట్టారు. తొలుత పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడే బైటాయించారు. చివరకు పోలీసులు వారిని వినయ్‌భాస్కర్ వద్దకు తీసుకెళ్లారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇంటి వద్ద ధర్నా చేశారు.

ఖమ్మంలోని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ క్యాంప్ కార్యాలయం వద్దకు ధర్నాకు వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే బైటాయించారు. ఆశాలను లోపలికి అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు, ఆశా కార్యకర్తలకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం టూ టౌన్ సీఐ ఆశాలను మంత్రి వద్దకు తీసుకెళ్లగా వినతిపత్రం అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తెలిపారు.

వైరాలో ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట బైటాయించిన నిరసన తెలిపారు. భద్రాచలంలో ఆశా కార్యకర్తలు ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అశ్వారావుపేటలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఇల్లందులో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే బయటకు వచ్చి వారి సమస్యలు విన్నారు.

ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఆయన లేకపోవడంతో ప్రధాన ద్వారానికి వినతిపత్రాన్ని అంటించారు. ఖానాపూర్ పట్టణంలో ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకునికి వినతిపత్రాన్ని అందించారు. నిర్మల్‌లో ర్యాలీగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు.



హైదరాబాద్‌లో...



వరంగల్‌లో...

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- కోఠి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద ధర్నా
- భారీగా పోలీసుల మోహరింపు, అరెస్టు
- నేడు పీహెచ్‌సీల ఎదుట నిరసనలకు పిలుపు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, రాత పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ సీఐటీయూ) యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కోఠి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. వివిధ జిల్లాల నుంచి ఏఎన్ఎంలు పెద్ద సంఖ్యలో వచ్చారు. పోలీసులు భారీగా మోహరించి వచ్చిన వారిని వచ్చినట్టే అరెస్టు చేశారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆవరణ పోలీసులతో నిండిపోయింది. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను అరెస్టు చేసి అంబర్‌పేట్, లాలాగూడ, అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టు అయిన వారిలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్, అధ్యక్షులు ఎండీ పసియోద్దీన్, హైదరాబాద్ నగర అధ్యక్షులు జె.కుమార్ స్వామి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్మయి, వివిధ జిల్లాల నాయకులు మంగా, లక్ష్మీబాయి,రమా, షీలా, భవాని, ధనలక్ష్మి, రాజేశ్వరి, బాలమణి, దైవమని తదితరులున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా ధర్నాకు కూడా అనుమతించకపోవడం దుర్మార్గం అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కమిటీ వేసింది.. నెల రోజులు అయినా ఫలితం లేదన్నారు. రెగ్యులర్ కాలేదు, పరీక్ష రద్దు కాలేదన్నారు. ఏరియర్స్ ఇవ్వలేదని చెప్పారు. సమ్మె కాలం వేతనాలు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులు, నిర్బంధం, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల ఎదుట దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో త్వరలో జరిగే శాసనసభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీలు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరాయి. ఎన్నికల్లో నగదు, మద్యం పంపిణీని అరికట్టేలా గట్టి నిఘా ఉంచాలనీ, దొంగ ఓట్ల తొలగింపు, కొత్త ఓట్ల చేర్పు పారదర్శకంగా జరిగేలా అధికారులను అప్రమత్తంచేయాలని ఈసీకి విజ్ఞప్తి చేశాయి. రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వంలో ఎన్నికల కమిషనర్లు అనుప్‌చంద్ర, అరుణ్‌గోయల్, ఇతర అధికారులు మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్నారు. సీఈసీ బృందం మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. మొదటి రోజు మంగళవారం నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైంది. గడువు ముగిసేలోగా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని సీఈసీ రాజీవ్ కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన చర్యలను వివరించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో సమస్యలను ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సీఈసీ బృందం దృష్టికి తీసుకెళ్లారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిస్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఫిరోజ్‌ఖాన్ ఈసీ బృందానికి సూచించారు. బోగస్ ఓట్లు, అధికార దుర్వినియోగం, నగదు, మద్యం పంపిణీ..తదితర అంశాలను ఇప్పటికే ఈసీ దృష్టికి తీసుకెళ్లామనీ, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలను తీసుకొచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుందని దీన్ని అరికట్టాలని సీఈసీని కోరారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఓటు నమోదు ప్రక్రియ సరిగా జరగలేదనీ, అధికార బీఆర్ఎస్ పార్టీ అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నదని బీజేపీ ప్రతినిధులు ఓం పాఠక్, మర్రి శశిధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఇతర రాష్ట్రాల అధికారులకు ఎన్నికల విధులు అప్పగించాలని కోరారు. బోగస్ ఓట్లను తొలగించాలనీ, ఎన్నికల పరిశీలకులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈసీకి సూచించారు. ఎన్నికల్లో నగదు ఏరులై పారుతోందని, దాన్ని కట్టడి చేసేందుకు ఈసీ అధిక ప్రాధాన్యతనివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, టి.జ్యోతి, నంద్యాల నర్సింహారెడ్డి ఈసీకి సూచించారు. హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారని గుర్తు చేశారు. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నాయనీ, వాటిపై సీరియస్‌గా వ్యవహరించాలని బీఎస్పీ నేత విజయసూర్య క్షత్రియ విజ్ఞప్తి చేశారు. డ్రగ్ మాఫియా, లిక్కర్ మాఫియాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. బోగస్ ఓట్లను కట్టడి చేయాలని ఆప్ నేత సుధాకర్ కోరారు. ఓటర్ల నమోదులో అవకతవకలను ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. తమపార్టీ ఎన్నికల గుర్తు కారును పోలిన ట్రక్ గుర్తుల వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతున్నదనీ, దాన్ని ఎవరికీ కేటాయించొద్దని బీఆర్ఎస్ నేత వినోద్ కుమార్ ఈసీని కోరారు. సోషల్‌మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేస్తున్నవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల వ్యయాన్ని పెంచాలనీ, రిటర్నింగ్ అధికారులకు పూర్తి అధికారాలివ్వాలని కోరారు. బోగస్ ఓట్ల తొలగింపులో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలనీ, స్థానికంగా ఉన్న ఓటర్లకు నష్టం జరగకుండా చూడాలని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ సీఈసీ బృందాన్ని కోరారు. ఎన్నికలను నిస్పక్షపాతంగా నిర్వహించాలని టీడీపీ, వైఎస్సార్‌టీపీ ప్రతినిధులు ఈసీకి విజ్ఞప్తి చేశాయి.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సీఈసీ సమావేశం

రాజకీయ పార్టీలతో సమావేశానంతరం సీఈసీ బృందం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అధికారులతో సమావేశమయింది. త్వరలో ఎన్నికల షెడ్యూల్ వస్తున్న నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయా ఏజెన్సీలను సీఈసీ రాజీవ్‌కుమార్ ఆదేశించారు. నిస్పక్షపాతంగా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని స్పష్టంచేశారు. సమావేశంలో పోలీస్, ఎక్సైజ్, సీబీడీటీ, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్, ఎస్ఎల్‌బీసీ, ఆర్‌బీఐ,డీఆర్ఐ, ఈడీ, ఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎఎఐ, ఏవియేషన్ కార్పొరేషన్, రవాణా,అటవీ, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహిళా హక్కుల కోసం ఉద్యమం

- 33శాతం రిజర్వేషన్లు 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలి : మల్లు లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా హక్కుల కోసం ఉద్యమించాలనీ, 33 శాతం రిజర్వేషన్లను 2024 ఎన్నికల్లో అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు.' బీజేపీ, బీఆర్ఎస్‌ను గద్దె దించుదాం, మహిళలను, దేశాన్ని రక్షించుకుందాం' అంటూ చలో ఢిల్లీ కార్యక్రమానికి ర్యాలీగా బయలు దేరారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పాలకుల విధానాల నుంచి మహిళలను, దేశాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. వీరి విధానాల వల్ల మహిళలపై నిత్యం దాడులు, దౌర్జన్యాలు, లైంగిక దాడులు నిత్యకృత్యమయ్యాని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లుగా మహిళా రిజర్వేషన్ల కోసం పోరాటాలు నిర్వహిస్తున్నా..పట్టించుకోని వారు రిజర్వేషన్ల చట్టం చేశారనీ, అయితే..ప్రస్తుత ఎన్నికల్లో అమలు చేయకుండా కాలయాపనకు కుట్ర జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా పోరాటాల ఫలితంగా వచ్చిన రిజర్వేషన్లను 2024 ఎన్నికల్లో అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలపై, బతుకు తెరువులపై ముందెన్నడూ లేని రీతిలో దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు ఏమి మాట్లాడాలి, ఏ ఆహారం తినాలి, ఏ బట్ట కట్టాలన్నది బీజేపీ నాయకులు శాసిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఈ పద్ధతి తగదని హితవు పలికారు. మరో పక్క నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదలపై భారాలు మోపుతున్నారని, వీటిపై దృష్టి పెట్టకుండా మహిళలను కించపరిచే విధంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు.

నేటి నుంచి మానసిక ఆరోగ్య వారోత్సవాలు

- అక్టోబర్ 10న మానసిక ఆరోగ్య దినోత్సవం : డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం అక్టోబర్ 10 సందర్భంగా వారం రోజులపాటు మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలను అక్టోబర్ 4 నుంచి 10 వరకు నిర్వహించనున్నట్టు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్-ఇండియా జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నవభారత లయన్స్ క్లబ్, ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో ఏడు రోజుల పాటు కార్యక్రమాలుంటాయని తెలిపారు. మానసిక ఆరోగ్యం సార్వత్రిక హక్కనీ, అది అనారోగ్యం పాలైతే వ్యక్తిత్వాన్ని చంపేస్తుందని తెలిపారు. రామకృష్ణ మఠం బాలల సేవా విభాగం, ఇందిరా పార్క్, ఎస్సీ బాలికల హాస్టల్లో, మాడపాటి హనుమంతరావు ఉన్నత పాఠశాలలో, మొరంబంద పాఠశాలలో జరుగుతాయని వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు 9390044031/40 ఉచిత ఫోన్ కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జి.మహేంద్ర కుమార్ రెడ్డి, డాక్టర్ రవ్వ హరి కుమార్, సి.హెచ్.గోపాల్ కృష్ణ, బి. వినయ్, జి.కృష్ణవేణి, డా.స్వరూపా రాణి, అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సైకాలజిస్టులు డా.జి.వీరభద్రం, డా.క్యార్లిన్, ఆంధ్ర సైకాలజిస్టులు డా.జనార్ధనం, డా.మహాలక్ష్మీ కుమార్, డా.పి.రమేష్ కుమార్, డా.శ్రీనివాస్, డా.లలిత పాల్గొంటారని తెలిపారు.

పేదల గుడిసెల జోలికి వస్తే ఖబర్దార్

- ఇండ్ల స్థలాలకు పట్టాలివ్వాల్సిందే
- భూకబ్జాదారులు, గుండాలను తరిమికొడతాం
- భూపాలపల్లి, హన్మకొండ జిల్లాల్లోని భూపోరాట కేంద్రాల్లో.. : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య



నవతెలంగాణ-భూపాలపల్లి/ హనుమకొండ చౌరస్తా

పేదల ఇండ్ల స్థలాలకు పట్టాలు, ఇండ్లు కట్టించి ఇవ్వాల్సిందేనని, భూకబ్జాదారులు, గుండాలను తరమికొట్టి వారి సమస్యలు పరిష్కరించేవరకూ పేదోళ్లకు ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య తెలిపారు. జయశంకర్-భూపాలపల్లి, హన్మకొండ జిల్లాలో పేదలు వేసుకున్న గుడిసె ప్రాంతాలను మంగళవారం ఆయన సందర్శించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువులోని సర్వేనెంబర్-280, 282, 283, 284, 285లో పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని సందర్శించిన అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు, రాష్ట్రవ్యాప్తంగా 66 కేంద్రాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసెల పోరాటం కొనసాగుతుందన్నారు. వరంగల్ జిల్లాలోని జక్కలొద్ది భూ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు 58, 59 జీవో ప్రకారం ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాదిగా ప్రజలు ఎండనక, వాననక కారు చీకట్లో కూడా ఎన్నో కష్టాలనోర్చుకుని గుడిసెలల్లో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం సర్వే చేసి ఇండ్లు లేని పేదలకు ఇండ్లు నిర్మించి వారికి అండగా నిలిచిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో గుడిసెలు వేసుకున్న పేద ప్రజలకు ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.10 లక్షలు.. మొత్తం రూ.15లక్షలు.. ఇల్లు కట్టుకోవడానికి ఇవ్వాలని కోరారు. లేదంటే ప్రజలను సమీకరించి ప్రభుత్వాన్ని గద్దెదించే వరకూ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

హన్మకొండ జిల్లా గోపాల్‌పూర్ భూ పోరాట కేంద్రంలో హన్మకొండ పశ్చిమ మండల కార్యదర్శి వంకుడోత్ వీరన్న నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వీరయ్య మాట్లాడారు. 21 ఎకరాల గోపాల్‌పూర్ చెరువులో 14 ఎకరాలు కబ్జాకు గురికాగా మిగిలిన 7 ఎకరాల భూమిలో పేదలు గుడిసెలు వేసుకుంటే జేసీబీలతో కూల్చి వేస్తూ వారి కడుపుకొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్.. ఎక్కడ ఖాళీ జాగాలు కనబడితే వాటిని కబ్జా చేయడం తన పని అని, ఇప్పటికైనా కార్పొరేటర్ ఆగడాలను స్థానిక ఎమ్మెల్యే కట్టడి చేయాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల కోసం మన దగ్గర కొచ్చే బీజేపీ, బీఆర్ఎస్ బీఆర్ఎస్ నాయకులకు మన ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఇండ్ల పట్టాలిచ్చేంతవరకు ఐక్యంగా పోరాటం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశాల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, హన్మకొండ జిల్లా కార్యదర్శి బోట్ల చక్రపాణి, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశెట్టి రాజయ్య, రజినీకాంత్, గుర్రం దేవేందర్, ఆత్మూరి శ్రీకాంత్, హన్మకొండ పశ్చిమ మండల కమిటీ సభ్యులు కే.రవీందర్, బోట్ల స్వామిదాస్, వి.రాజు, ప్రజా సంఘాల నాయకులు, గుడిసె వాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖలో జీవో 142 రద్దు చేయాలి

- 5న చలో డైరెక్టరేట్
- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో జీవో 142ను రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగుల యూనియన్స్, అసోసియేషన్స్‌ల రౌండ్ టేబుల్ సమావేశానికి కె.యాదానాయక్ (సీఐటీయూ) అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ల యూనియన్ నుండి డాక్టర్ బి రమేష్, డాక్టర్ లాలు ప్రసాద్ (డాక్టర్స్ యూనియన్), కె.సాయి రెడ్డి, రాజశేఖర్, రాబర్ట్ బ్రూస్ (టిఆర్ఎస్కేవి), కె.యాదానాయక్, బలరాం (సీఐటీయూ) శ్యాంసుందర్, వెంకటేశ్వర రెడ్డి (ఐఎన్ టీయూసీ), భరత్ సత్యనారాయణ, చంద్ర ప్రకాష్ (సీహెచ్‌ఓల అసోసియేషన్), కొప్పు ప్రసాద్ (హెల్త్ ఎక్స్‌టెన్షన్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్), రామేశ్వరి (ఏఎన్ఎం,హెచ్‌వి,పిహెచ్ఎన్ అసోసియేషన్), రామలక్ష్మి (ఎస్సీ.ఎస్టీ అసోసియేషన్), వీరారెడ్డి (ఫార్మసిస్టుల అసోసియేషన్), శ్రీనివాస్ (బీసీ ఉద్యోగుల అసోసియేషన్), తిరుపతి (ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్) పాల్గొన్నారు. జీవో 142ను రద్దు చేయాలనీ, అక్టోబర్ 5న (నేడు) ఉదయం 10 గంటలకు ఛలో డైరెక్టరేట్ నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఛలో డైరెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో డాక్టర్ వసంత్, డాక్టర్ అన్నపూర్ణ, అశోక్, ప్రకాష్, గుండయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావులను కలిసి ప్రయత్నించినట్టు తెలిపారు. అయితే అధికార యంత్రాంగం నుంచి సరైన సమాధానం లభించకపోవడం, నిర్లక్ష్య వైఖరి ఉద్యోగ సంఘాల నాయకులను అనివార్యంగా ఐక్య ఉద్యమాల వైపుకు నడిపించిందని తెలిపారు. వైద్యారోగ్యశాఖలో కార్మిక సంఘాలు, క్యాడర్ సంఘాలు జీవో 142 రద్దు పోరాట కమిటీగా ఏర్పడి సమ్మె నోటీస్ ఇచ్చాయని వారు గుర్తుచేశారు.

దేశంలోనే అత్యంత మలేరియా ప్రభావిత ప్రాంతాలైన భద్రాచలం, ములుగు, ఆసిఫాబాద్ వంటి ఏజెన్సీ జిల్లాలకు జిల్లా మలేరియా అధికారి, మలేరియా సబ్ యూనిట్ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్లలో పర్యవేక్షించే 63 డిప్యూటీ డీఎంహెచ్‌ఓలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్లను తీసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్ సీల్లో నాలుగవ తరగతి ఉద్యోగుల పోస్టులు తీసేసిన వారికే ఊడ్చేది, తూడ్చేది ఎవరనేది తెలియాలని ఎద్దేవా చేశారు. 24 గంటలు నడిచే పీహెచ్‌సీల్లో నైట్ వాచ్‌మెన్‌తో పాటు అనేక రకాల పోస్టులను తీసేశారని తెలిపారు. 1,217 పోస్టులను సూపర్ న్యూమరరీగా చూపిస్తూ రద్దు చేస్తే ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ ఏ విధంగా బలోపేతమవుతుందని ప్రశ్నించారు.

తప్పుదోవ పట్టిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ఆరోగ్యానికి పెడుతున్న ఖర్చుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని వారు విమర్శించారు. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, పౌష్టికాహారం కూడా ఆరోగ్య పద్దులో కలిపేస్తున్నదని వివరించారు. రాష్ట్రంలో అత్యధిక మందికి నేటికి నాణ్యమైన విద్య అందుబాటులో లేదని చెప్పారు. గర్భిణులను డోలీ కట్టి మోసుకుపోవడం ఇప్పటికీ అప్పుడప్పుడు జరుగుతూనే ఉన్నదని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు సరైన శిక్షణ లేని వారి వద్ద అనధికార వైద్యం చేసుకుని ప్రాణాల మీదకు తెచ్చు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పటిష్టంగా లేని కారణంగా నగరాల్లోని పెద్దాస్పత్రులు, బోధనా స్పత్రుల వద్ద మితిమీరిన రద్దు రోజుకు 4 నుంచి 6 వేల వరకుంటున్నదన్నారు. సాలీన తెలుగు రాష్ట్రాల్లో 46 లక్షల కుటుంబాలు వైద్య ఖర్చుల కారణంగా మధ్య తరగతి నుంచి పేదరికంలోకి జారిపోతున్నాయని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 3 వేల జనాభాకు, మైదాన ప్రాంతాల్లో 5 వేల జనాభాకు ఒక సబ్ సెంటర్ ఏర్పాటు చేసి అందులో ఎంపీహెచ్ డబ్ల్యూ (ఎఫ్), ఎంపీహెచ్ డబ్ల్యూ (ఎం) పోస్టులు ఉండేలా చూడాలని ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ కమిటీ చెబు తున్నదని గుర్తుచేశారు. అయితే ఆ ప్రమాణాలకు భిన్నంగా జీవో 142లో 26 పీపీ యూనిట్లలో ఉన్న ఏఎన్ఎం పోస్టులను తీసేశారని విమర్శిం చారు. కొత్త సబ్ సెంటర్లను ఏర్పాటు చేస్తే 20 ఏండ్ల నుంచి పని చేస్తున్న ఏఎన్ఎం, సెకెండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయవచ్చని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా 23 జిల్లాలు, 40 మండలాలు, జోన్లు, గ్రామ పంచాయితీలను పెంచిన సర్కారు జనాభా ప్రాతిపదికన ఏఎన్ఎం సబ్ సెంటర్లను ఎందుకు పెంచలేదని? వారు ప్రశ్నించారు.

రేపటినుంచి 'ఎస్ఏ-1' పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 11 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. సవరించిన టైంటేబుల్‌ను ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థుల వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఆరో తరగతి వారికి ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు జరుగుతాయని పేర్కొన్నారు. ఏడో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. తొమ్మిదో తరగతి వారికి మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి ఈనెల 30న ఫలితాలను ప్రకటించాలని వివరించారు. వచ్చేనెల ఒకటిన తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి మార్కుల రికార్డులను అందజేయడంతోపాటు విద్యార్థుల పురోగతిపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్చించాలని సూచించారు. ఈనెల 13 నుంచి 25 వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు దసరా సెలవులుంటాయి.


వామ్మో జ్వరం...

సంపాదకీయం

రాష్ట్రాన్ని దోమలు కాటేస్తున్నాయి. వైరల్ జ్వరాలు చుట్టుముడుతున్నాయి. మనుషులను పీడిస్తున్నాయి. ప్రతియేటా వచ్చే తంతే కదా అని నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యమే చెల్లించాల్సి రావచ్చు. ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో వచ్చిన అకాల మార్పులతో సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్లతో ప్రజానీకం అవస్థలు అన్నీ ఇన్నీ కావు. డయేరియా,

ఇటీవల 857 రకాల మందుల ధరలను పెంచిన కేంద్రం, ప్రజారోగ్యంతో పరాచకాలడుతున్నది. కార్పొరేట్ వైద్యాన్ని ప్రోత్సహించేలా బీజేపీ విధానముంది. రాష్ట్ర ప్రభుత్వానిది అదే దారి. కేంద్రమైనా, రాష్ట్రమైనా ప్రజారోగ్య వ్యవస్థలో ప్రజలకు అందుబాటులో ఉండే పీహెచ్‌సీల ప్రాధాన్యతను గుర్తించాలి. మహిళలు, పిల్లల ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్య పథకాలు, ప్రధాన ఆరోగ్య పరిశోధనా కార్యక్రమాలు కలిగిన ప్రధాన జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రామ్‌ను బలోపేతం చేసే ప్రజారోగ్య వ్యవస్థకు నిధులు పెంచాలి. ప్రజల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. అప్పుడే ప్రజలకు మేలు.

టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, అతిసార వంటి వాటికి బాధితులై జనం ఆస్పత్రుల బాట పడుతున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ విష జ్వరాలతో విలవిల్లాడుతోంది. చివరికి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే ఈ అవస్థ తప్పకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. దీంతో ఏకంగా క్యాబినెట్ సమావేశాన్నే వాయిదా వేసినట్టుగా వార్తలొచ్చాయి. ఇప్పుడు రాష్ట్ర రాజధాని సైతం ఇందుకు మినహాయింపు కాదనడానికి స్థానిక ప్రభుత్వాసుపత్రులే సాక్ష్యం. జనంతో కూడిన క్యూలు దోమల్లా గిజగిజలాడుతున్నాయి. రాజధానిలోని గాంధీ ఆస్పత్రి, కోరంటి ఫీవర్ ఆస్పత్రికి జ్వరాలతో వస్తున్న వారి సంఖ్య రోజుకు వందల్లో ఉంటున్నది. ఇది నిజం కాదంటారా ?



పదేండ్ల ప్రగతిపేరుతో ఇటీవల అనేక విజయాలను సాధించామంటూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నివేదిక విడుదల చేశారు. బడ్జెట్‌ను భారీగా పెంచామనీ, బెడ్ల సంఖ్యను అధికం చేశామనీ, ప్రతి బెడ్‌కూ ఆక్సిజన్ సౌకర్యాన్ని అందు బాటులోకి తెచ్చామని చెప్పుకొచ్చారు. మంచిదే. ఇవన్నీ ఒక పార్శ్వం. కానీ, ఆరోగ్యశాఖ అంతర్గత వ్యవహారాలు రాష్ట్ర భౌతిక పరిస్థితులను చక్కబెట్టేందుకు సంసిద్ధంగా లేవనేది స్పష్టం. ఎన్ని చేసినా, కీలక సేవలు అందించే పీహెచ్‌సీల బలోపేతమేది? డాక్టర్లు, నర్సు, సిబ్బంది పోస్టుల భర్తీ అంతంతే. ఆశాలు సమ్మెలో ఉన్నారు. జీవో 142తో నాలుగు వేల పోస్టులు రద్దయ్యే ప్రమాదముందంటూ అన్నీ కేటగిరీల అధికారులు, ఉద్యోగులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమైతే, బాధిత ప్రజలకు ఎలా సేవలు అందిస్తారు? ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.

రోగులకు యుద్ధ ప్రాతికన చికిత్సను అందించడమే సర్కారు లక్ష్యం కావాలి. మెడికల్ టెస్టులను ఉచితం చేసి, త్వరిత గతిన రిపోర్టులు వచ్చేలా చూడాలి. కరోనాతో చితికిపోయిన పేద బతుకులకు ఆసరానివ్వాలి. ప్రజల ప్రాణాల కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు లక్షల రూపాయలు కుమ్మరిస్తూ ఆర్థికంగా వేదన పడుతున్నారు. ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించే సర్కారు మాటలు కోటలు దాటుతున్నా, చేతలు గడప దాటడం లేదు. దోమల నివారణకు ఫాగింగ్‌తో పాటు దోమ తెరలను ప్రజలకు అందించాలి. ఏజెన్సీకి ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణతో పాటు బృందాలనూ పెంచాలి. చెత్తను, నిలువనీటి గుంటలు లేకుండా చూడాలి. కేసుల తీవ్రత అధికంగా ఉన్న చోటనే కాదు, అన్ని జిల్లాల్లోనూ వానలు ముదరకముందే డ్రెయినేజీల మరమ్మతులన్నీ యుద్ధ ప్రాతికదిన చేసి ఉంటే ప్రస్తుత ఈ దుస్థితి దాపురించేదే కాదు. ఎక్కడా పారిశుద్య లోపాలకు తావివ్వ కూడదన్న స్పృహ ప్రభుత్వానికి లేపోవడం విచారకరం. రక్షిత తాగునీటి సరఫరాలో తీసుకునే జాగ్రత్తలే, దోమల సంతతిని నియంత్రిస్తాయి. ఈ సర్కారీ అలసత్వం కొనసాగినంత కాలం వైరల్ జ్వరాల కట్టడి ఎండమావే.

డెంగ్యూ కారక దోమ ద్వారా వచ్చే 'జికా' కేసులు గతంలో కేవలం గుజరాత్, తమిళనాడుకే పరిమితమయ్యేవి. ఇప్పుడవి తెలంగాణనూ తాకాయి. ప్లేట్‌లెట్ల పేరు చెప్పి రోగుల సంబంధీకులను బెంబేలెత్తించి లక్షల రూపాయలు గుంజేస్తున్న ఆస్పత్రుల దౌర్జన్యాలను అంచనా వేసి, వాటిని కట్టడి చేసేదెవరు? ఉపాధి హామీ చట్టం బడ్జెట్‌లాగే ఆరోగ్య రంగానికి మోడీ సర్కారు రూ.92 వేల కోట్ల నుంచి రూ.89 వేల కోట్లకు బడ్జెట్ కేటాయింపులు కుదించింది. ఇటీవల 857 రకాల మందుల ధరలను పెంచిన కేంద్రం, ప్రజారోగ్యంతో పరాచకాలాడుతున్నది. కార్పొరేట్ వైద్యాన్ని ప్రోత్సహించేలా బీజేపీ విధాన ముంది. రాష్ట్ర ప్రభుత్వానిది అదే దారి. కేంద్రమైనా, రాష్ట్రమైనా ప్రజారోగ్యవ్యవస్థలో ప్రజలకు అందుబాటులో ఉండే పీహెచ్‌సీల ప్రాధాన్యతను గుర్తించాలి. మహిళలు, పిల్లల ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్య పథకాలు, ప్రధాన ఆరోగ్య పరిశోధనా కార్యక్రమాలు కలిగిన ప్రధాన జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రామ్‌ను బలోపేతం చేసే ప్రజారోగ్య వ్యవస్థకు నిధులు పెంచాలి. ప్రజల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. అప్పుడే ప్రజలకు మేలు.



హక్కుల పరిరక్షణకు
మహిళల మహాగర్జన

తెలంగాణ రాష్ట్రవ్యాపితంగా ఐద్వా నిర్వహించిన జాతాలు విజయవంతమయ్యాయి. ప్రజల నుండి అపూర్వ స్పందన వచ్చింది. మహిళల్లో అత్యంత ఉత్సాహాన్ని నింపాయని చెప్పవచ్చు. ఐద్వా కార్యకర్తలు ఎర్రంచు తెల్లచీరలు (యూనిఫాం) ధరించి 10నుండి 15మంది చొప్పున దళాలుగా ఏర్పడి రోజుకు 15నుంచి 20 గ్రామాలు, మండల కేంద్రాలలో పర్యటిస్తూ మహిళల స్థితిగతుల్ని వివరించారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 9 సంవత్సరాలలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. జిఎస్‌టి పేరుతో అల్పాహారం మొదలుకొని ప్రతి వస్తువుపై పన్నులు వేసి ప్రజల రక్తాన్ని జలగల్లాగా పీలుస్తున్నది. మరోపక్క సంపన్నులకు వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్ము రాయితీల పేరుతో అప్పనంగా ఇవ్వటంపై విస్తృతంగా క్యాంపెయిన్ చేశారు. మనుస్మృతినే రాజ్యాంగంగా అమలు చేస్తున్న తీరు, ప్రజలు పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగ విలువల్ని తుంగలో తొక్కి మహిళల హక్కుల్ని కాలరాస్తున్న వైనం, పిల్లలు వేసుకునే డ్రస్సుల వలన అత్యాచారాలు జరుగుతున్నాయని పేలేవారి గురించి వివరించాము. స్త్రీల కట్టుబొట్టూపైనా, రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యాలపైనా ఆంక్షలు విధించే బీజేపీకి హఠాత్తుగా మహిళలపై ప్రేమ పుట్టుకొచ్చి 33శాతం రిజర్వేషన్ బిల్లు తెచ్చిందా? మణిపూర్, ఇతర ఘటనల నేపథ్యంలో రానున్న ఎన్నికలను దష్టిలో పెట్టుకుని చేసిందా? పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి దేశ ప్రథమ మహిళ, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకపోవడంపై జనం ఛీకొట్టిన తీరు, మోడీ పాలనకు నూకలు చెల్లాయని ఇంత హడావిడిగా ఈ బిల్లు తెచ్చిందో అర్థం చేసుకోమని మహిళల్ని, సమాజాన్ని ఆలోచింపజేసే పద్ధతిలో జాతాల ప్రచారం జరిగింది.

ఇక రాష్ట్ర రాజకీయాలను చూస్తే, గత అనేక సంవత్సరాలుగా పేదలు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ధర్నాలు, పోరాటాలు చేయని రోజు లేదు. అయినా కేసీఆర్ ప్రభుత్వానికి చలనం కలగకపోగా గుడిసెలు ఖాళీ చేయించే పేరుతో మహిళలపై లాఠీలు ఝుళిపిస్తున్నది. కనీస వేతనాల కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ, ఆశావర్కర్లపై పోలీసుని ఉసిగొలిపి చిత్రహింసలకు గురిచేస్తూ ఉంది. చాలీచాలని జీతాలు, కూలితో కడుపు నింపుకుందామంటే వచ్చే కొద్దిపాటి ఆదాయం సారాయి, మద్యం షాపుల ద్వారా గెద్దలాగా తన్నుకుపోతున్నది. 80శాతం పురుషులు తాగుడుకి బానిసలయ్యారు. తల్లిదండ్రులు, భార్యాబిడ్డల్ని పోషించలేని పరిస్థితుల్లో యువత ఉన్నది. పేదల బతుకులు బతుకులు వీధుల పాలవుతున్నాయి. తాగితాగి రోగాలపాలై ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ప్రభుత్వానికి సిగ్గులేదు. పైగా కేటీఆర్ లాంటి యువనాయకుడు లేస్తే అభివద్ధి గురించి మాట్లాడతాడు. ఆచరణ మాత్రం శూన్యం. ఇదే విషయాలు జాతాల్లో మాట్లాడుతుంటే, జనగామ జిల్లాలో తాగుడుకి బానిసలైన సోదరులు, 'అమ్మా మంచిమాటలు చెప్పారని' దండాలు పెట్టిన స్థితి. ముఖ్యంగా తెలంగాణ సాయుధ రైతాంగ వీరోచిత పోరాట ప్రాంతాలైన జనగామ, సూర్యాపేట, నల్గొండ, భువనగిరి, ఖమ్మం జిల్లాల్లో ప్రయాణిస్తూ ప్రజల్ని చైతన్యం చేస్తూ, మళ్ళీ అటువంటి దోపిడీ శక్తుల్ని తరిమి తరిమి కొడితే తప్ప మహిళల జీవితాల్లో మార్పు సాధ్యం కాదని, మహిళలందరూ ఒక స్వరాజ్యం, ఐలమ్మ, కమలమ్మలు కావాలని జాతా పిలుపునిచ్చింది. సెప్టెంబరు 25న ప్రారంభమైన జాతా 30వ తేదీన ముగిసింది. ఏకకాలంలో 5 జిల్లాల్లో 6 రోజులపాటు 45 మండలాలు, 10 పట్టణ కేంద్రాలలో పర్యటించింది. 110 గ్రూపు మీటింగులలో వేలాదిమంది మహిళలు పాల్గొన్నారు. ప్రసంగాలను ఎంతో శ్రద్ధగా విన్నారు. తదుపరి కార్యక్రమం మహిళల మహా గర్జన చలో ఢిల్లీ. దీన్ని అక్టోబర్ 5న నిర్వహించ తలపెట్టాము. ఇప్పటికే చాలా జిల్లాల నుంచి మహిళలు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాము.

- బి హైమావతి, 9391360886

మాల్దీవుల ఎన్నికలు : చిన్న దేశం, పెద్ద చర్చ!

మాల్దీవులు, ప్రపంచంలోని అతి చిన్న దేశాలలో ఒకటి. ఆసియాలో రెండవది. కేవలం ఐదు లక్షల 21వేల జనాభా మాత్రమే కలిగిన ఈ దేశం ఇప్పుడు ప్రపంచ మీడియాలో పెద్ద స్థానాన్ని ఆక్రమించింది.కారణం గతనెల 30న అక్కడ జరిగిన అధ్యక్ష ఎన్నికల ఫలితాలు. వాటి మీద ప్రపంచ మీడియాలో వచ్చిన కొన్ని శీర్షికలు ఇలా ఉన్నాయి. "మాల్దీవుల ఎన్నికల్లో మహమ్మద్ ముయిజ్జు గెలుపు చైనా అనుకూల శిబిరానికి విజయం" భారత్‌కు మాల్దీవుల నూతన అధ్య క్షుడు ఒక దౌత్యసవాలుకు ప్రతినిధి" "చైనా చెవులకు సంగీత విందు" "భారత్ వెళ్లిపోవాలంటున్న మాల్దీవుల చైనా అనుకూల నూతన అధ్యక్షుడు" ఇలా పద జాలాల్లో మార్పు ఉన్నప్పటికీ స్పందన స్వభావమిది. హిందూ మహా సముద్రంలో మనదేశం, శ్రీలంకకు 750 కిలోమీటర్ల దూరంలో ఈ దేశం ఉంది. నామమాత్రంగా క్రైస్తవులు తప్ప నూటికి నూరుశాతం ముస్లింలు ఉన్న 1,200 చిన్నా పెద్ద దీవుల దేశానికి ఎవరితోనూ సరిహద్దు తగాదాలు లేవు. దేశ రాజధాని మాలె దీవిలో దేశంలోని సగం జనాభా ఉంది. చైనా నుంచి విమాన మార్గం 4,900 కిలోమీటర్ల దూరం ఉంది. సముద్ర మార్గంలో 4,682 నాటికల్ మైళ్ల లేదా 8,670 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రపంచంలో ఏ దేశమూ మరొక దేశాన్ని విశ్వసించక పరస్పరం అనుమానంతో చూస్తున్న అంశం తెలిసిందే. ప్రాంతీయ, ప్రపంచ యుద్ధాలు తలెత్తితే సముద్రాల్లోని ఒక చిన్న దీవి, దాని మీద పెత్తనం లేదా ఎవరి ప్రభావంలో ఉంది అన్న అంశం కూడా ఎంతో కీలకమైనదే. అందువల్లనే ఆయా దేశాల మిలిటరీ వ్యూహకర్తలు రూపొందించిన ప్రణాళికలు, ఎత్తుగడల ప్రకారం ఇరుగు పొరుగు, దూరంగా ఉన్న దేశాలు కూడా సంబంధాలను నిర్వహిస్తుంటాయి. అలాంటి కీలక ప్రాంతాలలో ఒకటిగా మాల్దీవులు ఉన్న కారణంగానే అక్కడ జరిగే ప్రతి పరిణామాన్ని ప్రపంచం జాగ్రత్తగా గమనిస్తుంది.



ఎం కోటేశ్వరరావు
8331013288

ప్రస్తుతం అధికారంలో ఉన్న ఇబ్రహీం మహమ్మద్ సొలి 2018లో అధికారానికి వచ్చాడు. అంతకు ముందు అధ్యక్షుడిగా ఉన్న అబ్దుల్లా యామీన్ మీద అవినీతి ఆరోపణల కేసులు పెట్టి పదకొండు సంవత్సరాల పాటు జైలు శిక్ష వేయించాడని ఆరోపణ ఉంది. సదరు యామీన్ ప్రభుత్వంలో మంత్రి, రాజకీయ వారసుడే నూతన అధ్యక్షుడు ముయిజ్జు. అక్కడి విధానం ప్రకారం ఐదు సంవత్సరాలకు ఒకసారి అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. ఎందరైనా పోటీ పడవచ్చు. పోలైన ఓట్లలో 50శాతం పైగా ఓట్లు తెచ్చుకున్న అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఒక వేళ అలా తెచ్చుకోని పక్షంలో అధిక ఓట్లు తెచ్చుకొని మొదటి రెండు స్థానాల్లో ఉన్న వారి మధ్య 21వ రోజున తిరిగి పోటీ నిర్వహిస్తారు. సెప్టెంబరు 9న జరిగిన ఎన్నికల్లో మొత్తం ఎనిమిది మంది పోటీ చేశారు. వారిలో పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ తరఫున 45 ఏండ్ల మహమ్మద్ ముయిజ్జు 46.06శాతం ఓట్లు తెచ్చుకోగా రెండవ స్థానంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ఇబ్రహీం మహమ్మద్ సొలి 39.05 తెచ్చుకున్నాడు. సొలి నాయకత్వంలోని మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీలో ఎన్నికల ముందు చీలిక వచ్చింది. విడిపోయిన వారు డెమోక్రాట్స్ పేరుతో పోటీ చేసి 7.18శాతం తెచ్చుకున్నారు. సెప్టెంబరు 30న రెండవసారి ఎన్నిక జరిగింది. ముయిజ్జు 54.04 శాతం తెచ్చుకున్నాడు.నవంబరు 17న అధికారాన్ని స్వీకరిస్తాడు, ప్రస్తుతం రాజధాని మాలె నగర మేయర్‌గా పని చేస్తున్నాడు. ఈ ఎన్నికల నిర్వహణ గురించి ఎలాంటి ఫిర్యాదులు లేవు. మాల్దీవుల ట్రాన్స్‌ఫరెన్సీ అనే సంస్థ ఎన్నికల హింసాకాండ ఉదంతాలు కొన్ని జరిగినట్లు చెప్పటం తప్ప వివరాలను వెల్లడించలేదు. అర్హులైన రెండు లక్షల 82వేల మంది ఓటర్లలో తొలి దఫా 79.85, తుది విడత 87.31 శాతం ఓట్లు వేశారు.

ఈ ఎన్నిక ఒక విధంగా చెప్పాలంటే చైనా- భారత్ మధ్య పోటీగా జరిగిందంటే అతిశయోక్తి కాదు. బహుశా ఎక్కడా ఇంత బాహటంగా రాజకీయ పార్టీలు పోటీ చేసి ఉండవు. ఈ ఎన్నికలు తమ పౌరుల దేశ భక్తికి ఒక ప్రతిబింబమని, మా ఇరుగు పొరుగు వారు, భాగస్వాములు తమ స్వాతంత్ర్యం, సర్వ సత్తాకతను పూర్తిగా గౌరవించాలని ఇచ్చిన ఒక పిలుపు అని పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ కూటమి ప్రతినిధి వ్యాఖ్యానించాడు. చైనా బిఆర్ఐ పథకం కింద పెద్దఎత్తున మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసిన గత ప్రభుత్వంలో గృహశాఖ మంత్రిగా ముయిజ్జు పని చేశాడు. తాను అధికారానికి వస్తే రెండు దేశాల మధ్య మరో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతానని గతేడాదే ప్రకటించాడు. 2018లో అధికారానికి వచ్చిన సొలి తన పాలనా కాలంలో విచక్షణారహితంగా భారత ప్రవేశా నికి అవకాశమిచ్చినట్లు విమర్శలు చేశాడు. చివరికి భారత మిలిటరీని కూడా దేశంలో అనుమతించాడని, తాను అధికా రానికి వస్తే దళాలను వెనక్కు పంపటమేగాక ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా వాణిజ్య సంబంధాలను సమ తూకంలో ఉండేట్లు చూస్తానని వాగ్దానం చేశాడు. రెండు దేశాల మధ్య కుదిరిన ఒక ఒప్పందం మేరకు ఒక డాక్‌యార్డ్ నిర్మాణ పర్యవేక్షణకు మాత్రమే భారత సైనికులు ఉన్నారని సొలి సమర్థించుకున్నాడు. కొత్త ప్రభుత్వం భారత్-చైనాల పట్ల ఎలాంటి వైఖరిని అనుసరిస్తుందనే అంశంపై విమర్శకులు భిన్నాభిప్రాయాలు వెల్లడిస్తు న్నారు. చైనాకు ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ భారత్‌ను తక్కువ చేయదన్నది వాటిలో ఒకటి.

రద్దీగా ఉండే తూర్పు-పశ్చిమ దేశాల నౌకా రవాణా మార్గంలో మాల్దీవులు కీలకమైన ప్రాంతంలో ఉంది. అమెరికా విశాల మిలిటరీ వ్యూహంలో హిందూ మహా సముద్రం ఎంతో ముఖ్యమైనది. ఈ కారణంగానే బ్రిటీష్ ఆక్రమించిన మారిషస్‌కు చెందిన డిగోగార్సియా దీవులను అమెరికా తన ఆధీనంలోకి తెచ్చుకొని ఖాళీ చేసేందుకు మొరాయిస్తున్నది. అక్కడ ఒక సైనిక స్థావరాన్ని కూడా నిర్మించింది. మనదేశంలోని కన్యాకుమారికి ఆ దీవులు 1,796కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. అది మన దేశంతో పాటు పరిసరాల్లోని అన్ని దేశాలకూ ఆందోళన కలిగించే అంశమే. బంగాళాఖాతం, హిందూ మహా సముద్రం, అరేబియా సముద్ర ప్రాంతంలోని కొన్ని దేశాలు అమెరికా పట్టునుంచి విడివడటం, అవి క్రమంగా చైనాకు సన్నిహితం కావటం అమెరికా, ఇతర పశ్చిమ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఆ వరుసలో మాల్దీవులు కూడా చేరితే ఏమిటన్నదే వారి ఆందోళన. ఈ పరిణామం భారత భద్రతకు ముప్పు అని మన దేశానికి అవి చెబుతున్నాయి. ఆ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యత కారణంగా 1965లో బ్రిటన్ ఆక్రమణ నుంచి స్వాతంత్ర్యం పొందిన తరువాత మన దేశం అన్ని రంగాలలో దగ్గరయ్యేందుకు చూసింది. అనేక విధాలుగా సాయం చేసింది. 1988లో దాదాపు రెండు వందల మంది తమిళ ఉగ్రవాదులు మాల్దీవులకు వెళ్లి నాటి అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్ మీద తిరుగుబాటు చేసి కీలకమైన ప్రాంతాలన్నింటినీ పట్టుకున్నారు. తమను అదుకోవాలని అనేక దేశాలను గయూమ్ కోరినా ఎవరూ ముందుకు రాలేదు. భారత్ స్పందించింది, ఆపరేషన్ కాక్టస్ పేరుతో ఆగ్రా వైమానిక దళ కేంద్రం నుంచి ఐదు వందల మంది పారా ట్రూపర్లను ఎక్కడా ఆపకుండా నేరుగా మాల్దీవుల్లో దించి కుట్రను విఫలం గావించింది. అనేక మంది కుట్రదారులను కాల్చి చంపి, కొందరిని బందీలుగా పట్టుకుంది. అప్పటి నుంచి సంబంధాలు మరింతగా బలపడ్డాయి.

తరువాత జరిగిన పరిణామాల్లో దీవుల ఆర్థిక సమస్యలను, పౌరుల జీవితాలను మెరుగుపరచటంలో పాలకుల వైఫల్యం కారణంగా జనంలో అసంతృప్తి తలెత్తింది. సరిగ్గా అదే సమయంలో చైనా తన బిఆర్ఐ పథకాన్ని ముందుకు తెచ్చింది. ఐఎంఎఫ్, ప్రపంచబాంక్, అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మాదిరి కఠినమైనవి కాకుండా సాధారణ షరతులతో ప్రాజెక్టులకు చైనా రుణాలు ఇచ్చింది. దాంతో 2013లో అధికారానికి వచ్చిన అబ్దుల్లా యామిన్ చైనాతో సంబంధాలను పెంచుకున్నాడు. 2018లో గెలిచిన ఇబ్రహీం సొలి భారత్‌కు పెద్ద పీట అనే విధానంతో మన దేశానికి సన్నిహితంగా భాగస్వామ్య ఒప్పందాలను చేసు



ఈ ఎన్నిక ఒక విధంగా చెప్పాలంటే చైనా-భారత్ మధ్య పోటీగా జరిగిందంటే అతిశయోక్తి కాదు. బహుశా ఎక్కడా ఇంత బాహాటంగా రాజకీయ పార్టీలు పోటీ చేసి ఉండవు. ఈ ఎన్నికలు తమ పౌరుల దేశ భక్తికి ఒక ప్రతిబింబమని, మా ఇరుగు పొరుగు వారు, భాగస్వాములు తమ స్వాతంత్ర్యం, సర్వసత్తాకతను పూర్తిగా గౌరవించాలని ఇచ్చిన ఒక పిలుపు అని పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ కూటమి ప్రతినిధి వ్యాఖ్యానించాడు. చైనా బిఆర్ఐ పథకం కింద పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసిన గత ప్రభుత్వంలో గృహశాఖ మంత్రిగా ముయిజ్జు పని చేశాడు. తాను అధికారానికి వస్తే రెండు దేశాల మధ్య మరో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతానని గతేడాదే ప్రకటించాడు.

కున్నాడు. అది తాజా ఎన్నికల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. 2020లో ప్రతిపక్షాలుగా ఉన్న మాల్దీవుల ప్రోగ్రెసివ్ పార్టీ, పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ ఒక కూటమిగా ఏర్పడి "భారత్‌ను బయటకు పంపాలి (భారత్ అవుట్)" అనే నినాదంతో ప్రచారాన్ని ప్రారంభించాయి. జనంలో ఉన్న భారత వ్యతిరేక మనోభావాలు కూడా దీనికి దోహదం చేశాయి. 1978లో అధ్యక్షుడిగా నియమితుడైన అబ్దుల్ గయూమ్ ప్రజాస్వామిక స్వేచ్ఛకు తిలోదకాలిచ్చి 2008లో ఓడిపోయే వరకు పదవిలో కొనసాగాడు. అతడి మీద జరిగిన కుట్రను భారత్ అడ్డుకొని అధికారంలో కొనసాగేందుకు దోహదం చేసింది. 2013లో పోటీ చేసిన యామిన్ ఈ గయూమ్‌కు సవతి సోదరుడు. ఆ ఎన్నికల్లో గయూమ్ అతనికి మద్దతు ఇచ్చాడు. తరువాత ఇద్దరి మధ్య తలెత్తిన విభేదాలతో గయూమ్ పార్టీని చీల్చి ప్రతిపక్షంతో చేతులు కలిపాడు. తరువాత ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్ర చేశాడనే ఆరోపణతో 2018లో అతన్ని అరెస్టు చేశారు. తరువాత బెయిలు మీద విడుదల చేశారు. మనదేశానికి చెందిన జిఎంఆర్ కంపెనీ మాలెలోని విమానాశ్రయ అభివృద్ధి నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. విదేశీ ప్రయాణీకులతో పాటు మాల్దీవుల పౌరుల మీద అభివృద్ధి పన్ను విధించటంతో అక్కడ వ్యతిరేకత వెల్లడైంది. దాని వెనుక అధ్యక్షుడు నషీద్ మద్దతు కూడా ఉందని చెబుతారు. అదే పెద్ద మనిషి మీద అవినీతి అక్రమాల ఆరోప ణలు వెల్లువెత్తటంతో జనంలో నిరసన తలెత్తి చివరకు 2012లో రాజీనామా చేసి పదవి నుంచి తప్పుకున్నాడు. జనం ఛీకొట్టిన నషీద్ మనదేశంతో తనకున్న సంబంధాలను ఉపయోగించుకొని అరెస్టు కాకుండా తప్పించుకో నేందుకు భారత రాయబార కార్యాలయంలో ఆశ్రయం పొందాడు. అది కూడా జనంలో మనదేశం మీద వ్యతిరేకత పెరిగేందుకు దోహదం చేసింది. దాన్ని ప్రతిపక్షాలు ఉపయోగించుకున్నాయి.

2013లో అధికారానికి వచ్చిన యామీన్ మరుసటి ఏడాది చైనా అధినేత షీ జింపింగ్‌ను పర్యటనకు ఆహ్వానించాడు. అధికారికంగా భారత్‌కు అగ్ర స్థానం అనే విధానం నుంచి వైదొల గనప్పటికీ చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాడు. మౌలిక సదుపాయాల పథకాలకు ఒప్పందం చేసుకున్నాడు. చైనాతో కలసి సాగర పరిశీలన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్చలు జరిపాడు. చైనాతో బంధం బలపడిన తరువాత 2018లో అప్పటివరకు మాల్దీవుల్లో నిర్వహిస్తున్న భారత హెలికాప్టర్లు, నిర్వహణ సిబ్బంది తమ దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నట్లు, గూఢచర్యం జరుపుతున్నట్లు ఆరోపించి వెంటనే వెనక్కు తీసుకోవాలని మనదేశాన్ని కోరాడు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో ఓడిపోయాడు. అధికారానికి వచ్చిన ఇబ్రహీం సొలి చైనా రుణ పథకాల నుంచి దేశాన్ని కాపాడినట్లు చెప్పుకున్నాడు. జనం విశ్వసించలేదు. ప్రపంచ బాంకు, ఐఎంఎఫ్ మాదిరి విధానపరమైన షరతులను ఎవరి మీద చైనా రుద్దలేదు. చైనా రుణాలు పుచ్చుకున్న దేశాలు, అందుకు చొరవ చూపిన అక్కడి పాలకులు అనుసరించిన విధానాల్లో ఏవైనా లోపాలు, అక్రమాలు, అవినీతి ఉంటే అవి ఆ దేశాల అంతర్గత అంశాలు. వాటి మంచి చెడ్డలను జనం చూసుకుంటారు. కానీ చైనా వ్యతిరేక పశ్చిమ దేశాలు, వాటికి వంతపాడే ఇతర దేశాల పాలకులు, మీడియా అనేక కట్టుకథలను వ్యాపింప చేస్తోంది. మాల్దీవుల్లో కూడా అదే జరిగింది. 2018లో యామీన్ పదవి నుంచి దిగిపోయే నాటికి ఉన్న పరిస్థితిని తిరిగి కొనసాగిస్తామని ముయిజ్జు ఎన్నికలకు ముందే స్పష్టం చేశాడు. అందువలన ఆ విధానాలకు అనుకూలంగా జనం ఇచ్చిన తీర్పుగా దీన్ని పరిగణించాలి తప్ప, భారత్‌కు ఎదురుదెబ్బ అనో మరో విధంగానో చిత్రించటం మన ప్రయోజనాలను కాపాడుకోవాలనే సరైన ఆలోచనలో భాగం కాదు. మాల్దీవులే కాదు మరేదేశానికైనా మన దేశం కూడా అభివృద్ధికి తోడ్పడి మనకు మిత్రదేశాలుగా ఉండేట్లు చూసుకోవాలి తప్ప అమెరికా రాజకీయంలో భాగంగా వ్యవహరించకూడదు.

సనాతన ధర్మం : వివేకానంద, తిలక్‌లకు స్ఫూర్తినిచ్చిందా?

సనాతన ధర్మంపై ఇటీవల కాలంలో పెద్దఎత్తున చర్చ మొదలైంది. సనాతనధర్మ అనుకూలురు అసలు సనాతన ధర్మమంటే ఏమిటో వివరించకుండా సనాతన ధర్మ వ్యతిరేకుల కండ్లు పీకేస్తామనో, పీక తెగ్గోస్తామనో హుంకరిస్తున్నారు. ఈ చర్చలోకి ప్రధాని మోడీ సైతం ప్రవేశించారు. ఆయన 'అహం కారపూరితమైన ప్రతిపక్ష కూటమి సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తోంది' అని విమర్శించారు. ఆయన కూడా సనాతన ధర్మం అంటే ఏమిటో వివరించలేదు. కాకపోతే స్వామి వివేకానంద, లోకమాన్య తిలక్ వంటివారికి సనాతన ధర్మం స్ఫూర్తినిచ్చిందని ప్రకటించారు. కాబట్టి ఇప్పుడు ముందుగా వివేకానందునికి సనాతన ధర్మం స్ఫూర్తినిచ్చిందో లేదో, ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.



కె.ఎల్. కాంతారావు
97052 81886

కొన్ని శతాబ్దాల నుండి మనదేశంలో పాతుకున్న మూఢ నమ్మకాలను గూర్చి వివేకానంద మాట్లాడుతూ... "మన ముఖం మీద బట్టును ఈ తీరుగా పెట్టుకోవాలా? ఆ తీరుగా పెట్టు కోవాలా? అంటూ శతాబ్దాలకొద్దీ ఒకరితో ఒకరు కొట్లాడుకుంటున్నాం. ఒక మనుష్యుని దఅష్టి నా అన్నాన్ని మైలబరుస్తుందా లేదా? అనే ఇట్టి మహా సమస్యలను గూర్చి సంపుటాల మీద సంపుటాలుగా గ్రంథాలను రాస్తున్నాం. కొన్ని శతాబ్దాల నుండి మనం చేస్తున్న పని ఇదే. ఇంత చక్కని సమస్యలతో, పరిశోధ నలతోనూ, మెదడు యొక్క బలాన్నంతటినీ వినియోగిస్తున్న జాతి ఇంకా ఏ ఘనకార్యం చేయగలదని మనం విశ్వసించగలం"? (శ్రీ వివేకానంద సాహితీ సర్వస్వం, సంపుటి ఆరు, పేజీ 133) పై వివరణ వివేకానంద సనాతన ధర్మం నుండి స్ఫూర్తి పొందినట్లు తెలియజేస్తుందా? లేక ఆయన సనాతన ధర్మాన్ని విమర్శిస్తున్నట్లా?అదే సంపుటిలో స్వామి వివేకానంద వేయి ఏండ్ల బానిసత్వానికి కారణాన్ని ఇలా వివరించారు.

"యుగాంతరాల నుండి సంపాదితమై, ధర్మకర్తగా బ్రాహ్మణుడు తన దగ్గర ఉంచుకున్న ఈ విజ్ఞానాన్ని అతడు మన సామాన్య జనానికి నాడు దానం చేయవలసి ఉంది. అతడలా ఇదివరకే దాన్ని ప్రజలకు దానం చేయని కారణంగానే, మహమ్మదీయుల దండయాత్ర సంభవించడానికి అవకాశం కలిగింది. ఈ మహానిధిని ప్రజలకై అతడు మొదటినుండి తెరవని కారణంగానే వేయి సంవత్సరాల నుండి భారతదేశం మీదికి రాదలచిన ప్రతి వాని పాదం క్రిందపడి మనం నలుగుతున్నాం. ఆ కారణం వల్లనే మనం భ్రష్టులమై పోయాం". (శ్రీ వివేకానంద సాహితీ సర్వస్వం, సంపుటి ఆరు, పేజీ 190).

మనదేశంలోని పేదల దుస్థితికి కారణాన్ని గూర్చి వివేకా నంద ఇలా ఆవేదన చెందారు." నా సోదరా! అగ్రకులస్తులు అధమ కులస్తులను ఏ విధంగా హింసించేవారో నేను కళ్ళారా చూశాను. పేదల దుస్థితిని పోగొట్టి, వారిని మాధవులుగా చేయ లేని మతం ఒక మతమా? మనది సనాతన మతమని చెప్పుకోవడానికి అర్హత ఉందా? అస్పృశ్యతే మన మతం. 'నన్ను ముట్టుకోకు,' 'నన్ను తాకవద్దు' అనేది మాత్రమే మన మతం. ఓరి భగవంతుడా! ఏ దేశంలో మహామహులు "అన్నం కుడి చేతితో తినాలా? ఎడమ చేతితో తినాలా? నీళ్ల కుడి చేతితో తాగాలా? ఎడమ చేతితో తాగాలా?" అనే సమస్యలను 2000 సంవత్సరాల నుండి తర్జనభర్జన చేస్తున్నారో, అటువంటి దేశం శిథిలం కాకపోతే మరే దేశం శిథిలమవుతుంది?" (శ్రీ వివేకానంద సాహితీ సర్వస్వం, సంపుటి 9, పేజీలు 131, 132). ఈ ప్రకటన సనాతన ధర్మం నుండి స్ఫూర్తి పొంది చేసినట్లుందా? సనాతన ధర్మాన్ని విమర్శించినట్లు ఉందా?

'నన్ను ముట్టుకోకు' అనే దురాచారం వివేకానందుని కాలంలోనే కాదు, 130 ఏండ్ల తర్వాత నేటికీ కొనసాగుతోంది. దీనికి రెండు ఉదాహరణలు ఇస్తాను. ఆంధ్రజ్యోతి 15ఏప్రిల్2022 నాటి వార్త ప్రకారం కర్నాటకలో ఒక మాజీ మంత్రి తాను తన గ్రామంలోని దేవాలయానికి ఇంతవరకు వెళ్లలేకపోయాననీ, కారణం తాను దళితుడిన నే నెపంతో ఆ గ్రామ పెద్దలూ, ఆ గుడి పూజారీ తనను ఆ దేవాలయ ప్రవేశానికి అంగీకరించ లేదనీ తెలిపారు. అలాగే 20సెప్టెంబర్2023 నాటి 'ది హిందూ'లో వచ్చిన వార్త ప్రకారం కేరళ దేవాలయ మంత్రి కే .రాధాకృష్ణన్‌కు ఒక ఆలయంలో దీపారాధన కుందిని అందించకుండా ఆ పూజారి దానిని కింద పెట్టించాడని, ఇది తనను చాలా బాధించిందని ఆ మంత్రి అన్నారు. స్వామి వివేకానంద విమర్శించిన ఇలాంటి సనాతన ధర్మాన్ని కాపాడుకుందామా? ఇక ప్రధాని మోడీ పేర్కొన్నట్లు సనాతన ధర్మంచేత స్ఫూర్తి పొందిన 'లోకమాన్య' తిలక్ ఎలాంటి ధర్మాన్ని మనకందించాడో కూడా ఇప్పుడు పరిశీలిద్దాం



స్త్రీ విద్యను గూర్చి తాను సంపాదకత్వం వహించిన' ది మరాఠా' అనే పత్రికలో తిలక్ ఏమని రాశారంటే 'హిందూ స్త్రీలకు ఇంగ్లీషు చదవడం నేర్పిస్తే అమూల్యమైన సంప్రదాయ విలువలు నాశనమై, వారు అవినీతి పరులుగా, అవిధేయులుగా తయారవుతారు" అని రాశారు. ఆ ప్రకారంగా తాను స్త్రీ విద్యా వ్యతిరేకినని నిరూపించారు. అంతేకాదు, రుక్మాబాయి అనే మహిళ 'ది టైమ్స్ అఫ్ ఇండియా' పత్రికలో మనుధర్మ శాస్త్రాన్ని విమర్శిస్తూ ఒక లేఖ రాసినప్పుడు తిలక్ తన 'ది మరాఠా' పత్రికలో "హిందూ సమాజాన్ని కూలగొట్టడానికి ప్రయత్నిస్తున్న వారెవరో ఆమె పేరుతో ఉత్తరాలను రాస్తున్నారని విమర్శించారు. అంటే మనుస్మఅతిపై విమర్శను, హిందూ సమాజాన్ని కూల్చే ప్రయత్నంగా ఆయన భావించాడన్నమాట.

స్త్రీ విద్యను గూర్చి తాను సంపాదకత్వం వహించిన' ది మరాఠా' అనే పత్రికలో తిలక్ ఏమని రాశారంటే 'హిందూ స్త్రీలకు ఇంగ్లీషు చదవడం నేర్పిస్తే అమూల్యమైన సంప్రదాయ విలువలు నాశనమై, వారు అవినీతి పరులుగా, అవిధేయులుగా తయారవుతారు" అని రాశారు. ఆ ప్రకారంగా తాను స్త్రీ విద్యా వ్యతిరేకినని నిరూపించారు. అంతేకాదు, రుక్మాబాయి అనే మహిళ 'ది టైమ్స్ అఫ్ ఇండియా' పత్రికలో మనుధర్మ శాస్త్రాన్ని విమర్శిస్తూ ఒక లేఖ రాసినప్పుడు తిలక్ తన 'ది మరాఠా' పత్రికలో "హిందూ సమాజాన్ని కూలగొట్టడానికి ప్రయత్నిస్తున్న వారెవరో ఆమె పేరుతో ఉత్తరాలను రాస్తున్నారని విమర్శించారు. అంటే మనుస్మఅతిపై విమర్శను, హిందూ సమాజాన్ని కూల్చే ప్రయత్నంగా ఆయన భావించాడన్నమాట.

రుక్మాబాయికి ఆంగ్లేయ జడ్జి విడాకులు మంజూరు చేసినప్పుడు తిలక్ "మన సమాజంలో అనాది నుండి ఉన్న ఆచారాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదనేది ప్రజాభిప్రాయం. మేం దానితో ఏకీభవిస్తాం" అని 'ది మరాఠా'లో రాశారు. అంతేకాదు, దానిపై ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి దానిలో" ఎలాగైతే హంతకులకు, వ్యభిచారులకు, చోరులకు శిక్షలు ఉన్నాయో, సంప్రదాయాన్ని ధిక్కరించిన రుక్మాబాయికి శిక్షలు విధించి తీరాలి" అనే తీర్మానం చేయించారు.అలాగే 1890లో, పదేళ్ల బాలిక, 35 ఏళ్ల భర్తతో బలవంతపు కలయికలో మరణించింది. అందువల్ల 1891లో ఆంగ్ల ప్రభుత్వం పన్నెండేండ్ల లోపు ఆడపిల్లలు అంగీకరిస్తేనే భర్త కలవాలి అనే చట్టాన్ని చేసింది. కానీ తిలక్, ఇంగ్లీషు వారికి హిందూ ధర్మ విషయాలలో జోక్యం చేసుకునే హక్కు లేదనే వాదనతో ఆ బిల్లును వ్యతిరేకించారు. ఆ రకంగా హిందూ బాలికలకు సంబంధించిన ప్రాణాపాయకరమైన ఆచారాన్ని సమర్థించారు.

మరికొన్ని సామాజిక అంశాల్లో తిలక్ భావాలను పరిశీలిద్దాం. తిలక్ కాలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఐదుశాతం విద్యార్థులకు ఉపకార వేతనమిచ్చేవారు. బ్రాహ్మణులైన ప్రధానోపాధ్యాయులు ఆ ఉపకార వేతనాన్ని తమ కులం విద్యార్థులకే ఇచ్చుకుంటున్నారని, ఇదిసరి కాదనీ, బ్రాహ్మణేతర విద్యార్థులకూ ఉపయోగపడాలని లోఖండే అనే సామాజిక కార్యకర్త వాదించాడు. ఆయన వాదన అంగీకరించిన బ్రిటిష్ ప్రభుత్వం ఆ ఐదు శాతంలో సగం ఉపకార వేతనాన్ని బ్రాహ్మణేతర విద్యార్థులకు ఇచ్చేలా ఉత్తర్వు జారీ చేసింది. ఆ ఉత్తర్వును వ్యతిరేకిస్తూ తిలక్ 'కేసరి' అనే తన పత్రికలో వ్యాసం రాశారు. అలాగే వడ్డీ వ్యాపారులు, పన్నులు వసూలు చేసే జమీందారుల హక్కులకు సంబంధించి తిలక్ చాలా తిరోగమన పద్ధతిలో వాదించారు." వడ్డీ వ్యాపారిని దోచుకొని, అతడి సంపదను పేదలకు పంచే హక్కు ప్రభుత్వానికి లేదు" అనీ," పన్నులు వసూలు చేసే వాడి హక్కును అడ్డుకొని, అతడికి రావలసిన ఆదాయాన్ని రైతులకు పంచే హక్కు కూడా ప్రభుత్వానికి లేదు"అనీ వాదించారు. ఈ విషయం భగవత్, ప్రధాన్ రచించిన' లోకమాన్య తిలక్' అనే గ్రంథంలో 134వ పేజీలో ఉంది.మరో ముఖ్య విషయం. అంటరానితనం నిర్మూలించాలనే ఒక పిటిషన్ మీద సంతకం చేయడానికి తిలక్ నిరాకరించారు.

చివరగా ఇంకో విషయం. తిలక్ శివాజీ జయంతి ఉత్సవాలను జరపడం ప్రారంభించారు. అయినా ఆయన శివాజీకి క్షత్రియ స్థాయిని ఇవ్వడానికి నిరాకరించాడనీ, శూద్రుడుగానే గుర్తించాడనీ చరిత్ర పరిశోధకురాలు ఉమా చక్రవర్తి రాశారు.సనాతన ధర్మంచే స్ఫూర్తి పొందిన వారికి ఉండవలసిన భావాలు ఇవేనా? ఇలాంటి భావాలే సనాతన ధర్మమైతే వాటిని అనుసరిద్దామా? దేశభక్తులైన వారందరూ వీటి గూర్చి తీవ్రంగా ఆలోచించాలి.

సీసీ, బీటీ రోడ్లన్నీ తళతళలాడాలన్నదే నా ధ్యేయం

మంత్రి గంగుల కమలాకర్



రోడ్లను పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ-కరీంనగర్ : కరీంనగర్‌లోని రోడ్లన్నీ తళతళలాడన్నదే తన ధ్యేయమని, నగరంలో గుంతలు లేని రోడ్లపై ప్రయాణం సాఫీగా సాగాలన్నదే తన అభిమతమని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం నగరంలోని 3వ డివిజన్ కిసాన్‌నగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ పర్యటించారు. రూ.133 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులను ప్రారంభించారు. ఇప్పటికే నగరంలో 240 కిలోమీటర్ల సీసీ బీటి రోడ్లను నిర్మించామని, మరో 147 కిలోమీటర్ల రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అనంతరం అక్కడే నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి గంగుల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గంగుల కమలాకర్ ఇల్లు ముట్టడించిన 'ఆశా'లు



మంత్రి గంగుల కమలాకర్ ఇంటి ముందు నిరసన తెలుపుతున్న ఆశాలు



సీఐటీయూ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



ఈడ్చుకెళుతున్న పోలీసులు



మంత్రి గంగుల కమలాకర్ ఇంటి ముట్టడికి మంచిర్యాల చౌరస్తా నుంచి ర్యాలీగా వస్తున్న ఆశా కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు



గంగుల ఇంటి ముందు పోలీసుల తోపులాటల



నిరసర తెలుపుతున్న ఆశావర్కర్లు

- కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్
- సీఐటీయూ నాయకులపై పోలీసులు అత్యుత్సాహంతో దాడి, అక్రమ అరెస్టులు
- సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు..
- ఆశాలకు కనీస వేతనం నిర్ణయించే వరకు సమ్మె ఉ ధృతం చేస్తాం..
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్

నవతెలంగాణ - కరంనగర్

ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం రూ.18వేలు ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని,ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో స్థానిక మంత్రి గంగుల కమలాకర్ ఇంటి ముట్టడి కార్యక్రమం చేపట్టారు. మంగళవారం స్థానిక మంచిర్యాల చౌరస్తా నుండి ఆశా కార్యకర్తలు భారీ సంఖ్యలో ర్యాలీగా వచ్చి గంగుల కమలాకర్ ఇంటి ముందు నినాదాలు చేస్తూ ధర్నా చేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ కనీస వేతనం నిర్ణయం చేయాలని 10రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. ఆరోగ్య కార్యకర్తకు కనీస వేతనం రూ.18వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం దారుణం అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి ఫిక్స్ వేతనం రూ.18 వేలు నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో ఆశా కార్యకర్తలు ప్రజలకి దేవతలు అని పొగిడిన పాలకులు కనీస వేతనం నిర్ణయం చేయడానికి కనీస స్పందన రాకపోవడంతో సమ్మె చేస్తున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడిన మహిళా సైనికులు ఆశా కార్యకర్తలు. కంటి వెలుగు, లెప్రసీ, మలేరియా, టీబీ గుర్తింపు కార్యక్రమంలో అత్యున్నత పాత్ర వహించారు. మనసున్న మహారాజు కేసీఆర్ చేసిన పనికి బిల్లులు ఇవ్వకుండా కడుపులు ఎండబెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సీఐటీయూ , ఆశా కార్యకర్తల అరెస్టు..

మంత్రి గంగుల కమలాకర్ ఇంటి ముందు ఆశా కార్యకర్తలు ధర్నాకు దిగడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. శాంతియుతంగా నిరసన చేపట్టి వినతి పత్రం ఇస్తామని, మంత్రిని కల్పించాలని నినాదాలు చేసిన నాయకులు ఎడ్ల రమేష్ గుడి కందుల సత్యం, ఉప్పునుటి శ్రీనివాస్‌పై పోలీసులు పిడి గుద్దులు గుప్పించారు. కాలితో తన్నుతూ బట్టలు చింపేసి అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆశా కార్యకర్తలైన మహిళలపై పోలీసులు చేతులు వేస్తూ తోసేశారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ వచ్చి పదిమంది లోపలికి వెళ్లాలని సూచించగా వినతి పత్రం ఇవ్వడానికి లోపలికి వెళ్తున్న తరుణంలో పోలీసులు ముకుమ్మడిగా అరెస్టు చేశారు. అరెస్టు చేసిన సీఐటీయూ నాయకులను టూటౌన్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఆశావర్కర్లు 40మందిని త్రీటౌన్‌కు తరలించారు. 75 మంది ఆశా కార్యకర్తలు ను సీపీటీసీకి తరలించారు. ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని ఆశా కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా కోశాధికారి విజయలక్ష్మి, నాయకులు రజియా, మంజుల, పద్మ, శోభ, విజయ లక్ష్మి, రాజమణి, లలిత, శైలజ, శ్యామల, పద్మ, శోభ, శంకరమ్మ, పరిమిత, లత తదితర ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశాల అరెస్ట్ హేయమైన చర్య.. : కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పరపు సురేష్

ఆశా కార్యకర్తలను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేసి వారి ఉద్యమాన్ని అణిచి వేయాలనుకోడం హేయమైన చర్య అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి తిప్పరపు సురేష్, జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి సాగర్ అన్నారు. మంత్రి గంగుల కార్యలయం వద్ద ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని శాంతి యుతంగా ధర్నా చేస్తుంటే మంత్రి వారి డిమాండ్‌ల పట్ల తన వైఖరి తెలపకుండా పోలీసులతో అరెస్ట్ చేపించి, 76మంది ఆశా కార్యకర్తలను, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు యూ శ్రీనివాస్, గుడికందుల సత్యం తదితర నాయకులను పాశవికంగా అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిచారు. తక్షణమే కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆశాలకు ఫిక్సిడ్ వేతనం రూ.18వేలు నిర్ణయించాలి. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. వారి న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించకపోతే సామాజిక సంఘాలు, అభ్యుదయ సంఘాలను కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రచారం, ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సీఎం కేసీఆర్, మంత్రి గంగులకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న అంజద్ అలీ

నవతెలంగాణ-కరీంనగర్ : సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్‌లకు కరీంనగర్ ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నగరంలోని స్థానిక తెలంగాణ చౌక్‌లో ఎంసీకే కో ఆప్షన్ అంజాద్ అలీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంజద్ అలీ మాట్లాడుతూ..కేసీఆర్ ఎప్పుడు చెప్తూ ఉండేవారు తెలంగాణ రాష్ట్రంలో గంగా జమున తహసీబ్ లాగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరూ కలిసి మెలిసి ఉంటున్నారని, దానికి నిదర్శనం కరీంనగర్ నియోజకవర్గం అని కొనియాడారు. మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్ నియోజకవర్గంలో అన్ని కులాలను, అన్ని మతాలను కలుపుకొని కరీంనగర్ నియోజకవర్గ ప్రజలలో తనకొంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. మంత్రి గంగుల కమలాకర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కులాల వారీగా, మతాల వారీగా వారికి అందరికి అందే విధంగా చూస్తారు అని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎలక్షన్స్ లో కరీంనగర్ నియోజకవర్గం ముస్లిం ప్రజలు అందరూ మంత్రి గంగుల కమలాకర్ కి ఓటు వేసి గెలిపించుకుంటారని అన్నారు. సుధా డైరెక్టర్ షేక్ యూసుఫ్, బీఆర్ ఎస్వీ అధ్యక్షులు ఫహాద్, బీఆర్ ఎస్ఎంవై అధ్యక్షులు నవాజ్ హుస్సేన్, మీరు సౌఖత్ అలీ, మన్సూర్, సయ్యద్ మజీద్, మజీద్, బాబు జాని, సుప్రీం జావీద్, నయీమ్, జమీల్, జాకీర్ ములి సాబ్, అస్మత్ అలీబేగ్, కరీం, ఆసిఫ్, మున్నో షా ఖాన్, సోహెల్, సుఫియాన్, హాజీ, మజీద్, సలీం, రజి, ఆహేమద్, అష్రేజ్, గఫర్, మిరాజ్, సాహిల్, మోయుద్దీన్ ఆరిఫ్, అక్రమ్, ఖాజా పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ-శంకరపట్నం : అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శంకరపట్నం మండల పరిధిలోని వంకాయగూడెం గ్రామ శివారు మాధవ స్థాయి గార్డెన్‌లో మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, బీసీబంధు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఉమ్మెత్తల సరోజన, వైస్ ఎంపీపీ పులికోట రమేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పల్లె సంజీవరెడ్డి, మండల అధ్యక్షులు గంట మైపాల్, పలు గ్రామాల ఎంపీటీసీలు సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, బీసీబంధు లబ్దిదారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరు సులోచన అన్నారు. జగిత్యాల జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశావర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి, వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. అక్రమ అరెస్టులను సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరు సులోచన తీవ్రంగా ఖండించారు. తమ సమస్యలపై మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం ఇవ్వకుండా చేశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలపడం ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గర్వందుల రమేష్, అగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మెట్‌పల్లి : అంగన్‌వాడీ ఉద్యోగులకు వరాలు అంటూ ప్రకటించి రెండు రోజులు గడవకముందే వారితో పాటు ఆశావర్కర్లను అక్రమ అరెస్ట్ చేయడం శోచనీయం అని తెలంగాణ జన సమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, కోరుట్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కంతి మోహన్ రెడ్డి అన్నారు.మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఐటీ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా అంగన్‌వాడీలు, ఆశాలను తెల్లవారు జామున అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అక్రమ అరెస్టుల విషయంలో మంత్రి కేటీఆర్ మహిళలందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ జన సమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, కంతి మోహన్ రెడ్డి

మల్లాపూర్:

మండలానికి చెందిన అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులను పోలీసులు ముందస్తుగా మంగళవారం అరెస్టు చేశారు. న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని దీక్ష చేపడుతున్న అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరమని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పడాల ఇందిరా రాధా వసంత భవాని తదితరులున్నారు.

నవతెలంగాణ-మల్లాపూర్ : తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిశీలించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకులు జువ్వాడి కృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో చేపడుతున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బంగారు తెలంగాణలో ప్రతి వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఈ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఆయన వెంట వెంట స్థానిక నాయకులు ఎంపీటీసీ సత్యమ్మ మల్లయ్య, జలపతి రెడ్డి, ఆనంద్ గౌడ్, తదితరులు ఉన్నారు.



జగిత్యాల టౌన్ అరెస్ట్ అయిన సీఐటీయూ నాయకురాలు ఇందూరు సులోచన



మల్లాపూర్: ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



మల్లాపూర్: సంఘీభావం తెలుపుతున్న నాయకులు

మధ్యంతర భృతి 20 శాతం ఇవ్వాలి

యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు తూముల తిరుపతి



కరీంనగర్: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కరీంనగర్ : మధ్యంతర భృతి 20శాతం ఇవ్వాలని యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు తూముల తిరుపతి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుఎస్పీసి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి మాట్లాడుతూ. కనీసంగా 20శాతం మధ్యంతర భృతి, 01-07-2023 నుంచి ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న మూడు డీఏ లు కూడా వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ నిరసనలో యుఎస్పీసి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు తూముల తిరుపతితో పాటు సభ్యులు పి.సత్యనారాయణ రావు, జి.ప్రసాద రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.రాజేందర్, డి.తిరుపతి, కేఎస్వీఎస్‌ఉమా మల్లేశ్వరి, సిహెచ్.గీతాదేవి, ఎం.అన్నపూర్ణ, సిహెచ్.శ్రీనివాస్, ఏ.శంకరయ్య, కె.మంజుల, సిహెచ్.స్వామి, ఏ.ప్రమీల, మంజురున్నీసా షబానా, జె.పద్మ, ప్రవీణ్ లు తదితరులు పాల్గొన్నారు.

మెట్ పల్లి :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో 159,133 ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులకు రెండో పీఆర్సీలో భాగంగా పిఆర్సి కమిషన్ వేస్తూ 5 శాతం ఐఆర్ ఇస్తున్నట్టుగా ప్రకటించడం రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ ,ఉద్యోగులను అవమానించడమేనని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నునావత్ రాజు, ప్రధాన కార్యదర్శి నిలేటి ఎల్లయ్య అన్నారు. 30శాతం ఐఆర్ ప్రకటించవలసి ఉండగా కేవలం 5శాతం ఐ.ఆర్ ప్రకటించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోను సవరించి జూలై నెల నుండి 30శాతం ఐఆర్ ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులకు 5శాతం ఐఆర్ ప్రకటించడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయుల ఐక్య వేదిక నాయకులు మంగళవారం భోజన విరామసమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి మెట్ పల్లి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం 20శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు తులసి ఆగమయ్య, సంగన బట్ల రవీందర్,తిరుకోవెల శ్యామ్ సుందర్, బెజ్జారపు మురళి, కచ్చు రాజన్న,అంకతి లింగారెడ్డి, తాహెర్, సిరాన్న, రమణ రావ్,రవీందర్, జరుపుల సుధాకర్,విజయ భాస్కర్, గుగ్లోత్ రాజేందర్,శివ ప్రసాద్,పిట్టల రాజేందర్, అంజయ్యపులి రమేష్, మహా మూద్ పాల్గొన్నారు.



ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు

బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థిగా కొకంటి శేఖర్



నవతెలంగాణ-చొప్పదండి : బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు విద్యార్థి ఉద్యమ నాయకుడు కొంకటి శేఖర్‌ను మంగళవారం ప్రకటించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించారు.ఉద్యమ కారుడిగా గుర్తించి బీఎస్పీ అభ్యర్థిగా ప్రకటించినందుకు కొకంటి శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం..

డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

నవతెలంగాణ-గన్నేరువరం : మండలంలోని జంగపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయ ణ మంగళవారం జెండా ఆవిష్కరించారు. బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ బొజ్జ కనకయ్య, యువకులు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, బుర్ర కనకయ్య, బొజ్జ కనకయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు



మంత్రి ని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-కొత్తపల్లి : కొత్తపల్లి కురుమ సంఘం అభివృద్ధి కోసం, బీరయ్య గుడి వరకు సీసీ రోడ్డు, డ్రైయినేజీ నిర్మాణం కోసం మంత్రి గంగుల కమలాకర్‌కు రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగులకు కొత్తపల్లి పట్టణ మున్సిపల్ తరపున మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కౌన్సిలర్ వాసల రమేష్, కౌన్సిలర్స్ స్వర్గం వజ్రనర్సయ్య, వేముల కవిత చంద్రశేఖర్, చింతల సత్యనారాయణ రెడ్డి, కురుమ సంఘం అధ్యక్షులు పెద్ది బీరయ్య, చిగుర్ల శ్రీనివాస్, ధర్మయ్య, చిటుకూరి బీరయ్య, చిటుకూరి శ్రీనివాస్, పుల్లరాజు, ఒగ్గరి బీరయ్య, చిటుకూరు కొమురయ్య, గుంటి రాయమల్లు, బైరి రాజు, కెంచే లక్ష్మీపతి, కెంచె చంద్రమౌళి పాల్గొన్నారు.

అంబేద్కర్ డిగ్రీ ప్రవేశానికి తేదీ పొడిగింపు

నవతెలంగాణ-కొత్తపల్లి : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సర అడ్మిషన్లకు ఈనెల 4 వరకు తేదీ పొడగించినట్టు ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి, కో- ఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులు, టీఎస్ ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసి, రశీదు పొందాలని చెప్పారు. పూర్తి వివరాలకు 7382929755 కి ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

బీసీ సంఘాలు ఒక్కటి కావాలి



మాట్లాడుతున్న ముక్కెర సతీష్ కుమార్

నవతెలంగాణ-మానకొండూర్ : బీసీ సంఘాలు ఒక్కటి కావాలని మాకొండూరు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ముక్కెర సతీష్‌కుమార్ అన్నారు. మానకొండూరు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ముక్కెర సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాల్వ మధుబాబు మాట్లాడుతూ.. బీసీలకు 60 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వమని అగ్రకుల పార్టీలను అడగటం దున్నపోతుకు వినతి పత్రం ఇవ్వడం లాంటిదన్నారు. బీఆర్ఎస్ కూడా బీసీ లకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కూడా రెడ్లకు అత్యధిక ఎమ్మెల్యే సీట్లు ఇవ్వక తప్పని పరిస్థితి అని, ఎందుకంటే రెడ్లకు ఓటు వేయడానికి బీసీలు అలవాటు పడినారు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నాలంగి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి, కార్యదర్శులు నడి గొట్టు శంకర్, బొడ్డు నరేష్, బొడ్డు అయిలయ్య, సంయుక్త కార్యదర్శి పాంద్రాల కనక రాజేశం, కోశాధికారి వేల్పు గొండ సంపత్, మీడియా సెల్ కన్వీనర్ మార్కరాజు, పాంద్రాల శ్రీనివాస్, గట్టు నాగయ్య, బాకారపు రమేష్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పరుగు పోటీలలో ఆర్విన్ ట్రీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కరీంనగర్ : కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా స్థాయిలో నిర్వహించిన పరుగు పోటీలలో స్థానిక ఆర్విన్ ట్రీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 800 మీటర్ల పరుగు పందెం విభాగంలో 9వ తరగతి విద్యార్థి పి.కృష్ణ బంగారు పతకాన్ని, 2 కి.మీ పందెంలో రజక పతకాన్ని సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికయ్యాడని పాఠశాలల చైర్మెన్ బి.రమణరావు తెలిపారు. ఈ పథకాలను పాఠశాలల చైర్మెన్ రమణరావు విద్యార్థికి అందించి ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాలల చైర్మెన్ బి.రమణరావు

ఏసీబీకి చిక్కిన రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ -మెట్‌పల్లి :

మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఆర్ఐ, తిరుపతితో పాటు అతని అసిస్టెంట్‌ను లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన రైతు బద్దం శంకర్ తన స్వంత భూమి సేర్వే నెంబర్ 797/1లో గల 7గుంటల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రెండు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఆర్ఐ పట్టించుకోలేదు. మార్పిడి కావాలంటే రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా బాధిత రైతు ఏసీబి అధికారులను ఆశ్రయించారు. అధికారుల పథకం ప్రకారం. ఆర్ఐ అసిస్టెంట్‌కు రూ.15వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆర్ఐ తిరుపతి, అసిస్టెంట్ ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్టు తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే 9154388963, 9154388957,9156388957 నెంబర్లను సంప్రదించలన్నారు. ఈ దాడుల్లో ఏసీబీ, సీఐలు, రవీందర్ ,రాము, తిరుపతి,జాన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి



పట్టుబడ్డ డబ్బులు

తమ ప్రతిభను ప్రదర్శించేందుకు పోటీలు దోహదపడతాయి

- 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్



నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

గ్రామీణ స్థాయి క్రీడాకారులు తమ ప్రతిభ ప్రదర్శించేందుకు మండల స్థాయి ఆటల పోటీలు దోహదపడతాయని పెద్దపల్లి మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ అన్నారు.మంగళవారం పట్టణంలోని ఇండియా మిషన్ హై స్కూల్ లో జరిగిన మండల స్థాయి ఆటల పోటీలకు పెద్దపల్లి మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదిగి, పెద్దపల్లికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల పెద్దపల్లి పట్టణంలో క్రీడాకారులకు సరైన ఆట స్థలాలు లేకుండా పోయాయని అన్నారు. భవిష్యత్తులో జిల్లా కేంద్రంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలు ఏర్పాటుకు తన వంతు కషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమం లో కబడ్డీ పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలి

- ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్
- ధర్మపురిలో మంత్రి కొప్పుల, హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభం
- జగిత్యాలలో పోలీసు ప్రధాన కార్యాలయం ప్రారంభం
- జగిత్యాలలో జర్నలిస్టులపై పోలీసుల అత్యుత్సాహం



నవతెలంగాణ- జగిత్యాలటౌన్/ ధర్మపురి

"చెరువు నిండిన తర్వాత కప్పలు చాలా వస్తాయి. అలాగే, పార్టీ బాగున్నప్పుడు చాలా మంది నేతలు పార్టీలోకి వస్తారు. కష్టాల్లో ఉన్నప్పుడే అసలైన మనవాళ్లు ఎవరో తెలుస్తుంది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ధర్మపురిలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ఈశ్వర్ ఎంతో ప్రయత్నించారని, కొందరు రాజకీయ దురుద్దేశంతో రైతులను రెచ్చగొట్టి పరిశ్రమ ఏర్పాటును అడ్డుకున్నారని కేటీఆర్ విమర్శించారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఏర్పాటు చేసిన మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని హోంమంత్రి మహమూద్ అలీ, మంత్రి కొప్పులతో కలిసి ఆయన ప్రారభించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభకు మంత్రి కేటీఆర్ మాట్లాడారు. అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రానున్న కాలంలో ధర్మపురి నియోజకవర్గాన్ని ఇతర నియోజక వర్గాలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. భారీ వర్షాలతో ధర్మపురి పట్టణం, సమీపంలోని పలు వార్డులు, గ్రామాలలో గోదావరి నీటితో మునిగిపోతున్నాయని, కరకట్టలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ అభివృద్ధికి శ్రీ లక్ష్మి నరసింహస్వామి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ శాఖ ద్వారా రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అంతకుముందు రూ.247.86 కోట్లతో వివిధ గ్రాంట్ల కింద చేపట్టిన, చేపట్టబోయే పనులకు పైలాన్ ఆవిష్క రించారు. ఎన్నో ఏళ్ల సింగరేణి కార్మికుడిగా పని చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్.. పార్టీ ఏ స్థితిలో ఉన్నా తమతోనే ఉన్నారని గుర్తు చేశారు. ఊపిరి ఉన్నంత వరకు పార్టీ మారనని 15 ఏళ్ల క్రితమే చెప్పిన గొప్పనేత కొప్పుల ఈశ్వర్ అని కొని యాడారు. అంతకు ముందు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాటా డుతూ.. నియోజకవర్గంలో లక్షా రూ.26వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు రవాణా సౌకర్యాలకు బ్రిడ్జిలు, డబుల్ రోడ్డులు నిర్మించడం జరిగిందన్నారు. సబ్ స్టేషన్ల ఏర్పాటు, నియోజకవర్గంలో సుమారు 1500 కోట్లతో పనులు చేపట్టినట్టు చెప్పారు. అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో విజేతగా నిలిచి కాంస్య పతకం సాధించిన అగసార నందినికి రూ.5 లక్షల చెక్కును మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, రమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, విద్యా సాగర్‌రావు, సుంకే రవి శంకర్, పార్లమెంట్ సభ్యులు వెంకటేష్ నేత, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, ఎస్పి ఎగ్గడి భాస్కర్, ఫైనాన్స్ కమీషన్ చైర్మన్ రాజేశం గౌడ్, మెట్ పల్లి ఆర్డిఓ డి. మధు, మున్సిపల్ చైర్మన్లు, జడ్పీటీసీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



కేటీఆర్‌కు స్వాగతం పలికిన హరి అశోక్‌కుమార్

జగిత్యాలటౌన్ :ఐటి,పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు సీనియర్ సిటిజేన్స్, పెన్షనర్స్ అసోసియేషన్స్ జిల్లా అధ్య క్షుడు హరి ఆశోక్ కుమార్, పెన్షనర్స్, సీనియర్ సిటిజేన్స్ ప్రతినిధులు స్వాగతించారు. కలెక్టరేట్ హెలిపాడ్ వద్ద జిల్లాకు చేరుకున్న మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి హరి అశోక్ కుమార్ స్వాగతం పలికారు. తెలంగాణ అల్ సీనియర్ సిటిజేన్స్ అసోసియేషన్, తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్‌ల తరపున స్వాగతిస్తూ తెలంగాణ అల్ సీనియర్ సిటిజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పి.నర్సింహ రావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు 400 మందికి గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులను గుర్తించి సంబంధిత లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేసినట్టు తెలిపారు. జగిత్యాలలో నూతన మాస్టర్ ప్లాన్ అమలుపై డ్రైనేజీ వ్యవస్థ గురించి మంత్రి కేటీఆర్‌కు సభ ద్వారా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విన్నవించారు. . గత ఎన్నికలలో బిజెపి, కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇవ్వడం ద్వారానే నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బిజెపి కైవసం చేస్తుందన్నారు.ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివసిస్తున్న ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ 25 ఓట్లు మాత్రమే పోలయ్యాయని, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సమీప బంధువు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రాంతంలో కాంగ్రెస్కు డిపాజిట్ దక్కలేదన్నారు. బిజెపి ఎంపీ గెలవడానికి కాంగ్రెస్ అన్ని విధాలుగా సహకరించిందని నిరూపితమైందని అన్నారు. తాను గెలిచిన నుంచి నేటి వరకు సుమారు రూ. 600 కోట్లతో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం చేశామని, రూ.100 కోట్లతో బోర్నపల్లి బ్రిడ్జి నిర్మించి న ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

జగిత్యాలలో పోలీసుల అత్యుత్సాహం

జగిత్యాల జిల్లాలో కేటీఆర్ పర్యటన సందర్భంగా కవరేజ్ కి వచ్చిన మీడియా ప్రతినిధులపై పోలీస్ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించారు. కేటీఆర్ సభ అయిపోయి బయటకు వెళ్తున్న సమయంలో అక్కడ ఉన్న ఓ సీఐ మీడియా ప్రతినిధులను పక్కకు నెట్టడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. జరగమని నోటితో చెప్తే అయిపోయే దానికి బలవంతంగా నెట్టడం పట్ల మీడియా ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు మేము అంతా విధి నిర్వహణలో భాగంగానే ఇక్కడికి వచ్చామని ఎవరి పనులు వాళ్ళు చేస్తుంటే ఈ విధంగా చేయడం ఎంతవరకు సబబు అని సీఐ ని ప్రశ్నించారు.

శాంతి భద్రతల సంరక్షణలో దేశానికే ఆదర్శం : మంత్రులు కేటీఆర్, హోం మంత్రి మహమూద్ అలీ

జగిత్యాలటౌన్ :శాంతి భద్రతల సంరక్షణలో దేశానికే ఆదర్శవంతంగా తెలంగాణ పోలీసింగ్ నిలుస్తుందని, సాంకేతికతను వినియోగించుకోవడంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో తెలంగాణ పోలీసులు ముందంజలో ఉన్నారని మంత్రి కేటీఆర్, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని వారు మంగళవారం ప్రారంభించారు. ముందుగా పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఎస్పీ ఛాంబర్‌లో ఎగ్గడి భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి భద్రత పరిరక్షణలో దేశంలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ భవనం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని మంత్రులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్టీ జోన్-1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్సీలు రమణ, భాను ప్రసాద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, ఎమ్మెల్యేలు విద్యాసాగర్ రావు, సంజయ్ కుమార్, రవిశంకర్, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన ఎమ్మెల్యేసంజయ్



నేటి నుంచి ఎమ్మెల్యే దాసరి గ్రామదర్శిని కార్యక్రమం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పురం ప్రేమ్ చందర్రావు, ఎంపీపీ బాలాజీ రావు

నవతెలంగాణ-సుల్తానాబాద్‌రూరల్

నేటి నుంచి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి గ్రామ దర్శని కార్యక్రమం ప్రారంభించనున్నారు. మండలంలోని చిన్నకల్వల, చిన్న బొంకూర్, మియాపూర్, సుద్దాల గ్రామాలలో గ్రామదర్శిని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు పూరం ప్రేమ్‌చంద్రావు, సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీ రావులు పత్రిక సమావేశంలో తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకువెళ్లేందుకు గాను ఉదయం ఏడు గంటలకు చిన్నకల్వల గ్రామంలో నిర్వహించే గ్రామదర్శిని కార్యక్రమానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడి పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ప్రతి ఒక్కరు గ్రామదర్శిని లో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సునీత రమేష్,గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక శ్రీనివాస్ గౌడ్, గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, రైతుబంధు మండల అధ్యక్షులు బోయిని రాజ మల్లయ్య,వేయికళ్ల నరేందర్, మైలారం నారాయణ, సూర శ్యామ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిప్పారపు కమలా దయాకర్, ఆరేపల్లి ఇలారావు, వహీద్, రఫీక్, కనవేన సతీష్, కోట రాజమల్లారెడ్డి, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-భగత్‌నగర్

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... 317 జీవో జోనల్ విధానంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తల్లి ఒకచోట, తండ్రి ఒక చోట ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తుంటే పిల్లలు మరో చోట ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. 317 జీఓను పునః పరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల వేతన భత్యాలు సవరణ చేసి, మధ్యంతర భృతి ఇవ్వడం సహజమేనని, కాంగ్రెస్ పాలనలో మధ్యంతర భృతి 2008లో 22 శాతంగా, 2013లో 27 శాతం ఇచ్చినట్టు గుర్తు చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కనీసం 20శాతం మధ్యంతర భృతి ఇవ్వాల్సి ఉండగా కేవలం 5శాతం మాత్రమే ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సమద్ నవాబ్, శ్రవణ్ నాయక్,సయ్యద్ అఖిల్, దన్న సింగ్, మెతుకు కాంతయ్య,కుర్ర పోచయ్య,లయక్,మహమ్మద్ భారీ,శేహెన్న, వంగల విద్యాసాగర్,అనిల్ కుమార్ , పోరండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

నవతెలంగాణ-కరీంనగర్

అక్టోబర్ 15,16, 17వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే డీటీఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని స్థానిక ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాల ఆవరణలో డీటీఎఫ్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు యాంసాని ఉమారాణి అధ్యక్షతన డీటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఉపాధ్యాయ వృత్తి పరమైన సమస్యలతోపాటు విద్యారంగ సమస్యలపై సరైన రీతిలో డీటీఎఫ్ పని చేస్తుందన్నారు. సంస్థ 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర స్థాయిలో విద్యా వైజ్ఞానిక మహాసభలను మహబూబ్ నగర్ లో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మహాసభల్లో ఉపాధ్యాయ, విద్యారంగ, వ్యవసాయ రంగం, ఇతర సామాజిక అంశాలపై పేరొందిన వక్తలతో ఉపాన్యాసాలు ఉంటాయని తెలిపారు. ఈ మహా సభల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాబిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం.రఘుశంకర్‌రెడ్డి మాట్లాడుతూ. .డీటీఎఫ్ మహా సభలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయని, సమాజహితం కోరే ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.రఘశంకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు యాంసాని ఉమారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి, రాష్ట్ర కౌన్సిలర్లు పి.నర్సయ్య, చకినాల దేవేందర్, బి.రమేష్, మండలాల ప్రధాన బాధ్యులు ఏ.సంపత్ రావు, ఎం.శ్రీనివాస్, రాం లింగారెడ్డి, జిల్లా కౌన్సిలర్లు పి.అరుణాదేవి, సత్యనారాయణ రెడ్డి, ఏ.నట రాజచారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానానికి ప్రజలు ముందుకు రావాలి

- సదాశయ ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి
- ఘనంగా సదాశయ 15వ వార్షికోత్సవం



అవయవ దాత కుటుంబాలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దాసరి,పౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్:

అవయవ దానానికి ప్రజలు ముందుకు రావాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పెద్దపల్లిలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో సదాశయ ఫౌండేషన్ సంస్థ 15వ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర, అవయవ, శరీర దానం చేసిన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే దాసరి మాట్లాడుతూ దేశంలో అవయవాల కోసం ఎదురుచూస్తున్న వారు చాలామంది ఉన్నారని, మరణించిన వ్యక్తి అవయవ దానం చేస్తే 8 నుంచి 9 మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. జిల్లాలో నేత్ర, అవయవ, శరీర దానంపై సదాశయ ఫౌండేషన్ చేస్తున్న అవగాహన కార్యక్రమాలు అందరికి స్ఫూర్తిని కలిగిస్తున్నాయని ఎమ్మెల్యే కొనియాడారు. అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, దీనివల్ల ఎంతోమంది నిరుపేదలు పునర్జీవనం పొందుతున్నారని అన్నారు. అవయవ దానంపై అవగాహన పెరిగితే చాలామందికి మేలు జరుగుతుందని, తొలిసారిగా జిల్లా కేంద్రంలో సదాశయ ఫౌండేషన్ వార్షికోత్సవం కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.లింగమూర్తి తదితరులు సదాశయ ఫౌండేషన్ చేస్తున్న సేవలు, జాతీయ, రాష్ట్ర స్థాయిలో సదాశయకు వచ్చిన అవార్డులు, ప్రశంసా పత్రాలపై వివరించారు. వార్షికోత్సవానికి హాజరైన 108 మంది అవయవ దాతల కుటుంబాలు చేసిన త్యాగాలను కొనియాడుతూ, అవయవ దాతలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, అరబిందో స్కూల్ అధినేత రమణారావు, జీవంరాజు, మంచాల వరప్రసాద్, సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు లేకుండా బదిలీలు చేపట్టొద్దు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్:

పదోన్నతులు లేకుండా బదిలీలు చేపట్టవద్దని డీటీఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్క రాంకిషన్ రావు, అప్పిడి సంతోష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే 9 సంవత్సరాల నుంచి ప్రమోషన్లు లేకపోవడం వల్ల సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక ఖాళీగా ఉన్నాయన్నారు. ఫలితంగా విద్యార్థులకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. పదోన్నతులకు కోర్టులో ప్రతిబంధకాలుగా ఉన్న అంశాలపై ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. వెంటనే పదోన్నతులు ప్రకటించి బదిలీలు చేపట్టాలని కోరారు.

తెలంగాణ యువజన కాంగ్రెస్ మీడియా సెల్ కో-కన్వీనర్ గా మధుకర్ యాదవ్

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్:

తెలంగాణ యువజన కాంగ్రెస్ మీడియా సెల్ కో-కన్వీనర్ గా అమ్ముల మధుకర్ యాదవ్ ను నియమిస్తూ జాతీయ యువజన కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ వరుణ్ పాండే ఉత్తర్వులు జారీ చేశారు.

అధునాతన యాంత్రీకృత దోబీ ఘాట్‌కు శ్రీకారం

నవతెలంగాణ-కరీంనగర్

రజక కుల వృత్తిని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధునాతన యాంత్రీకృత ధోబీ ఘాట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మేయర్ సునీల్‌రావు అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 34వ డివిజన్ గోదాంగడ్డ ప్రాంతంలో రూ.2కోట్ల నిధులతో రాష్ట్రంలోనే 3వ అధునాతన యాంత్రీకృత ధోబీ ఘాట్ నిర్మాణం చేపట్టినట్టు మేయర్ తెలిపారు. అత్యధునిక టెక్నాలజీ కలిగిన యంత్రాలు, సకల సౌకర్యాలతో ధోబీ ఘాట్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశామన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ చేతుల మీదుగా లాంచనంగా ప్రారంభోత్సవం చేసి, రజక సంఘాలకు అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు.

ప్రోత్సహించేందుకు కేసీఆర్ క్రీడా కిట్ల పంపిణీ

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సుంకెరవిశంకర్

నవతెలంగాణ-గంగాధర

గ్రామాల్లో క్రీడలను ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంత క్రీడల ప్రతిభను వెలికి తీసేందుకు కేసీఆర్ క్రీడా కిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండల కేంద్రంలో క్రీడా సామాగ్రిని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ యువతలో శారీరక, మానసిక ధృడత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. ప్రతి గ్రామానికి 10 లక్షల రూపాయల విలువ గల 24 రకాల వస్తువులతో కూడిన 150 కిట్లను అందజేయడం జరిగిందని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండ లాధ్యక్షుడు నవీన్ రావు, ఎంపీటీసీ ఆట్ల రాజిరెడ్డి, సర్పంచ్ సాగర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-చొప్పదండి

గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన చొప్పదండి మండలంలో రేవెల్లె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసుల కథనం ప్రకారం.. రేవెల్లె గ్రామానికి చెందిన ఊ కంటి అశోక్‌రెడ్డి కౌలు చేసే వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం కనిపించింది. రైతు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించగా, మృతదేహం కుళ్లిపోయింది. మృతుడి ఒంటిపై నేత పసుపు రంగు షర్ట్, బ్లాక్ కలర్ జీన్స్ ధరించాడు. శవాన్ని బయటకు తీసి జేబులో దొరికిన సెల్ ఫోన్‌ను పరిశీలించగా ఫోన్ ఆధారంగా మతుడు జగిత్యాల జిల్లా మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన ముత్తికల గణేష్(35)భార్య రజిత ఇద్దరు కొడుకులు ఉన్నారు. సెప్టెంబర్ 10న రాత్రి పది గంటల నుండి రేవెల్లె గ్రామంలో భర్త కనిచిపించడం లేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అనుమాదాస్పద కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి కరీంనగర్ రూరల్ ఏసిపి టీ.కరుణాకర్‌రావు, కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్, చొప్పదండి ఎస్ఐ ఉపేంద్ర చారి లు క్లూస్ టీం డాగ్స్ స్క్వాడ్ తో పరిశీలించారు.

పీవీ జిల్లాను ఏర్పాటు చేయాలి

- మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇనుగాలపెద్దిరెడ్డి

నవతెలంగాణ- హుజురాబాద్

ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న పీవీ జిల్లా ఏర్పాటు కోసం సమిష్టి పోరాటాలే మార్గమని మాజీ మంత్రి బీఆర్ఎస్ నాయకులు ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్లో పీవీ జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పీవీ జిల్లా ఏర్పాటు అత్యంత అవసరమని, దీని కోసం అన్ని వర్గాలను కలుపుకొని ప్రజలను చైతన్యవంతులు చేసి ముందుకు తీసుకెళ్లడం ద్వారా సాధించుకోవచ్చున్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. హుజురాబాద్ కేంద్రంగా పీవీ జిల్లా ఏర్పాటు కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలను చైతన్యవంతం చేయడం అత్యంత అవసరం అని అన్నారు. జిల్లా ఏర్పడితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. హుజురాబాద్ ప్రాంత ప్రజల కోరికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సామాజిక సహాయకర్త వర్దినేని రవీందర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ జేఏసీ ప్రజా సంఘాల నాయకులు రత్నం ,జనార్దన్ కంకణాల భగవాన్‌రెడ్డి , హనుమంత్ గౌడ్, ముక్కెర రాజు ,పొన్నగంటి మల్లయ్య ,ఎండి ముజాహిద్ హుస్సేన్ ,జవర్దన్ ,బెల్లి రాజయ్య, గంగిశెట్టి రాజు ,రవీందర్ రెడ్డి ,గౌరు సమ్మిరెడ్డి, కుమారస్వామి , ఖాలీద్ హుస్సేన్ ,కొలిపాక సమ్మయ్య, పుల్లూరి ప్రభాకర్ రావు ,రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారు

- బీఆర్ఎస్ నాయకులు కొంకటి లింగమూర్తి



కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్:

బీజేపీ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ నాయకులు కొంకటి లింగమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేటీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈలాంటి వెలికి వేషాలు వేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని తగిన విధంగా బుద్ధి చెబుతామని, మూడోసారి పెద్దపల్లిలో గెలిచేది దాసరి మనోహర్‌రెడ్డి అని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంబటి లక్ష్మీనారాయణ, చెల్లోజు సుదర్శన చారి, కట్టెకోల రామ్మూర్తి, కుంట శ్రీకాంత్, కొంకటి తిరుపతి ,సోగాల శ్రీనివాస్, కొంకటి శివ సాయి, కొంకటి వినీత్ కుమార్, గాండ్ల వెంకన్న, గాండ్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం



గ్యారెంటీ కార్డులను పంఃణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట:
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం కాంగ్రెస్ ఆరు పథకాల గ్యారెంటీ కార్డులను ఇంటింటికి వెళ్లి కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ మహిళల నుండి అనూహ్యామైన స్పందన వస్తుందన్నారు. మహిళల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక పథకాలు తేవడం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రైతులకు పోతిరెడ్డిపల్లెలో మండల ప్రధాన కార్యదర్శి సిరిపురం మహేందర్ అధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ హామీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లింగం గౌడ్, కార్యదర్శి కోనేటి పోచయ్య, పట్టణ అధ్యక్షుడు చెన్నిబాబు, నాయకులు తిరుపతి గౌడ్, పందిర్ల శ్రీనివాస్ గౌడ్, మానుక నాగరాజు, బీపేట రాజు, సంతోష్ గౌడ్, గుర్రం రాములు, తిరుపతి రెడ్డి, మామిండ్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-బోయినిపల్లి
బోయినిపల్లి మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లను ఏర్పాటు చేయాలని మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తాహసీల్దార్ పుష్పలతకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఆధార్ సెంటర్లు లేక పలుగ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆధార్‌కార్డు పనుల మీద పక్క గ్రామాలకు వెళ్తున్నారని వాపోయారు. వెంటనే అధికారులు ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చొప్పదండి నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఉదారి నరసింహచారి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షులు సుంకపాక ప్రభు, ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి రాజూరి కిరణ్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు కళ్యాణం అనిల్ పాల్గొన్నారు

రైతుల సంక్షేమం దిశగా కృషి చేయాలి
సిరిసిల్ల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటి సభ్యులు

నవతెలంగాణ-తంగళ్ళపల్లి
రైతుల సంక్షేమం దిశగా మార్కెట్ కమిటీ పాలకవర్గం కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపా ధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. సిరిసిల్ల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ మార్కెట్ యార్డులో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా నూతన పాలకవర్గం అధ్యక్షులు పూసపల్లి సరస్వతి, ఉపాధ్యక్షులు బండారి శ్యామ్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, రాష్ట్ర టెక్స్టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటీ నరసింహారావు,సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరు శంకరయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు గడ్డం నరసయ్య, జడ్పీటీసీ పూర్మానీ మంజుల, ఎంపీపీ పడిగల మానస ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మునిసిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు




పార్టీలోకి ఆహ్వానిస్తున్న అధ్యక్షుడు

నవతెలంగాణ-ఇల్లంతకుంట:
మండలంలోని జవారిపేట, సోమారంపేట గ్రామానికి చెందిన జెట్టి మల్లేశం 'జెట్టి యశ్వంత్ ఆధ్వర్యంలో 100 మంది యువ కులు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ సమ క్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు .

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-కోనరావుపేట:
మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల నిర్వాదిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తుందని వేతనాలను వెంటనే చెల్లించాలని కార్మికులకు భద్రత కల్పించాలని హెల్త్ కార్డులు ఇవ్వాలని వంటగ్యాస్ ను ఉచితంగా అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సెస్ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి. కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఫిరోజ్ పాషా, జిల్లా నాయకులు చందనగిరి గోపాల్ . గొట్టే రుక్మిణి, కచ్చకాయల ఎల్లయ్య, చేపూరి గంగాధర్. నందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న పంతం రవి

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్: సీజనల్ వ్యాధులను అరికట్టడానికి వెంటనే హెల్త్ హేమర్జెన్సీ ప్రకటించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు సిపిఐ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకులకు ప్రజల ఆరోగ్యాలు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే స్పందించి కార్మిక వాడల్లో బస్తీ దావఖానాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగనిర్ధారణ పరీక్షలు జరిపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సామల మల్లేశం మంచి కట్ల రమేష్ అజ్జ వేణు మంత్రి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్ బాబు డిమాండ్



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:
తమ సమస్యలను పరిష్కరించాలని గత తొమ్మిది రోజుల నుండి సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో సమ్మె చేస్తున్న ఆశ వర్కర్ల సమ్మె శిబిరాన్ని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు టీ. స్కైలాబ్ బాబు సందర్శించి సంఘీభావం, మద్దతు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తూ సేవలందిస్తున్న ఆశ వర్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఆశ వర్కర్లకు కనీసం ఆరోగ్య భద్రత కూడా ప్రభుత్వం కల్పించకపోవడం సిగ్గుచేటు అన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్లు , అంగన్వాడీ ఉద్యోగులు , మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని రోడ్లమీద వచ్చి సమ్మె చేస్తున్న కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంసీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూశం రమేష్ , జిల్లా కమిటీ సభ్యులు వీర్నపల్లి ఎంపీటీసీ మల్లారపు అరుణ్ కుమార్, ముక్తికాంత్ అశోక్, జవ్వాజి విమల, శ్రీరాం సదానందం, సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, భారతి, జయశీల, కస్తూరి , రుచిత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

మమ్మల్ని నిర్లక్ష్యం చేయడం మంత్రికి తగదు



మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతున్న ఆశా కార్యకర్తలు

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:
గ్రామాల్లో ప్రతిరోజు అత్యవసర సేవలను చేస్తున్న మాపై మంత్రి కేటీఆర్ నిర్లక్ష్యం చేయడం తగదని ఆశ వర్కర్లు అసహనం వ్యక్తం చేశారు మంగళవారం కలెక్టరేట్ లో మంత్రి కేటీఆర్‌ను కలవడానికి ఆశా కార్యకర్తలు వెళ్లి తమ సమస్యలు వినాలని ఆశ కార్యకర్తలు మంత్రి కేటీఆర్ తో పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ముందు ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు..నిరసనలో సిఐటియు కార్యదర్శి కోడం రమణ తదితరులు పాల్గొన్నారు

సీఎం కాళ్లు మొక్కైనా మంజూరు చేయిస్తా: కేటీఆర్



చెక్కును అందిస్తున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:
డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, గృహలక్ష్మి లబ్ధిదారులు ఫోను ఇంకా మిగిలి ఉంటే సీఎం కాళ్లు మొక్కైనా గృహలక్ష్మి మంజూరు చేయిస్తానని మంత్రి కేటీఆర్ అభయమిచ్చారు. పెద్దోడు అయిపోయిండు గాలి మోటరుపై వచ్చిండు అనుకోవద్దు మీరు ఓటు వేస్తేనే రాష్ట్రంలో ఇలా తిరుగుతున్నాను. మీరు పెట్టిన బిక్షనే ఇదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. సిరిసిల్లలోని కలెక్టరేట్ లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలంటే, కేసీఆర్‌ను మళ్లీ సీఎం కావాలనుకుంటే మరో సారీ ఓటేసి గెలిపించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. పార్టీకి కార్యనిర్వాహక అధ్యక్షునిగా నేను ఉన్నట్లు మీకు తెలుసని ఓటు వేయాలని కోరడం నా బాధ్యతని కేటీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలతో పాటు గృహ లక్ష్మీ పథకం కింద ఐదు లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కరైనా లంచం ఇచ్చారా అని వేదిక నుంచి లబ్ధి దారులను మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ఎవరికి రూ పాయి లంచం ఇవ్వలేదని ఎవరు అడగలేదని లబ్ధి దారులు తేల్చి చెప్పారు. సిరిసిల్ల ప్రజలు ఏమీ అను కోవద్దు. నన్ను అపార్థం చేసుకోవద్దని ఆయన వేడుకున్నాడు ప్రజాస్వామ్యం అన్న పుడు ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా నాయకులు నడవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ చెబుతుంటారని మంత్రి కేటీఆర్ అన్నారు రాష్ట్రంలోనే ఇల్లు లేని కుటుంబం ఉండవద్దని ఉద్దేశంతో 1747 ఇండ్లను సిరిసిల్ల నియోజకవర్గానికి ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే సిరిసిల్ల ఆదర్శంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రజలే కేంద్ర బిందువుగా ప్రజాసమస్యల పరిష్కారమే ఇతివృత్తంగా పాలన సాగిస్తు న్నామన్నారు. తెలం గాణలోని గుడిసెలేని నియోజ కవర్గం సిరిసిల్లను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో 2800 మందిని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించేందుకు అర్హులుగా తేల్చామని, వీరిలో 1260 మందికి మండపల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను ఇప్పటికే కేటాయించామన్నారు. 577 మంది లబ్ధిదారులకు పెద్దూరు రఘుడు లలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించి పట్టాలను అందజేస్తామన్నారు ప్రతి పథకం ఫలాలు చివరి గడపకు పారదర్శకంగా చేరేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నామని సిరిసిల్ల వేములవాడ నియోజకవర్గ ప్రజలకు మల్కాపేట తొమ్మిదో ప్యాకేజీ రిజర్వాయర్ కల్పతరువు అని త్వరలోనే పూర్తి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. టిఆర్ఎస్ పార్టీకి ఓటువేసి సిరిసిల్లలో నన్ను, వేములవాడ లో లక్ష్మీనరసింహారావును గెలిపించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమం అనంతరం హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి మంత్రి కేటీఆర్ కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక చేయూతను అందించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేశారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు అరుణ, సిరిసిల్ల, వేములవాడ పురపాలక సంఘాల అధ్యక్షులు మున్సిపల్ జిందం కళా, రామతీర్థపు మాధవి, చేనేత జౌళి శాఖ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఆకునూరి శంకరయ్య, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షులు గడ్డం నరసయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకందని సంక్షేమ ఫలాలు

పథకాల వర్తింపులో రాజకీయ జోక్యం..పర్సెంటేజీలిస్తేనే ఎంపిక పర్వం



నవతెలంగాణ-తంగళ్ళపల్లి:
పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా అసమానతలను రూపుమాపాలన్న లక్ష్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పక్కదారి పడుతున్నాయి. రాజకీయాలు ఎన్నికల వరకే అంటూ ప్రగల్బాలు పలుకుతున్న నాయకులు తమ వారికే పథకాలను అందించేందుకు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో బాగంగా ఇటీవల కాలంగా ప్రభలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వారిగా ఆర్థిక స్వావలంభన దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు పథకాల లబ్దిదారుల ఎంపికల్లో జరుగుతున్న కార్యక్రమాలు గడిచిన నాలుగున్నరేళుగా జుగుప్సాకరంగా మారాయి. రాష్ట్రంలో దళిత వర్గాలపై జరుగుతున్న దాడులు హింసాత్మక సంఘటనలను నిరసిస్తూ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక చర్చల నేపథ్యంలో ఆర్థిక స్వావలంబన దిశగా చేసిన సూచనల మేరకు సీఎం కేసీఆర్ హుజురాబాద్ ఎన్నికల సందర్భంగా 'దళిత బంధు' ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టుగా తంగళ్ళపల్లి మండలంలోని గండి లచ్చపేట గ్రామాన్ని ఎంపిక చేసి అమలు చేశారు. ఈ క్రమలోనే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలుచేస్తున్న దళితబంధు పథకాన్ని గ్రామంలోని ఎస్సీలకు రాజకీయాయలకు అతీతంగా రూ.10లక్షల ఆర్థిక సాయం అందించడం హర్షించదగ్గ విషయం. రాష్ట్ర ప్రభుత్వం నియోజవర్గాల వారిగా రెండో విడతలో 600 మంది లబ్దిదారులకు ఈ పథకాన్ని అందించేందుకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలకే ఎంపిక అవకాశాలను కల్పించిన ప్రభుత్వం తంగళ్ళపల్లి మండలంలో మాత్రం బీఆర్ఎస్ సర్పంచులు, నాయకులు, ప్రజాప్రతినిధులు అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందే విధంగా చొరవ చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి పథకాలు అందించాలని ఉద్దేశంతో దళిత బంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు లాంటి మరెన్నో పథకాలు పవేశపెడితే అవి పక్కదారిపడుతున్నాయి. నాయకులు లబ్దిదారులను ఎంపిక చేయడంలో ఆయా గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషిస్తూ తమకు అనుకూలంగా, ఉన్న వారిని మాత్రమే ఎంపిక చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరంగా ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

'పథకాల' ఆశతో గులాబీ గూటికి
బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థిక చేయూత పథకాలు, చేతివృత్తులకు తోడ్పాటుకు సంబంధించి అధికార బీఆర్ఎస్ చెందిన వారికే అధిక ప్రాధాన్యత ఉండడంతో వాటి ప్రయోజనాలు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆపార్టీ కార్యకర్తలకు, సానుభూతిపరులుగా ఉన్న వర్గాలకే అందాయనడంలో సందేహం లేదు. బంగారు తెలంగాణ సాధనలో పథకాలు అమలు పారదర్శకంగా జరగాలని మండల ప్రజలు బలంగా కోరుతున్నారు.

ఎందుకులే అందరితో తంటా...
గ్రామాల్లో ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తెల్లవారితే చాలు గ్రామాల్లో ప్రజాప్రతినిధుల ఇంటిముందు వాలుతున్నారు. ప్రభుత్వ పథకాలు తమకు వర్తించాలంటే సర్పంచ్, ఎంపీటీసీ, ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల ఇళ్ళ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో నాకు ఓటు వేయలేదని, నాకు ఎక్స్‌గా ఉన్న వారికి సపోర్ట్ చేశావని, గ్రామ సభల్లో ప్రశ్నిస్తున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకే పథకాల వర్తింపు
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలకే ఎక్కువ వర్తిస్తున్నాయని మండలంలో వాదనలు వినిపిస్తున్నాయి. నాయకులకు అండగా ఉన్న వారికి, బీఆర్ఎస్ కార్యకర్తలకు ప్రభుత్వ పథకాల వర్తింపులో ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఎక్కువ ముగ్గు చూపుతున్నారు. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సూచించిన వారి పేర్లు మాత్రమే ఎంపిక చేయాలని అధికారులపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది.

నేటి నుంచి బతుకమ్మ చీరలు పంపిణీ



మండల కార్యాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న బతుకమ్మ చీరలు

నవతెలంగాణ-చందుర్తి:
తెలంగాణ ప్రభుత్వం ఆడపడుచులకు ప్రతి ఏటా బతుకమ్మ చీరలు అందజేస్తున్న విషయం తెలిసిందే. బతుకమ్మ చీరలను మండల పరిషత్ కార్యాలయంలో నిల్వ చేసారు. గ్రామాల వారిగా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నారు. నేటి నుంచి బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు అభివృద్ధి అధికారి రవిందర్ తెలిపారు.

పూర్తి స్థాయిలో చేరని చీరలు
మహిళ జనాభా ప్రకారం చీరలను అందించాలి. ఈ సారీ అందరికీ అందడం కష్టంగా ఉందని తెలుస్తోంది. సరిపడే బతుకమ్మ చీరెలు రాలేదని సమాచారం. మండలంలో 19 గ్రామ పంచాయితీలున్నాయి. ఈ గ్రామాల పరిధిలో మహిళల సంఖ్య 13, 461 మంది ఉన్నారు. కానీ మండలానికి వచ్చిన బతుకమ్మ చీరల సంఖ్య మాత్రం 12, 644 దీంతో 801 చీరలు తక్కువగా పంపిణీ వచ్చాయి. దీంతో తల పట్టుకున్న అధికారులు చేసేదేమీ లేక ఒక్కో గ్రామానికి ఇండెంట్ ప్రకారం కాకుండా బతుకమ్మ చీరలను తగ్గించి పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. గ్రామాల వారిగా ఎనిమిది చీరల చొప్పున తగ్గించి పంపిణీ చేశారు. ఏది ఏమైన 801 మంది మహిళలకు బతుకమ్మ చీరలు అందని ద్రాక్షగానే మిగలనుంది. ప్రతి గ్రామ పంచాయితీలో 8 మంది మహిళలకు బతుకమ్మ చీరలు అందని పరిస్థితి నెలకొంది.

అందరికీ చీరెలు అందిస్తాం: ఎంపీడీవో రవిందర్
ఈ విషయంపై ఎంపీడీవో రవీందర్‌ను వివరణ కోరగా నేటి నుంచి బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తామని తెలిపారు. మహిళ సంఖ్య వరంగానే బతుకమ్మ చీరలు రావడం జరిగిందన్నారు. ఎక్కడ తక్కువ చీరల పంపిణీ జరుగదని పేర్కొన్నారు.

పోతిరెడ్డి పల్లె - వెంకటాపూర్
గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ



బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట:
దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వానికి, సీఎం కేసిఆర్‌కు అండగా నిలువాలని ఎల్లారెడ్డిపేట జడ్పీటీసీ సభ్యులు చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రుణుక కిషన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ - పోతిరెడ్డిపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ. 90 లక్షలు మంజూరు కాగా ఆ నిధులతో నిర్మించనున్న బ్రిడ్జికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్యతో కలిసి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ పోతిరెడ్డిపల్లె పల్లె గ్రామం చుట్టూ దట్టమైన అడవి ఉందన్నారు. వెంకటాపూర్ నుండి ఎత్తు వంతల గుంతలు పడిన నాలుగు గజాల మట్టి రోడ్డు ఉండేదని, వర్షం పడితే రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండేదన్నారు. అప్పటి సర్పంచ్ కనకట్ల బాలయ్య, ఈ విషయాన్ని పలుమార్లు రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కేటిఆర్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంకటాపురం నుంచి పోతిరెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి నుంచి మల్కాపేట, దర్మారం మధ్య బీటి రోడ్డు మంజూరు కాగా, రోడ్లు నిర్మించుకోవడం జరిగిందన్నారు. నిర్మాణం అవుతున్న బ్రిడ్జికి మాజీ సర్పంచ్ కనకట్ల బాలయ్య పేరు నామకరణం చేయనున్నట్లు ఆగయ్య ప్రకటించారు, గ్రామంలో ఫోన్లు పనిచేయడం లేదని గ్రామస్తులు చాలా కాలంగా విజ్ఞప్తి చేయగా మంత్రి కేటిఆర్ అక్కడ సెల్ టవర్ కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ నాయకత్వంతో పల్లెలన్నీ గననీయంగా అభివృద్ధి చెందాయని రైతు సంక్షేమ కోసం వ్యవసాయరంగానికి నిరంతర మెరుగైన కావాల్సినంత ఉచిత విద్యుత్ సరఫరా, రైతుబంధు, ఐదు లక్షల ఇన్సూరెన్స్ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసిఆర్‌దేనని అన్నారు. రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధి అభివృద్ధి విద్యుత్ సరఫరా మెరుగుపరచడానికి విద్యుత్తు సబ్ స్టేషలలో నూతన ట్రాన్స్‌ఫార్మార్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కేటీఆర్‌ను గెలిపిస్తే మరింత రాష్ట్రాన్ని అభివృద్ధి చేసకోవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గనమనేని లక్ష్మణ్‌రావు, ఉపసర్పంచ్ కనకట్ల వెంకయ్య, వెంకటాపూరం సర్పంచ్ కోలా అంజమ్మ, నర్సయ్య, ఎంపీటీసీ మండల ఫోరం అధ్యక్షుడు మామిండ్ల తిరుపతి బాబు, సెస్ డైరక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసి చైర్మన్ ఎలుసాని మోహన్ కుమార్, ఏఎంసి మాజి చైర్మన్ అందె సుభాష్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండారి బాల్‌రెడ్డి, ఏఎంసి డైరక్టర్ మెండె శ్రీనివాస్ యాదవ్, నాయకులు చీటి రామారావు, ఎలగందుల నరసింహులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నిరసన



నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలుపుతున్న టీపీటీఎఫ్ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:
జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ప్రభుత్వం ప్రకటించిన మధ్యంతర భృతి 5శాతంను వ్యతిరేకిస్తూ టీపీటీఎఫ్ ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్ కట్టుకుని మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీఆర్‌సీ 27 శాతం ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం పునరాలోచించి ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోర్నాల భూపాల్ రెడ్డి,అంబటి రమేశ్, తిరుపతి, రవిబాబు, నరేందర్, రాజలింగం, రాంబాబు పాల్గొన్నారు.

నేడు నూతన జీపీ భవనాలు ప్రారంభోత్సవం

నవతెలంగాణ-ముస్తాబాద్:
మండలంలోని వివిధ గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలతో పాటు, పలు అభివృద్ధి పనుల నేడు ప్రముఖ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులచే ప్రారంభించనున్నట్లు చేయనున్నట్లు ఎంపీపీ శరత్ రావు తెలిపారు. మొర్రాపూర్, తెర్లుమద్ది, సేవాలాల్ తండా, తుర్కపల్లి, ఆవునూర్, రామలక్ష్మపల్లి నూతన గ్రామ పంచాయతీలు ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

నవతెలంగాణ-ముస్తాబాద్:
రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామం లో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను పట్టుకుని శిక్షించాలని మండల దళిత నాయకులు డిమాండ్ చేశారు. రాష్ర వ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని దళిత నాయకులు మాజీ సర్పంచ్ కాంపల్లి శ్రీనివాస్, పెద్ది గారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గల్ఫ్ నుంచి వస్తూ వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-చందుర్తి:
గల్ఫ్ నుంచి వస్తూ ఓ వ్యక్తి అదశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండపల్లి గ్రామానికి చెందిన గడ్డం మనోహర్ రెడ్డి అనే వ్యక్తి గత నాలుగు ఏండ్ల కిందట ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్ళాడు. ఈ క్రమంలో గత నెల 11న స్వగ్రామానికి బయలుదేరగా విమానం కేరళ వయా ఉండగా, అక్కడ దిగి బయటకు వచ్చి మనోహర్‌రెడ్డి ఓ వ్యక్తి పోన్‌తో తన భార్య మమతకు మాట్లాడినట్లు సమాచారం. నా దగ్గర డబ్బులు లేవు అక్కడి రావడానికి అని చెప్పి పోన్ కట్ చేసాడు. దీంతో మళ్ళీ ఆ పోన్ కు ఫోన్ చేయగా అతను కొచ్చిన్ రైల్వేస్టేషన్‌లో ఉన్నాడని ఆ వ్యక్తి తెలిపాడు. మనోహర్ రెడ్డి రాక పోవడంతో గత నెల 25న చందుర్తి పోలీస్ స్టేషన్ లో మనోహర్ రెడ్డి భార్య మమత ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకు అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలువక పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉన్నారు.

కట్టలింగంపేట గ్రామంలో వైద్య పరీక్షలు
'నవతెలంగాణ' కథనానికి స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నవతెలంగాణ-చందుర్తి:
మండలంలోని కట్ట లింగంపేట గ్రామంలో విష జ్వరాలు రావడంతో నవ తెలంగాణ దిన పత్రికలో 'మంచం పట్టిన కట్ట లింగంపేట' అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వైద్యాధికారి సంపత్ తో పాటు వైద్యబృందం ఇంటింటా సర్వేలు నిర్వహించారు. జ్వరపీడితులను గుర్తించి వైద్య సేవలందించాకె. అవసరమైన మందులు అందజేశారు.

రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి
మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలసాని మోహన్ కుమార్



ఎలుసాని మోహన్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట:
రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానని బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలుసాని మోహన్ కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రావ ంలో మంగళవారం ఇటీ వల నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్ కుమార్‌లతో పాటు డైరక్టర్ తాడ ప్రతాప్ రెడ్డిని బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు లోకుర్తి బాలమల్లు, ఎంపిటిసి మధు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎలుసాని మోహన్ కుమార్ మాట్లాడుతూ అన్నదాతలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కరుణాకర్ రావు, మాజీ సర్పంచ్ సుధాకర్ రావు, సురభి కాంతారావు, తిరుపతి రావు, బాల్‌రెడ్డి, రామ్ రెడ్డి, రవి, తిరుపతి, కిషన్ రెడ్డి, రాజం, అరవింద్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పాటించని కాంగ్రెస్

- జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్



పాదయాత్రలో మాట్లాడుతున పుట్ట మధు

నవతెలంగాణ-మంథని: రాష్ట్రంలో పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయం పాటించడం లేదని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు.ప్రజా ఆశీర్వాద పాదయాత్రలో బాగంగా మంగళవారం మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి నుంచి రామగిరి మండలం సెంటనరీకాలనీ వరకు కొనసాగింది. సోమవారం రాత్రి గంగాపురిలో బస చేసిన ఆయన మంగళవారం ఉదయం మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజతో కలిసి కూచిరాజ్‌పల్లి, పుట్టపాక, అక్కెపల్లి మీదుగా రామగిరి మండలం రామయ్యపల్లి, రాజాపూర్, లద్నాపూర్, ఆదివారంపేట, నాగేపల్లి, రత్నాపూర్ మీదుగా పన్నూర్‌కు చేరుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థికి బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా మహిళలు మంగళహారతులతో స్వాగ తం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 65ఏండ్లుగా కాంగ్రెస్‌పార్టీ ఒకే కుటుంబానికి ఒకే సామాజికవర్గానికి టికెట్ ఇస్తూ ఈ ప్రాంతంలోని ఇతర సామాజిక వర్గాలకు అన్యాయం చేసిందన్నారు.

నవతెలంగాణ

8

పెద్దపల్లి

బుధవారం | అక్టోబర్ 4, 2023 | www.navatelangana.com

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

నవతెలంగాణ సుల్తానాబాద్ రూరల్(ఎలిగేడు)



మాట్లాడుతున్న దాసరి మనోహర్ రెడ్డి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే దాసరి మనోమర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని ఎలిగేడు మండలం లోకపేట, ముప్పిరి తోట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొమ్మి దిన్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు, జడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక రాజనర్సు, మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, పాక్స్ చైర్మన్‌లు మోహన్‌రావు, విజయ భాస్కర్‌రెడ్డి, రైతు సమితి మండల కో ఆర్డినేటర్ సుధాకర్‌రావు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు మాడ కొండాల్ రెడ్డి, సర్పంచ్‌లు వేణు, ఐలయ్య, ఎంపీటీసీ నారగోని ఎల్లమ్మ పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని: సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివద్ధి పథంలో రామగుండం నియోజకవర్గం పరుగెడుతుతుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 48, 49 డివిజన్లలో అభివద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసారు. ఆయన మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్ల అధిక మెత్తంలో నిధులను కేటాయిస్తూ, ప్రతి డివిజన్‌లో సమస్యలు పరిష్కారం చేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్ పొన్నం విద్య-లక్ష్మణ్ గౌడ్, బాలరాజ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యులు వంగ శ్రీనివాస్ గౌడ్, రఫీక్, తానిపర్తి గోపాల్ రావు, నూతి తిరుపతి, మండ రమేష్ గౌడ్, కాంపల్లి సతీష్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చందర్, మేయర్ అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్‌ను 48వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం విద్య-లక్ష్మణ్‌లు ఘనంగా సన్మానించారు. అలాగే 14వ డివిజన్‌లో 10 లక్షలతో పద్మశాలి సంఘ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

ప్రమాదానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-గోదావరిఖని: గోదావరిఖనిలో మెడికల్ కాలేజీ నిర్మాణం పనుల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన వలస కార్మికుడి మరణానికి కారణమైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ.గౌస్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు శనగల శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజీ నిర్మాణం పనుల్లో ప్రమాదవశాత్తు వలస కార్మికుడు మృతి బాధాకరమైన విషయమని వారు తెలిపారు. నష్టపరిహారం చెల్లించనిచో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయండి

నవతెలంగాణ-గోదావరిఖని: 35 ఏళ్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని శాతవాహన యూనివర్సిటీ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు శాతవాహన యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులు మాట్లాడారు. ఈ సమావేశంలో ఉద్యోగులు నల్లి శంకర్, కమలాకర్, ప్రసాద్ ,రవి ,రాంబాబు, రమేష్, బి.కళ, సుజాత ,సంధ్య పాల్గొన్నారు .

బొగ్గు గని కార్మికుల వేతనాలు చెల్లించండి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: బొగ్గు గని కార్మికుల వేతనాలు సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్జీ-2 డివిజన్‌లో అన్ని మైన్ల డిపార్టుమెంట్‌లో నల్ల బ్యాడ్జీలతో సీఐటీయూ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓసీపీ-3 కృషి భవన్‌లో ఆర్జీ-2 డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కే ప్రవీణ్ కుమార్, బి సంతోష్ పాల్గొని గని మేనేజర్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు ఉల్లి మొగిలి హాజరై మాట్లాడుతూ కార్మికుల జీతాలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించడం వారి చేతగానితనానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మంద భూమయ్య, నర్రా సాంబరాజు, సీహెచ్ రాంసాగర్, శాదిక్ పాషా పాల్గొన్నారు.

కేటీఆర్‌ను విమర్శించే స్థాయి విజయ రమణారావుకు లేదు

నవతెలంగాణ-సుల్తానాబాద్: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ను విమర్శించే స్థాయి స్థానిక మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావుకు లేదని ఎంపీపీ బాలాజీరావు, పురం ప్రేమ్ చందర్‌రావు, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ముత్యం రమేష్‌గౌడ్ ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక వైశ్య భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఐటీ పురపాలకశాఖ మాత్యులు కల్వకుంట్ల తారక రామారావు పెద్దపల్లి బహిరంగ సభతో చింతకుంట విజయ రమణారావుకు మతి భ్రమించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలో పలువురి చేరిక

నవతెలంగాణ-మంథని: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా మంగళవారం మంథని మండలం పుట్టపాక గ్రామం వద్ద సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొత్త రమాదేవి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పుట్టపాక వార్డు సభ్యురాలు కన్నూరి విజయ-రాజబాపుతో పాటు పలువురు నాయకులు ఉన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని మల్హర్రావు మండలం చిన్నచిన్న గ్రామ మాజీ సర్పంచ్ విజయగిరి సుదర్శన్, కాంగ్రెస్ మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు బండెల లక్ష్మీతో పాటు 30 మంది మహిళలు మంగళవారం బీజేపీలో చేరారు. మంగళవారం మంథనిలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రపట్ల సునీల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రత్యేక పథకాలు

నవతెలంగాణ- సుల్తానాబాద్ రూరల్



మహిళకు గ్యారంటీ పత్రాన్ని ఇస్తున్న రాములు

మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక పథకాలను రూపొందించిందని కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు పన్నాల రాములు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని హనుమండ్లపల్లి, మెండపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కమిటీ అధ్యక్షుడు చొప్పరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పెంట వెంకటేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బయ్యా రాము, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి సాయి, చొప్పరి అశోక్, మర్రి సంపత్, రాజు, నాగరాజు, ఓదెలు, యాదగిరి అంజయ్య పాల్గొన్నారు.

గీత కార్మిక సంఘం నాయకులకు సన్మానం

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్ (ఎలిగేడు)

ఎలిగెడు మండలం ధూళికట్ట , సుల్తాన్పూర్ గ్రామాల్లో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఎన్నుకోగా గౌడ సంఘం నాయకులు, ఎగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎగొలపు సదయ్య గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు బుసారపు నర్సయ్యగౌడ్, పల్లె వీరస్వామి గౌడ్, పూదరి వెంకటేష్‌గౌడ్, ఆకుల తిరుపతిగౌడ్, బుసారపు రమేష్‌గౌడ్, కోటగిరి పర్శరాములు గౌడ్, కొయ్యడ నర్సయ్య గౌడ్,పడాల నరేష్ గౌడ్ అధిక సంఖ్యలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

జూట్ బ్యాగ్ కోర్సు కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సింగరేణి సేవా సమితి ద్వారా జూట్ బ్యాగ్ తయారీలో శిక్షణ ఇవ్వడానికి స్థానిక మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఏరియా డీజీఎం (పర్సనల్) అధికార ప్రతినిధి జి.రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణకు జనరల్ మేనేజర్ కార్యాలయం ఆర్జీ-2 నందు ఈనెల 7 లోపు అందజేయాలని దరఖాస్తులు అందజేయాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-మంథని: లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు, మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంథని మండలం అక్కేపల్లి గ్రామనికి చెందిన బి కృష్ణవేణికి రూ.12వేలు, విలోచవరం గ్రామానికి చెందిన సమ్మక్కకు రూ.11,500వేల రూపాల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంథని మండల అధ్యక్షుడు ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిది శంకర్, మంథని మండల యూత్ అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్‌ల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

ప్రొఫెసర్ గజానన్ తామన్ మృతి

నవతెలంగాణ-మంథని



బహుభాషా కోవిదుడు తెలుగు, సంస్కృతం, మరాఠీ, బెంగాలీ ఉర్దూ పంజాబీతో పాటు ఆంగ్లభాషలో నిష్ణాతులు. ఆచార్యులు, పండితులు, కవి రచయిత గజానన్ తామన్(86) మృతిచెందాడు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే ప్రజా ఆశీర్వాద పాదయాత్రలో నిమగ్నమైన జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ మంగళవారం ఉదయం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. మంథనికి చెందిన ఆయన మహారాష్ట్రలోని నాందేడ్‌లోని పీపుల్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. రిటైర్డ్ అయిన వెంటనే కుటుంబంతో సహా స్వగ్రామమైన మంథనిలో నివాసం ఉంటున్నారు. దివంగత మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు క్లాస్మేట్. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పైఅంతస్తు నుంచి పడి కూలీ మృతి

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:



రామ్ మిలన్ యాదవ్ మృతదేహం

గోదావరిఖని నూతనంగా చేపడుతున్న సింగరేణి మెడికల్ కళాశాల నిర్మాణ పనుల్లో భాగంగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామ్ మిలన్ యాదవ్(40) అనే కూలీ మంగళవారం పై అంతస్తు నుంచి కింద పడి మృతి చెందాడు. దాస్ ఇంజనీరింగ్ కంపెనీ దగ్గర పనిచేస్తున్న మృతుడు రోజూ వారి పనుల్లో భాగంగా 7వ అంతస్తు వద్ద పనులు నిర్వహిస్తుండగా జారీ కిందపడిపోయాడు. దీంతో బలమైన దెబ్బలు తాకడంతో రామ్‌మిలన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి 20లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిఎంఈ, జిల్లా కలేక్టర్ దష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్యారంటీ సభ

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:



మాట్లాడుతున్న మనాలీ రాజ్‌ఠాకూర్

47వ డివిజన్ అడ్డగుంటపల్లిలో కాంగ్రెస్ గ్యారంటీ సభను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మాఖాన్ సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ పాల్గొని మాట్లాడారు. ఈసారి రామగుండం నుంచి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఒక అవకాశం కల్పించి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలునారు.

తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యుడిగా శశిభూషణ్

నవతెలంగాణ-మంథని: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యులుగా మంథనికి చెందిన న్యాయవాది, రైతు నాయకుడు శశిభూషణ్ కాచె నియమితులయ్యారు. శశి భూషణ్ కాచెను కమిషన్ చైర్మన్ తన్నీరు రంగారావు పునర్ నియామకం చేశారు. కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పని చేయనున్నట్లు ఆయన తెలిపారు.

జర్నలిస్టులకు వెంటనే దళిత బంధు పథకం ఇవ్వాలి

- లేదంటే పెద్దపల్లి ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం తప్పదు
- తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న జర్నలిస్టులు

నవ తెలంగాణ-పెద్దపల్లి: పెద్దపల్లి నియోజకవర్గంలో దళిత జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, దళిత బంధు పథకం వెంటనే ఇవ్వాలని లేదంటే పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోర్డెకి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి మల్లేష్ హెచ్చరించారు. తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కన్నం చంద్రమౌళి అధ్యక్షతన పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో పెద్దపల్లి జిల్లాలోని ప్రధానంగా పెద్దపల్లి నియోజకవర్గంలోని వివిధ పత్రికలు టీవీ ఛానల్ లో పనిచేస్తున్న దళిత జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. దళిత జర్నలిస్టుల సమస్యలపై భవిష్యత్తులో పోరాటాలు చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్కు ఫిర్యాదు చేస్తామన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రధాన జర్నలిస్టు సంఘాల తో పాటు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కూడా పలుమార్లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ములుగురి కమల్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి ముఖేష్ జిల్లా నాయకులు కన్నూరి అంజి, రాజకుమార్, తాళ్ల పెల్లి రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

డీపీఈ నిబంధనలు సడలించాలి

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల

నవతెలంగాణ-గోదావరిఖని:



కార్మికులకు నల్ల బ్యాడ్జీలు ధరింపజేస్తున్న తుమ్మల

డీపీఈ నిబంధనలు సడలించి వేతన ఒప్పందాన్ని కొనసాగించాలని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి ఆర్జీ-1 ఏరియా బ్రాంచ్‌లో అన్ని మెన్స్ డిపార్ట్మెంట్స్ ఓసీపీలలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆర్జీ-1 బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన వ్యక్తం చేయడంతో పాటు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్ ఇండియాలో కార్మికులకు వేతనాలను ఆపినందుకు నిరసనగా, డిపిఈ నిబంధనలకు సడలింపు ఇచ్చి 2.5 లక్షల బొగ్గు గని కార్మికులకు వేతన ఒప్పందాన్ని యధావిధిగా కొనసాగించి ఈ గొడవకు చరమ గీతం పాడాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు ఆరేపల్లి రాజ మౌళి, ఆసరి మహేష్, ఎస్కె గౌస్, సంయుక్త కార్యదర్శి జెల్ల రాజేంద్ర, అన్నం శ్రీనివాస్, ఇప్పలపల్లి సతీష్ కుమార్, నంది నారాయణ, సంతోష్ కుమార్, బదే రవి, బూరుగుల రాములు, వంగల శివరాంరెడ్డి, శ్రీనివాసరావు, రాములు, సతీష్ కుమార్, మల్లేష్, జనార్ధన్, సురేష్, వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం నియోజక వర్గ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరుతూ తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేష్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గోదావరిఖని మెయిన్ చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఎన్నికల శంఖారావం ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్రె అఖిల్ వర్మ, గొర్రె లక్ష్మి, అల్లెపు తిరుపతి, చెరుకు పైడి, బాజా వెంకటేష్, ఖన్నం భాను చందర్, చిట్యాల మోహన్ రెడ్డి, సలిగంటి ఓదెలు, మహమ్మద్ అక్బర్, కలువల రాజయ్య, జక్కం కవిత, పొనం రజిత తదితరులున్నారు.

ట్రేడ్‌ఎక్స్ పో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గోదావరిఖని:



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ అనిల్

ఈ నెల 6, 7, 8వ తేదీలలో ప్రతిష్టాత్మకంగా కేబీఆర్ కన్వెన్షన్ హాల్ ఎల్బీనగర్ హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం, ఫొటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతి సంవత్సరం భాగంగా ఏర్పాటు చేస్తున్న ట్రేడ్‌ఎక్స్ పోకు సంబంధించిన పోస్టర్‌ను నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాల రాజ్ కుమార్, మరియు అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శనిగరం మల్లేష్, కోశాధికారి బండారి ప్రసాద్, మరియు అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ దుస్సా మహేష్, తోగటి శ్రీధర్, గుబ్బల సుబ్రహ్మణ్యం, రామగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ బీసీ సెల్ అధ్యక్షుడు నరేష్

నవతెలంగాణ-గోదావరిఖని: అంతర్గం మండల భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆదుముల్లా నరేష్ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెస్ ఠాకూర్ ఆయనకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, అంతర్గం మండలం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మడ్డి తిరుపతి గౌడ్, గోలివాడ మాజీ ఎంపీటీసీ రామ్మూర్తి గౌడ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో దండుగుల సంధ్యారాణి చేరిక

నవతెలంగాణ-గోదావరిఖని:



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

అంతర్గాం మండల పరిధిలోని అంతర్గాం టీటీఎస్ టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు దండుగుల సంధ్యారాణి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలొ స్థానిక సర్పంచ్ కుర్ర వెంకటమ్మ నూకరాజు, మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతినాయక్, మండల మహిళా అధ్యక్షురాలు కుర్ర కష్ణవేణి శ్రీనివాస్, గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర చైర్మన్ గిట్ల శంకర్ రెడ్డి, కుర్ర చరణ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌కు జడ్పీటీసీ సంధ్యారాణి రాజీనామా

నవతెలంగాణ-గోదావరిఖని:



రాజీనామాను ప్రకటిస్తున్న జడ్పీటీసీ

బీఆర్ఎస్ పార్టీకి పాలకుర్తి జడ్పీటీసీ కందుల సంధ్యారాణి రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన రాజీనామాపత్రాన్ని బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌కు పంపినట్లు ఆమె తెలిపారు. కార్యక ర్తలు, మిత్రులు శ్రేయోభిలాషుల కోరిక మేరకు రామగుండం నియోజకవర్గం నుంచి ఈ సారి జరుగనున్న ఎమ్మెల్యే ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని తెలిపారు.

దేశంలోనే ఆధునికమైన ప్లాంట్ టీఎస్టీపీసీ ప్రాజెక్ట్

- 800 మెగవాట్ల యూనిట్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని

నవతెలంగాణ-గోదావరిఖని:



జాతికి అంకితం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

దేశంలోనే అత్యంత ఆధునికమైన ఎన్టీపీసీ విద్యుత్ పవర్ ప్లాంట్ రామగుండంలోని తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ అని దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలోని నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ యొక్క తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ మొదటి 800 మెగావాట్ల యూనిట్‌ను మంగళవారం జాతికి అంకితం చేశారు. కంపెనీ ఉత్తమ పద్ధతులను అవలంబించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి మరియు పచ్చటి భవిష్యత్తు కోసం స్వచ్ఛమైన ఇంధన సాంకేతికతలను స్వీకరించడానికి కట్టుబడి ఉందని అన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన ఎంపీటీసీ

నవతెలంగాణ-ముత్తారం: ముత్తారం తహసీల్దార్ బి.రాజేశ్వరీని అడవీ శ్రీరాంపూర్ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి బాలాజీ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రేషన్ బియ్యానికి సంబంధించిన సమస్య ఇంకా పరిష్కారం కాలేదని తెలియజేయగా, దీనిపై జాయింట్ కలెక్టర్ ఆదేశానుసారం కమీషనర్‌కు లేఖ రాయడం జరిగిందని తెలిపారు. సమస్య త్వరలో పరిష్కారం అవుతుందని ఎంపీటీసీకి తహసీల్దార్ తెలిపారు.

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను బీజేపీ మానుకోవాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు

నవతెలంగాణ-పెద్దపల్లి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

బీజేపీ ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ గారి విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు నష్టం చేసే విధానాలు అనుసరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎండీ కాజా, లక్ష్మణ్, రాజలింగం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాగు రవి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సదరం స్లాట్ బుకింగ్

నవతెలంగాణ-పెద్దపల్లి: దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం ఈనెల 4న మీ- సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వి. శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. క్రొత్తగా సదరం సర్టిఫికేట్ కావాల్సిన వారు, తాత్కాలిక సదరం సర్టిఫికేట్ ఉన్నవారు రెన్యువల్ కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

గడపగడపకు కాంగ్రెస్-పల్లె పల్లెకు విజ్ఞన్న

నవతెలంగాణ-జూలపల్లి: హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గడపగడపకు కాంగ్రెస్- పల్లె పల్లెకు విజ్ఞన్న అనే నినాదంతో మండలకేంద్రంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ కార్డుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బొజ్జ శ్రీనివాస్, లోక జలపతి రెడ్డి, గండు సంజీవ్, పోట్యాల శంకర్, సిరికొండ కొమురయ్య, కొమ్ము పోచాలు, బండి స్వామి, బొట్ల వెంకటేష్, కొప్పుల శ్రవణ్ , ఇల్లందుల కనకయ్య పాల్గొన్నారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

నవతెలంగాణ ఓదెల: మండలంలోని శానగొండ గ్రామంలో భూతగాదాల కారణంగా ఒక వ్యక్తిపై దాడి చేసిన కేసులో నలుగురిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. శానగొండ గ్రామంలో ఎర్రవల్లి సంపత్‌రావు రంగు రాజయ్యకి భూతగాదాలు ఉన్నాయి. ఈ తగాదా విషయంలో పలుమార్లు పంచాయితీ జరగగా రంగు రాజయ్య కుమారుడు శ్రావణ్ స్నేహితుడు ఎర్రవెల్లి కుమారస్వామి అతనితో పంచాయతీ విషయంలో వెళ్లేవాడు. ఈ విషయం మనసులో పెట్టుకొని ఎర్రవెల్లి కుమారస్వామి పొలం పనుల నిమిత్తం వెళ్లి వస్తుండగా దారిలో ఎర్రవల్లి సంపత్ రావు ఇంటి దగ్గర అడ్డగించి కుటుంబ సభ్యులతో సహ ఉద్దేశపూర్వకంగా కులం పేరుతో దూషించి, విచక్షణా రహితంగా కర్రలతో, ఇటుకలతో దాడిచేశారు. ఈ విషయంపై బాధితుడి తండ్రి రేవల్లి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్రవెల్లి సంపత్‌రావు, ఎర్రవల్లి ప్రణయ్ భాస్కర్, ఎర్రవల్లి ఉదయభాస్కర్, ఎర్రవల్లి రమాదేవిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండించాలి

నవతెలంగాణ-గోదావరిఖని:



కార్మికులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

సింగరేణి కార్మికులందరూ ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండించాలని టీఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ కోరారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జడీకే 1వ గని కార్మికులటను వారు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు పరుగు పందెం ద్వారా సుమారు 30 వేల మందికి సింగరేణి సంస్థలో ఉద్యోగాలు చంద్రబాబు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మల్టిపుల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సంగేపు రాజు, పెద్దపెల్లి పార్లమెంటరీ టిఎన్టియుసి అధ్యక్షులు సల్ల రవీందర్, తెలుగుదేశం పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు పాపయ్య తదితరులటున్నారు.

ముత్తారం బీజేపీ కమిటీ నియామకం

నవతెలంగాణ-ముత్తారం:



కమిటీని ఎన్నుకుంటున్న నాయకులు

ముత్తారం మండలంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పెయ్యాల కుమార్, మండల ఇన్‌చార్జి బిరుదు గట్టయ్య, సీనియర్ నాయకులు మూగ మల్లేష్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా మారం శ్రీనివాస్ రెడ్డి, బొడ్డు సారయ్య, ఈసంపల్లి శ్రీనివాస్, కత్యూరి నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా అమ్ము శ్రీనివాస్, చొప్పరి సమ్మయ్య, కార్యదర్శులుగా దాసరి ప్రశాంత్, బుదారపు సంతోష్, సైండ్ల కుమార్, పిట్టల రాజయ్య, మూడుపోజు వెంకట రాజం, కోశాధికారి షేర్ సంపత్, సభ్యులుగా ఎర్ర నరేష్, కసియోజుల మల్లయ్య, అలువోజు మహేందర్, కిసాన్ మోర్చ అధ్యక్షుడుగా దేవనూరి కొమురయ్య, ఎస్సీ మోర్చా అధ్యక్షుడుగా మినుగు చక్రి, గిరిజన మోర్చా అధ్యక్షుడు పెద్ది లక్ష్మీరాజ్యంలను ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో దీక్షితకు బంగారు పతకం



నవతెలంగాణ-మంథని: మంథని మండలంలోని సూరయ్యపల్లికి చెందిన దేవరకొండ దీక్షిత వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ అండర్-17 ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పథకం సాధించింది. సూరయ్యపల్లి గ్రామానికి చెందిన దేవరకొండ వెంకటస్వామి-ప్రేమలత కూతురు దీక్షిత ప్రస్తుతం హైదరాబాద్ స్పోర్ట్స్ కళాశాలలో ఇంటర్ చదువుతూ పంజాబ్‌లోని పటియాలలో ఫెన్సింగ్‌లో శిక్షణ పొందుతుంది.

స్వచ్ఛతాహీ స్పెషల్ క్యాంపెయిన్ 3.0

నవతెలంగాణ-గోదావరిఖని:



మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో స్వచ్ఛతాహీ స్పెషల్ క్యాంపెయిన్ 3.0 ప్రారంభోత్సవాని మంగళ వారం జీఎం చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రామ్మోహన్, ఏజీఎం పర్సనల్ లక్ష్మి నారాయణ, ఎన్విరాన్మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, టీబీజీకెఎస్ ప్రతినిధి సత్య నారాయణ, సీఐటీయూ ప్రతినిధి సాయిరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్స్ బంగారు సారంగపాణి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్-జగిత్యాల
బుధవారం | అక్టోబర్ 4, 2023 | www.navatelangana.com

అనాథ ఆశ్రమానికి విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ విద్యార్థుల చేయూత

నవతెలంగాణ- హుజురాబాద్ : పట్టణంలోని స్థానిక విజ్ఞాన నెక్స్ట్ జెన్ పాఠశాల విద్యార్థులు బాలల సంరక్షణ సంస్థకు తమ వంతు సాయం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. పోచంపల్లి రాజయ్య ఫౌండర్‌గా ఉన్న మంథని డివిజన్ హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ, గోదావరిఖని తమ సభ్యులైన రవణమ్మ, గాయత్రీలను పాఠశాలకు పంపించగా, విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాల యాజమాన్యం, పిల్లలు కలిసి రూ.8044నీ వెల్ఫేర్ సొసైటీకి పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎక్కువ మొత్తం కలెక్ట్ చేసిన విద్యార్థులను మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్, డైరెక్టర్ తిరుపతియాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న కరస్పాండెంట్, విద్యార్థులు

మోడల్ బస్టాప్‌గా గుండ్లపల్లి

నవతెలంగాణ-మేడిపల్లి : మండలంలోని గుండ్లపల్లి గ్రామం మోడల్ బస్టాప్‌గా ఆదునీకరించారు. డీఎంఎఫ్‌టీ నిధులు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ ఈర్నాల సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో రూ.4 లక్షలతో రెండు మోడల్ బస్ స్టాప్‌ల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



డబల్ రోడ్డు పనులు పూర్తి చేయాలి

గ్రామ సర్పంచ్ తుంపేట లక్ష్మి నరసయ్య

నవతెలంగాణ-మేడిపల్లి : డబల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని మోత్కరావుపేట సర్పంచ్ తుంపేట లక్ష్మినరసయ్య అన్నారు. మేడిపల్లి మండలంలోని మారుమూల గ్రామమైన మోత్కరావుపేటలో ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో మండలం నుంచి చందుర్తి వరకు పూర్తి చేస్తానని చెప్పారని, శివరాత్రి సమయంలో అడపాదడపా పనులు చేపట్టి బస్సులు సర్వీలు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్అండ్ బీ అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మేడిపల్లి మండలం నుంచి గోవిందారం వరకు చేపడుతున్న రెండు వరుసల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

అవార్డు పొందిన సురేందర్

నవతెలంగాణ-కోరుట్ల : లంబోదర కల్చరర్ అకాడమీ హైదరాబాద్‌లో గాంధీ జయంతి సందర్భంగా మహాత్మాగాంధీ ఎక్సలెన్స్ సర్వీస్ అవార్డును సామాజిక సేవకుడైన కట్కం సురేందర్‌కు సోమవారం అందజేశారు. మండలంలోని వల్లంపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సురేందర్ సామాజిక సేవలో చురుకుగా పని చేస్తునందున ఆయనకు ఈ అవార్డు అందజేశారు. కట్కం సురేందర్‌కు లయన్స్ క్లబ్ ఇంటర్నెషనల్ అడ్వైజర్ అడ్వకేట్ కట్కం రాజేంద్రప్రసాద్, అలయన్స్ క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.



ఆశావర్కర్ల సమస్యలను తీర్చాలి

నవతెలంగాణ-కోరుట్ల : ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కడకుంట్ల నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో 9 రోజులుగా సమ్మె చేస్తున్న ఆశాలకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. సమాన పనికి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, నాయకురాలు పద్మ, లక్ష్మి, జ్యోతి, ఎండి ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు కడకుంట్ల నాగరాజు

చేనేత ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంగాధర్



నవతెలంగాణ- కోరుట్ల : జిల్లా చేనేత ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శిగా మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన ద్యావనపెల్లి గంగాధర్‌ను నియ మించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబును విడుదల చేయాలి

నవతెలంగాణ -చొప్పదండి : టీడీపీ జాతీయ అధ్యక్షుడు ఏపీ మాజీ సీఎం చంద్రబాబును విడుదల చేయాలని టీడీపీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి జంగం అంజయ్య డిమాండ్ చేశారు. చొప్పదండి మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవునూరు దయాకర్‌రావు, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి దామోర సత్యం, కరీంనగర్ పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోలు మాల సదానందం, నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీని నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ-హుజూరాబాద్ : పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద మంగళవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెలమారెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లోని లాకీంపూర్, కేర్‌లో రైతులు శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కొడుకు ఆశిష్ కుమార్ మిశ్రా కారుతో తొక్కించి నలుగురు రైతులను, ఒక విలేకరిని పొట్టన పెట్టుకున్నాడని తెలిపారు. కానీ ఇప్పటి వరకు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు గుండేడి వాసుదేవ్, జిల్లా నాయకులు కదిరి రమేష్, కొంకటి చంద్రయ్య, లింగయ్య సుధాకర్ రమేషు చిరంజీవి, రవి , రాజు బాలకృష్ణ, మోర మహేష్, రవి, పల్లపు ప్రశాంత్ ,దాట్ల రత్నాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



పాల్గొన్న జిల్లా రైతు సంఘం నాయకులు

నా స్థలాన్ని ఆక్రమించి నాపైనే దాడులు



మాట్లాడుతున్న బోడికల సమ్మయ్య

నవతెలంగాణ-జమ్మికుంట : అన్యాయం జరిగిందని పోలీస్ స్టేషన్‌కు వెళ్తే పోలీసులు కూడా తనపైనే కేసులు బనాయించారని, న్యాయం కోసం లోకాయుక్తను ఆశ్రయించాల్సి వచ్చిందని జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఎల్ఐసి ఉద్యోగి బోడికల సమ్మయ్య అన్నారు. మంగళవారం కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలల క్రితం జంపయ్య అనే వ్యక్తి స్థానిక అయ్యప్ప టెంపుల్ వద్ద తన కారును ఆపి వాసాల రామస్వామి ప్రోత్బలంతో దాడి చేశాడని పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కానీ పోలీసులు తనపైనే కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య రాజేశ్వరి కడుతున్న భవనానికి కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికిని మిడిదొడ్డి సదానందం అనే వ్యక్తి, రామస్వామి అండతో కూల్చి వేశారని ఆయన ఆరోపించారు. సదరు వ్యక్తిపై శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో దళిత సంఘాలను ఏకం చేసి నిరాహార దీక్ష సైతం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినయ్, చక్రి, వంశీ, రాజయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశాలు, అంగన్‌వాడీలపై నిర్భందం

- మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా అక్రమ అరెస్టులు
- కొనసాగుతన్న అంగన్‌వాడీలు, ఆశావర్కర్ల నిరవధిక సమ్మె
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



కొడిమ్యాలలో ఆశా అంగన్‌వాడీలు అరెస్టు

కోరుట్లలో.. అరెస్టు

నవతెలంగాణ- జగిత్యాల : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలు, ఆశావర్కర్లపై నిర్బంధం విస్తోంది. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు 22 రోజులగా సమ్మె చేస్తుండగా, ఆశావర్కర్లు 8 రోజులుగా విధులు బహిష్కరించి జిల్లాలోని ఆయా మండల కేంద్రంల్లో సమ్మె కొనసాగిస్తున్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు ఆశావర్కర్లను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టులు చేశారు. వారిని జిల్లాలోని కొడిమ్యాల, మల్యాల, సారంగాపూర్, జగిత్యాల, బీర్పూర్ పోలీసు స్టేషన్లకు తరలించారు. అంగన్‌వాడీ ఉద్యోగులను ఎక్కడకక్కడ అరెస్టులు చేసి నిర్బంధించడాన్ని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. 22 రోజులుగా అలుపు లేకుండా తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ఆశావర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులను రెండు రోజుల ముందు నుండే జిల్లాలో ఉన్న పోలీసు యంత్రాంగం నిరంకుశంగా, టెంట్లు తీసివేయాలని మీరు ఇక్కడ కూర్చోవడానికి వీలు లేదని బెదిరింపులకు గురి చేశారు. తమ సమస్యలపై మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు కూడా అవకాశం కల్పించకపోవడంపై సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. వెంటనే అంగన్‌వాడీ ఉద్యోగులను బేషరత్‌గా విడుదల చేయాలని రాష్ట్ర తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఉపాధ్యక్షురాలు జి. జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు కే.రజిత, , సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన డిమాండ్ చేశారు.

రైతులకు ఇచ్చిన లిఖితపూర్వక హామీలు అమలు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వాసుదేవరెడ్డి

నవతెలంగాణ-జమ్మికుంట : నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ చారిత్రాత్మక పోరాట ఉద్యమ కారులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని స్థానిక గాంధీ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లకింపూర్ కెరిలో నలుగురు రైతులు ఒక విలేకరి మరణానికి కారణమైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు ఆశీష్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పైన పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, రైతాంగానికి ఇచ్చినటువంటి లిఖిత పూర్వక హామీలను అమ లు చేయాలన్నా రు. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ నడిబొడ్డున చేసిన చారిత్రా త్మక రైతు పోరాటం లో అమరులైన 700 మంది కిపైగా మరణించిన రైతు కుటుంబాలకు ఒక్కొ కు టుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటిం చాలన్నారు. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని, రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని,. విత్తన చట్టాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ రుణాలను మాఫీ చేసి, కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. 55 ఏండ్లు దాటిన ప్రతి రైతుకు నెలకు రూ.5వేల పెన్షన్ వెంటనే ప్రకటించాలని, రాబోయే ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శీలం అశోక్, జిల్లా కోశాధికారి కోశాధికారి బాసిర సంపత్‌రావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, నాయకులు దండిగారి సతీష్, శ్రీకాంత్, కన్నం సదానంద0, కిషోర్, రాజ కుమారి, లింగారెడ్డి, సురేష్ సమ్మయ్య, రాజ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.1800 కోట్ల అభివృద్ధి ఎక్కడ చేశారో చూపాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం డిమాండ్



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం

నవతెలంగాణ-గంగాధర : చొప్పదండి నియోజకవర్గంలో రూ.1800 కోట్లతో ఎక్కడ అభివృద్ధి చేశారో చూపాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. గంగాధర మండల కేంద్రంలో దాదాపు 500 మంది గ్రామస్తులు కాంగ్రెస్ నాయకుడు పడాల రాజన్న ఆధ్వర్యంలో మేడిపల్లి సత్యం సమక్షంలో పార్టీలో చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. అబద్ధపు ప్రచారం చేస్తూ నియోజకవర్గ ప్రజలను స్థానిక ఎమ్మెల్యే మోసం చేస్తున్నారని ఆరోపించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ పరాజయం చెందిన చొప్పదండి నియోజకవర్గంలోనే ఉంటూ ఇక్కడి సమస్యలపై పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. సుంకె ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత స్వంతంగా అభివృద్ధి చెందాడు తప్ప నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400లకే సిలిండర్ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 500లకే సిలిండర్ ఇస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆర గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మండల నాయకులు పడాల రాజన్న, కాడరి మల్లేశం, బుర్గు గంగన్న పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు ఇస్తాం

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే



క్రికెట్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-తిమ్మాపూర్ : అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిపిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని మానకొండూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్ డాక్టర్ రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి ఫంక్షన్ హాల్‌లో గృహలక్ష్మి ప్రొసిడింగ్ పత్రాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులందరికీ దఫాల వారిగా సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. రానివారు బాధపడవద్దని, తప్పకుండా మరో విడతలో ఇస్తామని హామీ ఇచ్చారు. తాగునీరు, సాగునీటితో పాటు రైతుబంధు, రైతుబీమా, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్లు, గృహలక్ష్మి ద్వారా అర్హులందరికీ లబ్ది జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పవన్‌కుమార్, ఎంపీపీ కేతిరెడ్డి వనితా దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంపీవో కిరణ్, ఆయా గ్రామాల సర్పంచులు ఇనుకొండ జితేందర్ రెడ్డి, బోయిని కొంరయ్య, రావుల రమేష్, వెంకటేశ్వర్ రావు, మేడి అంజయ్య, శోభ, పద్మ త్రివేణి, కొంరయ్య, ఉమా రాణి, జక్కని శ్రీవాణి రవీందర్, పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-తిమ్మాపూర్ : కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఇందిరానగర్ గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పారునంది జలపతి, జిల్లా ఉపాధ్యక్షులు వంతడుపుల సంపత్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనువాద ముసుగు వేసుకున్న దుండగులు చేసినటువంటి ఇలాంటి చర్యల వలన బహుజనవాదం మరింత బలపడుతున్నారు. మహనీయుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాటిక వినోద,అంబేద్కర్ యువజన సంఘం నాయకులు నగునూరు బాబన్న, మండల ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్,బోయిని తిరుపతి,సంగుపట్ల మల్లేశం, కవ్వంపల్లి అంజి, గంగిపల్లి సంపత్,రొడ్డ రమేష్, నందకిషోర్,దామ కుమార్,దొంత శంకర్, తుర్పటి అజయ్,కిన్నెర అంజి,కళ్లెం బాలస్వామి,అసంపల్లి అశోక్, ఎల్కపెళ్ళి లక్ష్మణ్, గోదారి సంతోష్,కండె అజయ్,అల్వాల ఆంజనే యులు,ప్రశాంత్, మనోజ్, విక్కీ,శ్రీనివాస్,కోమురయ్య పాల్గొన్నారు.

రెండు షాపుల్లో చోరీకి యత్నం

నవతెలంగాణ-జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలోని ఖాదీ కాంప్లెక్స్‌లో ఉన్న రెండు షాపుల్లో మంగళవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న పట్టణ సీఐ బర్పాటి రమేష్ తన పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని షాపులో యజమానులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర మొబైల్ షాప్ షెటర్ తాళాలను రాడుతో పగలగొట్టి లోపలికి వెళ్లి టేబుల్ కౌంటర్లు పగలగొట్టి చూడగా అందులో డబ్బులు లేక పోవడంతో ఆ ప్రక్కనే ఉన్న శ్రీకృష్ణ కిరాణం షాపు షట్టర్ తాళాలను పగలగొట్టారు. లోపలికి ప్రవేశించి డబ్బులు లేకపోవడంతో వెళ్లిపోయ్యారని, షాపులో ఎలాంటి వస్తువులు దొంగలించలేదని తెలిపారు. సీసీ కెమెరాల సాయంతో దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు. జమ్మికుంట పట్టణంలో మెయిన్ రోడ్డు లోనే ఉన్న యూనియన్ బ్యాంకు ఏటీఎంలో ఐదు రోజుల క్రితం ఏటీఎం పగలగొట్టారు. గత నెల క్రితం కొత్తపెల్లిలోని బ్రాండ్ షాప్ లో దొంగలు పడ్డారు. ఇలా జమ్మికుంటలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట పోలీస్ గస్తీ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



చోరీకి ప్రయత్నించినషాపు లు

ఉపాధ్యాయుల నిరసన



ప్రభుత్వం తక్కువ ఐ ఆర్ ప్రకటించారని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన

నవతెలంగాణ :చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో 5శాతం ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మడుగుల రాములు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన మూడు పెండింగ్ డీఏలు, 11 శాతం వెంటనే ఇవ్వాలని, ప్రతి నెల జీతం ఒకటో తేదీన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనగాం శ్రీనివాస్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు యామ తిరుపతి, నేల వేణి రామస్వామి, ఉపాధ్యాయులు మహేష్, లక్ష్మి, శ్రీధర్, పల్లవి, క్రాంతి, సూర్య ప్రకాష్, జయలక్ష్మి, పుష్పలత, సరిత, గోపి, రేణుక, సరిత పాల్గొన్నారు.

జమ్మికుంట

ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు, రావలసిన 3 డీఏలు దాదాపు 10 శాతం ఉందని, ఐఆర్ 5 శాతమే మాత్రమే ప్రకటించి, ఉద్యోగులను, పెన్షన్లను తీవ్ర నిరాశకు గురి చేయడం జరిగిందని, 15 శాతం ఐఆర్ పెంచాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ బూసి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మాచన పెల్లి గ్రామ పాఠశాలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీల ధరించి నిరసన తెలిపారు.

హక్కుల సంఘాలపై ఎన్ఐఏ దాడులను ఖండిస్తున్నాం

మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శనిగరపు తిరుపతయ్య



నవతెలంగాణ-జమ్మికుంట : రెండు రాష్ట్రాల్లో హక్కుల సంఘాలపై ఎన్ఐఏ చేసిన దాడులను ఖండిస్తున్నామని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శనిగరపు తిరుపతయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో ఈనెల 2న ఉదయం 6గంటల నుంచి కేంద్ర నిఘా సంస్థ, ఎన్ఐఏ, రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా పౌర, మానవ హక్కుల సంఘాలు, మహిళ సంఘాలు, ప్రజాసంఘాల సభ్యుల ఇండ్లపై దాడి చేసి, వారి మొబైల్స్, కంప్యూటర్లు, పుస్తకాలు, సీసీకేమరాల ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకొని ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. ఈ దాడులు ఉదయం 6 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు కొన సాగినట్టు తమకు సమాచారం ఉందని తెలిపారు. మానవ హక్కుల వేదిక బాధ్యులపై దాడి చేయడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. అధికారంలో ఉన్న పార్టీలే కాక అన్ని ప్రతిపక్ష పార్టీలు ఈ దాడులను ఖండించాలని ఆయన కోరారు.

మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గండి రంజిత్‌కుమార్ గౌడ్



నవతెలంగాణ-జమ్మికుంట : సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గండి రంజిత్ కుమార్ గౌడ్‌ను ఆ సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామి గౌడ్ నియమించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్తుల డిమాండ్ల కోసం ,గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని తెలిపారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సభను విజయవంతం చేయాలి

తనుగుల ఎంపీటీసీ వాసాల నిరోషా రామస్వామి

నవతెలంగాణ-జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్‌లో నేడు మధ్యాహ్నం 12 గంటలకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని, ఆ సభను విజయవంతం చేయాలని తనుగుల ఎంపీటీసీ వాసాల నిరోషా రామస్వామి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజురాబాద్ నియోజకవర్గంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ సభ జరగనుందని, సామాజిక ప్రగతిశీల వాదులందరు, యువతీ, యువకులు, బహుజన వాదులు, ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలందరూ పెద్ద సంఖ్య లో హాజరుకావాలని ఆయన కోరారు.

వర్షకొండలో వైద్య శిబిరం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం వైద్యాధికారి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ పొనకంటి వెంకటి, గ్రామ కార్యదర్శి రాకేష్ హాజరయ్యారు అనంతరం వైద్యాధికారి డాక్టర్ అందే ఉదయ్ కుమార్ ఘనంగా సన్మానించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

మృతుడి కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-తిమ్మాపూర్ : మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బీనపెల్లి సంపత్ అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడి అంజయ్య, ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, నాయకులు బూడిద వేణు కుమార్, నార్ల అశోక్ పాల్గొన్నారు.

మోడీ, కేసీఆర్ ఫెవికాల్ బంధం

- ప్రధాని నోట...చీకటి మిత్రుడి మాట
- కాంగ్రెస్ చెప్పినట్టే...ముసుగు తొలిగింది : టీపీసీసీ చీఫ్ రేవంత్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఉన్నది ఫెవికాల్ బంధమేనంటూ కాంగ్రెస్ అనుమానాన్ని ప్రధాని నరేంద్ర మోడీ నిజామాబాద్ సాక్షిగా మరోసారి రుజువు చేశారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ రెండు పార్టీల నేతలు చీకటి మిత్రులేననీ, ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ పడుతున్నారని ఒక ప్రకటనలో రేవంత్ పేర్కొన్నారు. తాము మొదటి నుంచి చెబుతున్నదే నిజమని మోడీ మాటల ద్వారా స్పష్టంగా తేలిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఎన్డీయేలో చేరాలనుకున్నది నిజమేననీ, మోడీ ఆశీస్సులతో కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలనుకున్నది నిజమేనని వివరించారు. ఇప్పటికీ మోడీ, కేసీఆర్ చీకటి మిత్రులేని ఆరోపించారు. నిజం నిప్పులాంటిదనీ, అది ఎప్పటికైనా నిగ్గుతేలక మానదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. గడిచిన తొమ్మిదేండ్లలో మోడీ తీసుకున్న ప్రతి నిర్ణయంలో కేసీఆర్ మద్దతు ఉందని పేర్కొన్నారు. వాటికి పార్లమెంట్ రికార్డులే సాక్ష్యమని గుర్తు చేశారు. కేసీఆర్ ఢిల్లీ వెళ్లి చీకట్లో మోడీతో ఏమేం లాలూచీ పడ్డాడో మోడీనే చెప్పిన తర్వాత ఇక వారిద్దరి బంధం, అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని వెల్లడించారు. తెలంగాణ సమాజం జాగురుకతతో ఉండి, ఆ రెండు పార్టీల చీకటి సంబంధాన్ని గుర్తెరిగి వచ్చే ఎన్నికల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

నాందేడ్ ఆస్పత్రిలో మరణ మృదంగం

- మూడు రోజుల్లో 31 మంది రోగుల మృతి
- వారిలో 16 మంది చిన్నారులే



నాందేడ్ : మహారాష్ట్రలోని నాందేడ్‌లో గత నెల 30వ తేదీ నుండి మూడు రోజుల వ్యవధిలో 31 మంది రోగులు చనిపోయారు. వీరిలో 16 మంది చిన్నారులే. మందుల కొరత, సకాలంలో వైద్య సాయం అందకపోవడమే దీనికి కారణంగా భావిస్తున్నారు. గత నెల 30 నుండి ఈ నెల 1వ తేదీ వరకూ 12 మంది పెద్దలు, 12 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోగా సోమవారం రాత్రి ముగ్గురు పెద్దలు, నలుగురు చిన్నారులు చనిపోయారు. రోజుకు సగటున 10 నుండి 14 మంది పిల్లలు చనిపోయారని ఆస్పత్రి రికార్డులను బట్టి తెలుస్తోంది. చనిపోయిన పెద్ద వారిలో గుండె జబ్బులతో బాధపడుతున్న వారు, కిడ్నీ వ్యాధిగ్రస్థులు ఉన్నారని శంకర్‌రావ్ చౌహాన్ ప్రభుత్వ ఆస్పత్రి డీన్ ఎస్‌ఆర్. వాకోడ్ తెలిపారు. చనిపోయిన వారిలో ఎనిమిది మంది 70-80 సంవత్సరాల మధ్యవయస్కులని చెప్పారు. కన్నుమూసిన చిన్నారులలో నలుగురు నెలలు నిండక ముందే జన్మించారని వివరించారు.

నాందేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి సమీప జిల్లాల నుండే కాకుండా తెలంగాణ నుండి కూడా రోగులు వస్తుంటారు. ఇటీవల కొందరు సిబ్బందిని వేరే ఆస్పత్రులకు బదిలీ చేశారని, దీంతో సిబ్బంది కొరత ఏర్పడిందని, రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించడం కష్టమైందని ఆస్పత్రి డీన్ తెలిపారు. దీనికితోడు ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేసే సంస్థ వాటిని నిలిపివేసిందని చెప్పారు. స్థానికంగా మందులు కొనుగోలు చేసినప్పటికీ అవి సరిపోలేదని అన్నారు. కాగా ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. దీనిపై ఓ కమిటీని ఏర్పాటు చేశామని రాష్ట్ర వైద్య విద్యా శాఖ మంత్రి హసన్ ముష్రిఫ్ తెలిపారు.

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాందేడ్ అశోక్ చవాన్ ఆస్పత్రిని సందర్శించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని చెప్పారు. ఆస్పత్రిలో కేవలం 500 పడకలు మాత్రమే ఉన్నాయని, కానీ ప్రస్తుతం 1,200 మంది రోగులను చేర్చుకున్నారని తెలిపారు. చనిపోయిన రోగుల కుటుంబాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంతాపం తెలిపారు. బీజేపీకి పేదల ఆరోగ్యం గురించి పట్టింపే లేదని మండిపడ్డారు. రాష్ట్ర ఆరోగ్య మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే డిమాండ్ చేశారు. నాందేడ్ ఆస్పత్రిలో మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె అన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు, అమ్మకం ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, కూలదోయడంతోనే వారు బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలోని ఖల్వాలో థానే మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ స్మారక ఆస్పత్రిలో ఆగస్ట్ 18న 24 గంటల వ్యవధిలోనే 18 మంది రోగులు మరణించిన విషయం తెలిసిందే.

కనీస వేతనాలను సవరించండి

- వెంటనే జీవోలు జారీ చేయండి
- లేబర్ కమిషనర్ నదీమ్‌కు కార్మిక సంఘాల వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 73 షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్స్‌లో వేతనాలు సవరించాలనీ, వెంటనే జీవోలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని అంజయ్య భవన్‌లో కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్‌కు వారు వినతిపత్రాన్ని ఉమ్మడిగా అందజేశారు. కార్యక్రమంలో జె.మల్లిఖార్జున్(సీఐటీయూ), బాలరాజు (ఏఐటీయూసీ), విజయకుమార్(ఐఎన్‌టీయూసీ), సూర్యం (ఐఎఫ్‌టీయూసీ), ఎమ్‌కే బోస్(టీఎన్‌టీయూసీ), తదితరులు పాల్గొన్నారు. కనీస వేతనాలను చట్ట ప్రకారం ప్రతి ఐదేండ్లకోసారి సవరించాలని గుర్తుచేశారు. కార్మిక శాఖ అలా చేయకపోవడం వల్ల రాష్ట్రంలో కోటి మందికిపైగా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్న విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కాలంలో నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి అద్దెలు, ఇతర ఖర్చులు విపరీతంగా పెరిగాయనీ, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వేతనాలను ప్రభుత్వం నిర్ణయించకపోవడం వల్ల పరిశ్రమల యజమానులు విపరీతంగా లభాలు పొందుతున్నారన్నారు. 2021 జూన్‌లో ఐదు రంగాలకు సంబంధించి జీవో నెంబర్ 21,23,24,25 ఫైనల్ నోటిఫికేషన్స్ ఇచ్చారనీ, వాటిలో అన్‌స్కిల్డ్ కార్మికులకు మినిమం బేసిక్‌గా రూ.18,019, వీడీఏ రేటు రూ.12గా నిర్ణయించారని చెప్పారు. ఆపై సెమీస్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ వర్కర్లకు వేతనాలు పెంచుతూ నిర్ణయం జరిగిందన్నారు. స్టేక్ హోల్డర్స్ మీటింగ్‌లో ఐదు జీవోలనూ గెజిట్ చేయాలని కార్మిక సంఘాలు ముక్త కంఠంతో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా కనీసవేతనాలను సవరించాలని కోరారు.

5 లక్షల అభ్యర్థులకు...5 వేల పోస్టులా?

13 వేలతో మెగా డీఎస్సీని ప్రకటించాలి

- ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లోనే జరపాలి
- రాతపరీక్షలను 4 నెలలు వాయిదా వేయాలి
- కోదండరామ్, ఆర్ఎస్ ప్రవీణ్, ఆర్ కృష్ణయ్య డిమాండ్
- ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయ అభ్యర్థుల బహిరంగసభ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఐదు లక్షల మందికిపైగా ఉపాధ్యాయ అభ్యర్థులుంటే, కేవలం 5,089 పోస్టుల భర్తీకే డీఎస్సీ నోటిఫికేషన్ వేయడం సమంజసం కాదని టీజేఎస్ అధినేత కోదండరామ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి రియాజ్ అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినట్టుగా 13,086 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద డీఎస్సీ అభ్యర్థుల బహిరంగ సభను నిర్వహించారు. 'వియ్ వాంట్ మెగా డీఎస్సీ, సీఎం ప్రకటించిన 13 వేల పోస్టులను భర్తీ చేయాలి' అని పెద్దఎత్తున నినాదాలు చేశారు. 'సమయమేమో గోరంత, సిలబస్‌ఏమో కొండంత, మాకు మినీ డీఎస్సీ వద్దు, మెగా డీఎస్సీ కావాలి, వైన్స్ దుకాణాల సంఖ్య పెంచారు, ఉపాధ్యాయ ఖాళీలను పెంచలేరా?, ఆరేండ్లు ఆగినం, ఆర్నెల్లు ఆగలేమా?, నవంబర్‌లోనే గ్రూప్-2, ఫిజికల్ డైరెక్టర్ పరీక్షలున్నందున డీఎస్సీని వాయిదా వేయాలి'అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కోదండరామ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆర్ కృష్ణయ్య, రియాజ్ మాట్లాడుతూ డీఎస్సీని ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాతపరీక్షల నిర్వహణకు నాలుగు నెలల సమయం కేటాయించాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టులను పెంచి కొత్త నోటిఫికేషన్ విడుదల చేసే వరకు నిరుద్యోగుల తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీఎం చెప్పిన లెక్కల ప్రకారం 13,086 పోస్టులతోపాటు ఇటీవల ఉపాధ్యాయుల పదోన్నతులతో ఏర్పడిన 9,979 పోస్టులనూ కలిపి '23065' ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 16 వేల విద్యా వాలంటీర్లను రెండేండ్ల కింద నియమించారని గుర్తు చేశారు. ఖాళీల్లేకుంటే వారిని ఎలా నియమించారని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల్లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకుల పిల్లలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతుంటే, పేద పిల్లలు ఉపాధ్యాయుల్లేని బడుల్లో చదవాలా?అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉపాధి కల్పన, యువజన విధానం లేదని విమర్శించారు. పిల్లలకు చదువు లేకుండా తెలంగాణ అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మూసేసిన నాలుగు వేల స్కూళ్లను తెరవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారని చెప్పారు. రైతు ఆత్మహత్యలకు ఫీజుల భారం ఒక కారణమన్నారు. ఉపాధ్యాయ పోస్టుల పెంపు నిరుద్యోగుల కోసం కాదనీ, సమాజం కోసమని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కావాలి, పేద పిల్లలకు చదువు కావాలని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కావాలంటే సీఎం ఉద్యోగం ఊడగొట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 14న నిరుద్యోగుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకో చేపడతామన్నారు. రాష్ట్రంలో ఎనిమిది వేల బడుల్లో ఒక్క టీచర్‌తో పనిచేస్తున్నాయని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు ఒక్క పాఠశాలనూ, విశ్వవిద్యాలయాన్ని సందర్శించలేదని విమర్శించారు. రాష్ట్రంలో, గజ్వేల్, సిరిసిల్ల, మహేశ్వరం నియోజకవర్గాల్లోని సర్కారు బడుల్లో ఎన్ని కంప్యూటర్లున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం విద్యను ఇవ్వమంటే మద్యం, గంజాయి ఇస్తున్నదని అన్నారు. నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నందగోపాల్, శివ కృష్ణ, శశిధర్, హరీశ్, స్వప్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి నివాసంలోనూ సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. ఆయన కుమారుడు న్యూస్ క్లిక్‌లో పని చేస్తున్నారు. పోలీసులు ప్రశ్నించడానికి వచ్చారు. కానీ వారు ఏమీ ప్రశ్నించలేదు. కేవలం ల్యాప్‌టాప్, సెల్ ఫోన్ మాత్రమే చూశారు. వాటిని తీసుకున్నారు. అసలు ఏ కేసులో, ఏం దర్యాప్తు చేస్తున్నారో ఎవరికీ తెలియదు. ఇది మీడియాపై దాడికి ప్రయత్నమే. మీడియా దీన్ని ఎదుర్కొంటుంది. ఢిల్లీ పోలీసులు ఏం విచారిస్తున్నారో ఎవరికీ తెలియదు. ఒకవేళ ఇది మీడియా నోరును నొక్కేందుకు జరుగుతున్న ప్రయత్నమైతే.. దీని వెనుక కారణం ఏమిటో దేశానికి తెలియాలి" అని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు.

జర్నలిస్టులను బెదిరిస్తున్నారు్ణ డి.రాజా

"మీడియాపై బీజేపీ అణిచివేత వల్ల ఇప్పటికే పత్రికా స్వేచ్ఛలో అట్టడుగున ఉన్న 20 దేశాల్లో భారత్ చేరింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యక్ష నియంత్రణలో ఉన్న ఢిల్లీ పోలీసులు జర్నలిస్టుల నివాసాలపై దాడి చేసి ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ జర్నలిస్టులు మణిపూర్ సంక్షోభం, అదానీ అంశాన్ని, సమాజానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని బాధ్యతాయుతంగా ఉంచినందుకు వారిని బెదిరించి శిక్షిస్తున్నారు. ఈ చర్య అని డి.రాజా అన్నారు.

ఆందోళనకరం

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన మరో ప్రయత్నమని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఎడిటర్స్ గిల్డ్ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ప్రత్యేక నేరాలకు సంబంధించి జరిపే దర్యాప్తు క్రూరమైన చట్టాల నీడలో భయభ్రాంతులకు గురిచేసే వాతావరణాన్ని కల్పించకూడదు. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేదిగా, విమర్శకుల గొంతు నొక్కేదిగా ఉండకూడదు' అని ఆ ప్రకటన తెలిపింది. దాడులపై తాను తీవ్ర ఆందోళన చెందుతున్నానని ప్రెస్ క్లబ్ వ్యాఖ్యా నించింది. పాత్రికేయులకు సంఘీభావం తెలిపింది. కేసుకు సంబంధించిన వివరాలు బయటపెట్టాలని ప్రభుత్వాన్ని కోరింది.

డిజిటల్ వార్తలు అందించే 11 సంస్థలకు చెందిన డిజిపబ్ న్యూస్ ఇండియా ఫౌండేషన్, ముంబయి ప్రెస్ క్లబ్ కూడా దాడులను ఖండించాయి. ఇది ప్రభుత్వ ఏకపక్ష వైఖరికి, భయపెట్టే చర్యకు మరో నిదర్శనమని, ఈ పరిణామాలను తాము నిశితంగా గమనిస్తున్నామని సామాజిక మాధ్యమాలలో డిజిపబ్ పోస్ట్ చేసింది. నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ముంబయి ప్రెస్ క్లబ్ కోరింది. ఇది పత్రికా స్వేచ్ఛను అణచివేయడమేనని మీడియా నిపుణుల ఫౌండేషన్ విమర్శించింది.

రైతులు, కార్మికుల సమస్యలను వెలుగులోకి తెస్తున్నందునే న్యూస్‌క్లిక్‌ను ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకున్నదని పాత్రికేయుల జాతీయ కూటమి, ఢిల్లీ పాత్రికేయుల సంఘం, కేరళ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఢిల్లీ శాఖ) ఓ ప్రకటనలో ఆరోపించాయి.

గొంతు నొక్కుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ప్రజాస్వామిక దేశంలో మీడియాపై జరిగిన తాజా దాడిగా అభివర్ణించింది. ఈ మేరకు ఇండియా కూటమి ఓ ప్రకటన విడుదల చేసింది. 'పాత్రికేయులు దేశంలో విద్వేషాలను రేపి, ప్రజలను విభజిస్తున్నారని ఆరోపిస్తూ వారిపై బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వాస్తవానికి దేశం ఇప్పుడు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. వాటి నుండి, తన వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికే ప్రభుత్వం ఇలాంటి ఎత్తుగడలు వేస్తోంది. ప్రభుత్వం వెంటనే ఇటువంటి చర్యలకు స్వస్తి చెప్పి దేశానికి, ప్రజలకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించాలి' అని ఆ ప్రకటనలో ఇండియా కూటమి సూచించింది. బీబీసీ, న్యూస్‌లాండ్రీ, దైనిక్ భాస్కర్, భారత్ సమాచార్, ది కాశ్మీర్ వాలా, ది వైర్ వంటి మీడియా సంస్థలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోందని ఆరోపించింది. పెట్టుబడిదారులతో మీడియా సంస్థలను కొనిపించి వాటిని తన పక్షపాతపూరితమైన, సైద్ధాంతిక ప్రయోజనాల ప్రచారానికి బీజేపీ ఉపయోగించుకుంటోందని తెలిపింది. 'వాస్తవాలు మాట్లాడే స్వతంత్ర పాత్రియులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రభుత్వం, దాని సిద్ధాంతాలకు అనుబంధంగా ఉండే సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. పైగా సమాచార సాంకేతిక నిబంధనల వంటి తిరోగమన విధానాలను అవలంబిస్తూ మీడియా సంస్థలకు కళ్లెం వేయాలని చూస్తున్నాయి. తద్వారా ప్రజలకు తన తప్పిదాలు తెలియకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతోంది. మన దేశం పరిణితి చెందిన ప్రజాస్వామిక దేశమన్న అభిప్రాయం ప్రపంచ దేశాలలో నెలకొని ఉంది. దానిని బీజేపీ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోంది' అని ఇండియా కూటమి మండిపడింది. భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేస్తున్న మీడియాకు సంఘీభావం తెలిపింది. కాంగ్రెస్ ప్రతినిధి పవర్ ఖేరా, ఆ పార్టీ ఎంపీ శశి థరూర్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తదితరులు కూడా ఈ దాడులను నిరసించారు.

పత్రికా స్వేచ్ఛపై పంజా..

(మొదటిపేజీ తరువాయి)

నివాసాలపై కూడా పోలీసులు దాడి చేసి వారి నివాసాల నుండి కంప్యూటర్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. రైతుల నిరసనల పైన, కోవిడ్ పైన గతంలో ఏవైనా వార్తలు రాశారా అంటూ ఆరా తీశారు. పాత్రికేయుడు భాషా సింగ్ నివాసంలో రెండు గంటలకు పైగా సోదాలు జరిగాయి. ఢిల్లీ సైన్స్ ఫోరంకు చెందిన శాస్త్రవేత్త, రచయిత డి.రఘునందన్‌ను కూడా పోలీసులు నిర్బంధించి తీసికెళ్లారు. పోలీసులు తమ లాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, టెలిఫోన్లు స్వాధీనం చేసుకొని తీసికెళ్లారని పలువురు ఉద్యోగులు తెలిపారు.

న్యూస్‌క్లిక్ పోర్టల్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న, గతంలో పనిచేసిన పాత్రికేయులు, విలేకరులు, ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిపారు. వీరిలో హిందూ దినపత్రిక మాజీ పాత్రికేయులు, న్యూస్‌క్లిక్ కంట్రిబ్యూటర్ అనురాధా రామన్, సత్యా తివారీ, అదితి నిగమ్, సుమేధా పాల్ ఉన్నారని సమాచారం. తివారీని అరెస్ట్ చేశారని తెలిసింది. సామాజిక ఉద్యమకారిణి తీస్తా సెతల్వాద్, ప్రముఖ పాత్రికేయుడు పరంజయ్ గుహ ఠాకూర్తా నివాసాలపై కూడా దాడులు జరిగాయి. ముంబయిలో నివసిస్తున్న తీస్తాను ఢిల్లీ పోలీసు అధికారులు ప్రశ్నించారు. తీస్తా డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న సామాజిక పరిశోధనా సంస్థ 'త్రికాంటినెంటల్ న్యూస్‌క్లిక్ పోర్టల్‌కు వ్యాసాలు అందిస్తోంది.

టైమ్స్ ఆఫ్ ఇండియాలో గతంలో పనిచేసి ప్రస్తుతం న్యూస్‌క్లిక్‌తో అనుబంధం కొనసాగిస్తున్న పాత్రికేయుడు సుబోధ్ వర్మ ఇంటిపై కూడా దాడి జరిగింది. దాడులు చేసిన తర్వాత ఊర్మిలేష్, పరంజయ్ గుహ ఠాకూర్తా, అభిసార్ శర్మ, ప్రబీర్ పుర్కాయస్థ, సత్యం తివారీలను ప్రశ్నించే నిమిత్తం ఢిల్లీ పోలీసు కార్యాలయానికి తరలించారు. అక్కడికి న్యాయవాదులను అనుమతించలేదు. ఉదయం నుండి తన క్లయింటును కలవనీయడం లేదని ఊర్మిలేష్ న్యాయవాది గౌరవ్ యాదవ్ చెప్పారు.

పలు సెక్షన్ల కింద కేసులు

న్యూస్‌క్లిక్ ఉద్యోగులను చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టానికి (ఉపా) సంబంధించిన కేసులో పోలీసులు విచారించారు. ఈ సంవత్సరం ఆగస్ట్ 17న నమోదైన ఎఫ్ఐఆర్ (224/2023)కు సంబంధించి ఈ దాడులు జరిగాయని తెలుస్తోంది. అత్యంత క్రూరమైన ఉపా చట్టంలోని 13, 16, 17, 18, 22 సెక్షన్ల కింద ఈ ఎఫ్ఐఆర్ దాఖలైంది. మతం, జాతి, జన్మస్థలం, నివాసం, భాష తదితర కారణాలతో సమాజంలోని వివిధ వర్గాల మధ్య ద్వేషభావం రేకెత్తించారంటూ ఐపీసీలోని 153(ఏ) సెక్షన్‌ను, నేరపూరిత కుట్రలో భాగస్వాములయ్యారంటూ ఐపీసీలోని 120 (బీ)ని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

వారి పని వారు చేస్తున్నారు : అనురాగ్ ఠాకూర్ సమర్థన

దాడులపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను పాత్రికేయులు ప్రశ్నించగా 'విచారణ సంస్థలు స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. నిబంధనల ప్రకారం వారి పని వారు చేస్తున్నారు. దాడులను సమర్థించాల్సిన అవసరం నాకు లేదు. ఎవరైనా తప్పు చేస్తే విచారణ సంస్థలు తమ పని తాము చేస్తాయి. తప్పుడు వనరుల నుండి మీకు డబ్బు వచ్చినా, అభ్యంతరకరమైనది ఏదైనా జరిగినా విచారణ సంస్థలు చర్య తీసుకోకూడదని ఎక్కడా రాసిలేదు' అని బదులిచ్చారు.

చైనా నిధుల ఆరోపణలతో...

న్యూస్‌క్లిక్ ఉద్యోగులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ మూలాలు ఆగస్ట్‌లో న్యూయార్క్ టైమ్స్ పత్రికలో వచ్చిన నివేదికలో ఉన్నాయి. అమెరికాకు చెందిన ఓ కోటీశ్వరుడు చైనా ప్రభుత్వంతో సన్నిహితంగా పనిచేస్తూ ప్రపంచవ్యాప్తంగా చైనా ప్రచారానికి నిధులు సమకూరుస్తున్నారని ఆ నివేదిక ఆరోపించింది. ఈ నివేదికనే లోక్‌సభలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ప్రస్తావిస్తూ భారత్ వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలు, న్యూస్‌క్లిక్ పోర్టల్ చైనా నుండి నిధులు పొందాయని ఆరోపించారు.

ఢిల్లీలో భూ ప్రకంపనలు..

- పరుగులు తీసిన ప్రజలు
- నేపాల్ కేంద్రంగా భూకంపం

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం భూమి కంపించింది. పొరుగున ఉన్న నేపాల్ కేంద్రంగా గంట వ్యవధిలో వరుసగా నాలుగు భూకంపాలు సంభవించాయి. దీంతో మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఢిల్లీ - ఎన్‌సీఆర్ పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు భూమి బలంగా కంపించింది. ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్లు, ఆఫీసుల నుంచి బయటకు పరుగులు తీశారు. ఉత్తర భారతదేశంలోని పలు చోట్ల ఈ ప్రకంపనలు సంభవించాయి. ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూ, హాపుర్, అమ్రోహా, ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో భూమి కంపించింది.

నేపాల్‌లో ఈ మధ్యాహ్నం 2.25 ప్రాంతంలో తొలిసారి భూకంపం సంభవించినట్టు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ గుర్తించింది. తొలుత అది 4.6 తీవ్రతతో రికార్డయ్యింది. పది కిలోమీటర్ల లోతులో అది కేంద్రీకతమై ఉన్నట్టు ఎన్‌సీఎస్ పేర్కొంది. ఇది గుర్తించిన అరగంటలోపే.. మధ్యాహ్నం 2.51 గంటలకు అంతకంటే ఎక్కువగా 6.2 తీవ్రతతో మరోసారి భూకంపం సంభవించింది. ఇది భూమికి ఐదు కిలోమీటర్ల లోతులో కేంద్రీకతమై ఉన్నట్టు ఎన్‌సీఎస్ గుర్తించింది. ఆ తర్వాత మధ్యాహ్నం 3.06, 3.19 గంటలకు మరో రెండుసార్లు స్వల్ప తీవ్రతతో భూమి కంపించినట్టు ఎన్‌సీఎస్ తెలిపింది. రెండోసారి చోటుచేసుకున్న భూకంపం తర్వాత ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి.

దేశవ్యాప్తంగా బ్లాక్ డే

- లఖింపూర్ ఖేరీ హంతకులకు మోడీ రక్షణ : రైతులు



న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్‌ఖేరీలో రైతుల ఊచకోత జరిగి రెండేండ్లు పూర్తయిన నేపథ్యంలో మంగళవారం దేశవ్యాప్తంగా రైతులు బ్లాక్ డేగా పాటించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), సీఐటీయూ సహ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో వేలాది మంది ప్రజలు భాగస్వామ్యమయ్యారు. మారణకాండకు సూత్రధారి అయిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని ప్రధాని నరేంద్ర మోడీ కాపాడుతున్నారని రైతు నాయకులు పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లో మిశ్రా పేరు ఉన్నప్పటికీ, ఆయనపై ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదని, ఆయనను మంత్రివర్గం నుండి తొలగించలేదని విమర్శించారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రధాని సిద్ధంగా లేరని, దోషులందరినీ శిక్షించే వరకు సమ్మెను కొనసాగిస్తామని సమావేశంలో రైతులు ప్రతిజ్ఞ చేశారు. అజయ్ మిశ్రాను మంత్రివర్గం నుంచి బహిష్కరించి జైలుకు పంపాలన్నది రైతుల ప్రధాన డిమాండ్ కిసాన్ మోర్చా నాయకులు తాజిందర్ సింగ్ విర్క్, పి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రుల్దు సింగ్ మాన్సా, రమీందర్ సింగ్ పాటియాలా, మంజిత్ సింగ్ రాయ్, గుర్మీత్ సింగ్ మంగత్, హర్నెక్ సింగ్ మెహమా, జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, రైతు, కార్మిక వ్యతిరేక పాలనపై సంఘటిత పోరాటానికి రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌తో పాటు అస్సాం, బీహార్, ఉత్తరాఖండ్, పంజాబ్, జార్ఖండ్, హర్యానా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాల జిల్లా కేంద్రాలు, తాలూకా కేంద్రాల్లో రైతులు, కార్మికులు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. బహిరంగ సభలు, ప్రదర్శనలు, దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో జరిగిన ఆందోళనలో ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదంతో పోరాటం - సిరియా అనుభవం


నెల్లూరు నరసింహారావు

గతవారం సిరియా అధ్యక్షుడు చైనాలో పర్యటించాడు. 2004 తరువాత ఆయన మొదటిసారి చైనాను సందర్శించాడు. ఆయన చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌తో జరిపిన చర్చలు రెండు దేశాల మధ్య "వ్యూహాత్మక భాగస్వామ్యం" ఏర్పాటుకు దారితీశాయి. 12సంవత్సరాల అంతర్యుద్ధం తరువాత సిరియా దౌత్యపరంగా వేరుపడిన స్థితి నుంచి అంతర్జాతీయ రాజకీయాలలోకి పున్రప్రవేశించింది. సిరియా అధ్యక్షుడిని 'యుద్ధ నేరస్తుడు'గా చిత్రించిన కొందరు పశ్చిమ దేశాల వ్యాఖ్యాతలు నేడు సాధారణీకరింపబడటం గురించి విమర్శలు మొదలెట్టారు.

అసద్ చైనా పర్యటన పశ్చిమ ఆసియా స్థిరత్వం మీద, భద్రత మీద ఆకాంక్షలతో విజయం. ఇది ఆ ప్రాంత దేశాల ఆకాంక్షల మేరకు జరిగింది. ఉదాహరణకు సిరియా అంతర్యుద్ధం తరువాత మొదటిసారిగా అరబ్ లీగ్ శిఖరాగ్ర సమావేశానికి సౌదీ అరేబియా సిరియాను ఆహ్వానించింది. దీంతో సిరియా వెలివేత అంతర్జాతీయంగా ముగిసినట్లయింది. ఆ తరువాత వెంటనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సిరియాను వాణిజ్య సదస్సుకు ఆహ్వానించింది. ఈ పరిణామాలు అమెరికాకు అనిష్టమైనా మారాయి. అమెరికా తన తిరోగమన విధానాలతో పశ్చిమ ఆసియా నుంచి నిష్క్రమించడం ప్రారంభమైంది. సిరియాలో అంతర్యుద్ధానికి నిప్పురాజేసింది అమెరికానే. ఉదాహరణకు అమెరికా సున్నీ దేశాలను ఉపయోగించి షియా దేశమైన ఇరాన్ అంతర్గత రాజకీయాలలో జోక్యం చేసుకునేలా చేసింది.

అమెరికా వ్యూహాన్ని అనుసరించటానికి ఈ దేశాలు ఉత్సాహం చూపుతుండగానే క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు మారాయి. అస్సద్ పదవీచ్యుతుడు కాడని తేలిపోయింది. సిరియాలో చాలా ప్రాంతాలు ఇస్లామిక్ స్టేట్ టెర్రరిస్టుల చేతుల్లోకి పోయాయి. 2015వ సంవత్సరంలో రష్యా జోక్యం చేసుకుని టెర్రరిస్టులపైన పోరాడి అస్సద్ ప్రభుత్వాన్ని నిలబెట్టింది. సిరియాను టెర్రరిస్టుల చేతుల్లోకి పోకుండా కాపాడింది. సహాయాన్ని అర్థించిన సిరియా కోరికను మన్నించి రష్యా తీసుకున్న నిర్ణయం వెనుక వ్యూహాత్మక ప్రాధాన్యత ఉంది.

మరోవైపు అమెరికా సిరియా సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించి అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా సిరియాపై బాంబులను ప్రయోగించింది కొన్ని ప్రాంతాలను ఆక్రమించింది. అస్సద్‌ను పదవీచ్యుతుడిని చేయాలన్న ప్రయత్నం ఒకవైపు, మరోవైపు టెర్రరిస్టులను [illegible] అమెరికా వ్యూహంగా మారింది. [illegible] సిఐఎ, పెంటగాన్(రక్షణ శాఖ) ఈ పరస్పర విరుద్ధ [illegible] అస్సద్ వ్యతిరేక తిరుగుబాటుదారులకు, స్థానిక కుర్దిష్ శక్తులకు [illegible] పనిచేసే తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు చెలరేగా



య. ఈ మతిలేని స్థితి ముగియనుండగానే అస్సద్‌ను కదిలించడం సాధ్యం కాదని, ఆయనకు ప్రత్యామ్నాయం మరింత ప్రమాదకరంగా ఉంటుందని పశ్చిమ ఆసియా దేశాలకు అర్థమైంది. చైనా మధ్యవర్తిత్వంతో సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య సాధారణ సంబంధాలు ఏర్పడటంతో సిరియాలో అంతర్యుద్ధం పరిసమాప్తమైంది. దానితోపాటే యెమెన్‌లో జరుగుతున్న యుద్ధం కూడా ముగిసింది. సిరియా తన పొరుగు దేశాలతో కలిసిపోయి ఉండటం, ప్రపంచ రాజకీయాలలో ప్రవేశించడం అందరికీ లాభసాటిగా మారింది. అస్సద్‌ను పదవీచ్యుతుణ్ని చేయటంలో విఫలమైన అమెరికా తన ఆంక్షలతో సిరియా ప్రజలను క్షోభకు గురి చేసింది. ఇలా చేయటం అంతర్జాతీయ న్యాయానికి, సాధారణ దౌత్యానికి వ్యతిరేకం. అస్సద్ నియంత అయినందునే తాము వ్యతిరేకిస్తున్నామనే అమెరికా ప్రచారంలో ఏమాత్రం నిజంలేదు. 2022లో అమెరికా తన ఆయుధాలలో 57 శాతం నియంతృత్వ దేశాలకే అమ్మిందని 'ద ఇంటర్సెప్ట్' ఒక సమీక్షలో తెలిపింది. అమెరికాకు లాభాలపైన, తన స్వీయ ప్రయోజనాలపైనవుండే ధ్యాస ప్రజాస్వామ్యం మీద ఉండదనేది జగద్విదితం.

సిరియా, చైనాల వ్యూహాత్మక భాగస్వామ్యం ఆర్థికంగా సిరియా నిలదొక్కుకునేలా చేస్తుందనటంలో సందేహంలేదు. అమెరికా దన్నుతో సాగిన అంతర్యుద్ధంలో సిరియా సర్వం కోల్పోయింది. సిరియాను పునర్నిర్మించటంలో చైనా గణనీయంగా సహాయం చేయనుంది. సిరియాలో రష్యా సైనిక జోక్యం విజయవంతమైనందున తరువాత గత సంవత్సరం చైనా 'బెల్ట్ రోడ్ ఇనిషియేటివ్'లో సిరియాను చేర్చటం జరిగింది. రష్యా, చైనాలు పశ్చిమ ఆసియాలో అమెరికా ఆధిపత్యాన్ని ముగించివేస్తున్నాయి. సిరియా, చైనాల మధ్య జరిగిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం అమెరికా సామ్రాజ్యవాదానికి పెద్ద దెబ్బగా భావించవచ్చు. చైనా, రష్యా సహకారంతో వర్తమాన దేశాల రాజకీయాలు తమ అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యం చేసుకోకుండా ప్రతిఘటించవచ్చని, తమ ప్రభుత్వాలను మార్చే అవకాశం లేకుండా చేయవచ్చని సిరియా అనుభవం చెబుతోంది.

ఆశా వర్కర్లు... తెల్లటి చీరతో చిరునవ్వులు చిందిస్తూ మన గడప తొక్కుతారు. మన యోగక్షేమాలు కనుక్కుంటారు. గర్భిణీ మహిళలను కన్న తల్లిలా చూసుకుంటారు. వారికి పుట్టిన బిడ్డలను కంటికి రెప్పలా కాపాడతారు. మతా శిశు మరణాలు తగ్గిపోయాయని ప్రభుత్వాలు నిత్యం గొప్పగా చెప్పుకుంటున్నాయి. దానికి కారణమైన ఆశా వర్కర్లను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. అందుకే తమ శ్రమకు తగ్గ ఫలితం కోసం ఏండ్లుగా పోరాడుతూనే ఉన్నారు.

పనులు చేస్తున్నాం.. ఫలితం ఇవ్వండి...



ఎన్నో ఏండ్ల నుండి రాష్ట్రంలో ఆశా (అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్) వర్కర్లు పేద ప్రజలకు సేవలందిస్తున్నారు. డెలివరీలు ఆస్పత్రిలో జరిగేలా చూస్తూ మాతా, శిశు మరణాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుండి డెలివరీ అయ్యేవరకు వారి యోగక్షేమాలను కన్న తల్లుల మాదిరిగా చూస్తారు. ఇక బిడ్డ పుట్టిన తర్వాత ఆ బిడ్డకు మూడేండ్లు వచ్చే వరకు కంటికి రెప్పలా కాపాడుతుంటారు. తల్లి, బిడ్డలకు ఎలాంటి సమస్య ఎదురైనా 24గంటలు అందుబాటులో ఉంటారు. అంతే కాకుండా నిరంతరం అనేక ఆరోగ్య సేవలను ప్రజలకు అందిస్తున్నారు.

మొదటి నుండి నిర్లక్ష్యమే

మహిళల ఆరోగ్యం కోసం ఇన్ని సేవలు అందిస్తున్న ఆశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి నుండి నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నాయి. కనీస వేతనం, పెన్షన్, ఇఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగభద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు ఏమీ ఇప్పటి వరకు వీరికి కల్పించలేదు. ఆశా స్కీం 2005లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి 2012లో పూర్తిస్థాయి అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పచెప్పింది. అనాటి నుండి నేటి వరకు ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న అనేక రకాల శిక్షణలు పొందుతూనే ఉన్నారు. నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తిస్తూనే ఉన్నారు.

అలవి కాని పనులు

రిజిస్టర్స్ రాస్తున్నారు, సర్వేలు చేస్తున్నారు. బిపి, షుగర్, థైరాయిడ్, వంటి అనేక జబ్బులను గుర్తిస్తున్నారు. విటమిన్ 'ఎ', ఎమ్మార్ బూస్టర్, బిసిజి, బర్త్ డే, పెంటా - 1&2 (టీకాలు), కంటి వెలుగు... వంటి పనులు చేస్తూ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నారు. అలాగే ఐఎంఐ(ప్రస్తుతం 3విడత), ఇమ్యునైజేషన్, మిషన్ ఇంద్ర ధనస్సు, లెప్రసీ, టిబి, ఎఎన్‌సి, హెల్త్ పొజిషన్ రిజిస్ట్రేషన్స్, బిఎల్‌వో డ్యూటీలు, మెడికల్ క్యాంపులు, ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డులు (పిఎంజెఎవై -ఆయుష్మాన్‌భవ) ఇలాంటి అనేక పనులు ఫీల్డ్ వర్క్‌లో భాగంగా ఉంటాయి. ఇంకా ఎఎన్‌సి రిజిస్ట్రేషన్, ఆరోగ్య మహిళ, ఇమ్యునైజేషన్, జూమ్ మీటింగ్ వంటివి వారంలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క బాధ్యత నిర్వర్తించాలి. ఆరోగ్యశాఖ నిర్వహించే ఫోన్‌కాన్ఫరెన్స్‌లో (వారానికొకరోజు) పాల్గొనాలి. నెలకొకసారి 'ఆశా డే' మీటింగ్‌కి హాజరు కావాలి.





ప్రభుత్వం నుండి స్పందన లేదు

తెలంగాణ మొత్తంగా దాదాపు 27వేల మందికి పైగా ఉన్న ఈ కార్మికులు తమ సమస్యలపై ప్రభుత్వానికి మొర పెట్టుకుంటూనే ఉన్నారు. సీఐటీయు వంటి గుర్తింపు పొందిన జాతీయస్థాయి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక సార్లు ఆందోళనలు చేపట్టారు. ఉద్యమించిన సందర్భాల్లో వైద్యశాఖ నుండి హామీలు వస్తున్నాయి తప్ప ఏ ఒక్క హామీ నేటికీ అమలు కాలేదు. అందుకే సీఐటీయూ ఆధ్వర్యంలో 2023 సెప్టెంబర్ 25 నుండి ఆశా వర్కర్లు రాష్ట్ర వ్యాప్త సమ్మె చేపట్టారు. ప్రతి జిల్లాలో ఇకనైనా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులంతా స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. ఈ సమ్మె ఆరంభించి వారం దాటినా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదు. కార్మికులు, మహిళా ఆరోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇంతకంటే మరో ఉదాహరణ ఏముంటుంది. ఇకనైనా ప్రభుత్వం, ఆరోగ్యశాఖ స్పందించి వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

డిమాండ్స్

- ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలకు పెంచాలి.
- జాబ్ చార్ట్‌ను విడుదల చేయాలి.
- 2021 జులై నుండి డిసెంబర్ వరకు (6నెలల) పిఆర్‌సి ఏరియర్స్ వెంటనే చెల్లించాలి.
- కేంద్ర ప్రభుత్వం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్‌ను నెలకు వెయ్యి చొప్పున 16నెలల బకాయిలు వెంటనే చెల్లించాలి.
- హెల్త్ కార్డులు ఇవ్వాలి.
- ప్రమాద బీమా సౌకర్యం రూ. 5లక్షలు ఇవ్వాలి.
- ఎఎన్ఎం, జిఎన్ఎం, పోస్టుల్లో ఆశాలకు ప్రమోషన్ కల్పించాలి.
- ప్రసూతి సెలవులపై సర్క్యులర్ వెంటనే జారీ చేయాలి.

- ఎం.మీన, 7382619034
సిఐటియు, హైదరాబాద్ సౌత్ సిటి

ఆనందంగా గడపడానికి...

జీవితాన్ని ఎప్పుడూ ఆనందంగా గడపడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు, సుఖాలు తప్పనిసరి. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోవడం, సుఖాలు వచ్చినప్పుడు పొంగిపోవడం అందరికీ సహజమే. అయితే వచ్చిన కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటూ జీవితాన్ని నెట్టుకు రావాల్సిందే. సమస్యల నుండి తెలివిగా బయటపడి జీవితాన్ని ఆనందంగా గడపడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం...

రోజువారీ జీవితంలో వచ్చే ఆలోచనలను డైరీలో రాసు కోవాలి. అంటే, మీతో మీరు నిరంతరం జరిపే సంభాషణను కాగితం మీద పెట్టడమే. వాటిని ఒకదాని తర్వాత ఒకటి పూర్తి చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడ ప్పుడూ పగటి కలలు కనడంలో తప్పులేదని నిపుణులు అంటు న్నారు. దీని వల్ల మెదడు బాగా రిలాక్స్ అవుతుందట.

నెమ్మదిగా...

జీవితాన్ని ఒకరితో ఎప్పుడూ పోల్చుకో వద్దు. ఎవరి జీవితం వారిదే. ఇది చెప్పడం తేలిక, చేయడం కష్టం. కానీ ప్రయత్నం మీద సాధించవచ్చు. పూర్తిగా శ్వాస తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఒక టైం పెట్టుకుని చేయడం ప్రారంభిస్తే, నెమ్మదిగా అలవాటై పోతుంది. టెక్నాలజీని ఉపయోగించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుత రోజుల్లో టెక్నాలజీ నుండి దూరంగా వెళ్ళలేం కానీ, టెక్నాలజీకి బానిస అవ్వాల్సిన అవసరం కూడా లేదని గుర్తుపెట్టుకోవాలి.

పని మీదే దృష్టి...

నడుస్తూ మ్యూజిక్ వినడం, ట్విట్టర్ చెక్ చేయడం, క్యాబ్‌లో కూర్చుని చాట్ చేయడం... ఇవన్నీ మంచి పద్ధతులు కావు. నడుస్తున్నప్పుడు నడక మీదే దృష్టి ఉండాలి. మీ క్యాలెండర్‌ను ఒక సారి చెక్ చేసుకోండి. ఏమి చేయాలో, ఏం చేయనవసరం లేదో ఇంకోసారి ఆలోచించండి. అక్కర్లేనివి చేయకండి. ఆ సమయాన్ని మీ కోసం కేటాయించుకోండి. మరొకరు మీతో పంచుకునే విషయాలను వారి వైపు నుండి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి.

ఇష్టమైన పని..

మైండ్-బాడీ కనెక్షన్‌ని ఇంప్రూవ్ చేసుకోవాలి. ఫ్రెండ్స్‌తో, ఫ్యామిలీతో టైం స్పెండ్ చేస్తున్నప్పుడు, పిల్లలతో ఆడుకుంటున్న ప్పుడూ ఫోన్ పక్కన పెట్టేస్తే మంచిది. అప్పుడప్పుడైనా మీకు బాగా ఇష్టమైన పని చేయడానికి ప్రయత్నించండి. వర్క్ నుండి బ్రేక్స్ తీసుకుని, కొంచెం నడవడం, చల్లని నీటితో ముఖం కడగడం వంటివి చేస్తే రిలీఫ్ అవుతారు. ఇష్టమైతే ట్రావెలింగ్ చాలా బావుంటుంది. మంచి ఫలితాలుంటాయి. ఎప్పుడైనా కోపంగా అనిపిస్తే, మూడు సార్లు దీర్ఘ శ్వాస తీసుకోవాలి. ఆ తర్వాతనే మాటలు మాట్లాడాలి.



అతి ఆలోచన...

జీవిత ఉద్దేశ్యం గమనమే. ఎక్కడైనా ఆగామంటే ఇంక ఆగిపోడమే. ఈ సూత్రం మనసుకి కూడా వర్తిస్తుంది. మనం గతం గురించే ఆలోచిస్తూ ఉన్నా, భవిష్యత్తు గురించి భయపడుతున్నా మానసిక శక్తి నశించిపోతూ ఉంటుంది. నిజానికి, సరిగ్గా ట్రెయిన్ చేయక పోతే మన మైండ్ అత్యుత్సాహానికీ, అయిష్టానికీ మధ్య తిరుగుతూ ఉంటుంది. దీన్ని సైంటిఫిక్ టెర్మినాలజీలో డీఫాల్ట్‌మోడ్ నెట్‌వర్క్ అంటారు. దీని వల్ల ఒకే ఆలోచనలో పడి కొట్టు మిట్టాడుతూ ఉంటారు. ఈ అతి ఆలోచన అలసటని కలిగించడమే కాక మెంటల్ ఎబిలిటీస్‌నీ, ఎమోషనల్ ఇంటెలిజెన్స్‌నీ, ఐక్యూ ని దెబ్బ కొడుతుంది. దీంతో నెమ్మదిగా ఒత్తిడి, డిప్రెషన్, నెగెటివిటీ అన్నీ చేరుకుంటాయి. అందుకనే మైండ్‌కి కూడా ట్రెయినింగ్ ఇవ్వాలి. మెడిటేషన్, మైండ్ ఫుల్‌నెస్ ఇందుకు బాగా పనికొస్తాయి.

సరైన ప్రాక్టీస్..

మెడిటేషన్ అంటే ఒక పక్కన కూచుని ఐదు నిమిషాలు చేసేది కాదు. మెడిటేషన్ అంటే అదొక జీవనశైలి. కాన్షియస్‌కి, అన్ కాన్షియస్‌కి మైండ్స్ మధ్య ఒక వారధి. మెడిటేషన్ చేస్తున్నప్పుడు వచ్చే శాంతి మొత్తం రోజు వారీ జీవితంలో, ఆలోచనల్లో కనపడాలి. దీన్నే మెడిటేటివ్ లివింగ్ అంటారు. ఈ స్టేజ్‌కి చేరుకోవాలంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాక్టీస్ మానకూడదు. కాన్సన్‌ట్రేషన్ బేస్డ్ టెక్నిక్స్ కంటే ఎవేర్నెస్ బేస్డ్ టెక్నిక్స్‌ని ప్రిఫర్ చేయాలి. దీని వల్ల ఫోకస్ పెరగడం, ఆలోచన తీక్షణమవ్వడం, అక్కర్లేని ఆలోచనల్లేని మెదడు వంటి లాభాల్లో ఇవి కొన్ని మాత్రమే.

---

107 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై
ద్వేషపూరిత ప్రసంగాల కేసులు

న్యూఢిల్లీ : 107 మంది ఎమ్మెల్యేలు, ఎంపిలపై ద్వేషపూరిత ప్రసంగాల కేసులు ఉన్నట్టు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) మంగళవారం విడుదల చేసిన నివేదిక పేర్కొంది. వీరిలో అధికశాతం మంది బీజేపీకి చెందిన వారే ఉండటం గమనార్హం. ఇటువంటి కేసులున్న 480 మంది అభ్యర్థులు గత ఐదేండ్లలో రాష్ట్ర అసెంబ్లీలతో పాటు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసినట్టు తెలిపింది. ఏడీఆర్‌తో పాటు నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్‌ఈడబ్ల్యూ)లు సంయుక్తంగా ఈ సర్వే చేపట్టాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఆ సమయంలో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు స్వయంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లను అధ్యయనం చేసినట్టు నివేదిక పేర్కొంది. తమపై విద్వేష ప్రసంగాలకు సంబంధించిన కేసులు ఉన్నట్టు చాలా మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు స్వయంగా పేర్కొన్నట్టు సర్వే తెలిపింది.

నివేదిక ప్రకారం.. యూపీ (ఏడుగురు), తమిళనాడు (నలుగురు), బీహార్, కర్నాటక, తెలంగాణల నుంచి ముగ్గురు చొప్పున, అసోం, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ నుంచి ఇద్దరు చొప్పున, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 33 మంది ఎంపీలపై కేసులున్నాయి. వీరిలో 22 మంది బీజేపీకి చెందినవారుకాగా, కాంగ్రెస్ (ఇద్దరు), ఆప్, ఏఐఎంఐఎం, ఏఐయూడీఎఫ్, డీఎంకే, ఎండీఎంకే, పీఎంకే, శివసేన (ఉద్ధవ్ థాకరే), వీసీకే పార్టీల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. ఓ స్వతంత్ర ఎంపీపైనా ఈ కేసు ఉన్నట్టు నివేదిక తెలిపింది. బీహార్, యూపీల నుంచి తొమ్మిది మంది చొప్పున, ఏపీ, మహారాష్ట్ర, తెలంగాణల నుంచి ఆరుగురు చొప్పున, అసోం, తమిళనాడుల నుంచి ఐదుగురు చొప్పున, ఢిల్లీ, గుజరాత్, పశ్చిమబెంగాల్‌ల నుంచి నలుగురు చొప్పున, జార్ఖండ్, ఉత్తరాఖండ్‌ల నుంచి ముగ్గురు చొప్పున, కర్నాటక, పంజాబ్, రాజస్తాన్‌ల నుంచి ఇద్దరు చొప్పున, త్రిపుర, మధ్యప్రదేశ్, ఒడిశాల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 74 మంది ఎమ్మెల్యేలపై కేసులున్నాయి. ఈ జాబితాలో బీజేపీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలు ఉండగా, కాంగ్రెస్ నుంచి 13 మంది, ఆప్ నుంచి ఆరుగురున్నారు.

దిక్కుమాలిన బీజేపీ దేశానికి అవసరమా?

(మొదటిపేజీ తరువాయి)

ఏం చేశాడని ఆయనతో అంటకాగేందుకు.. 2014లో ఎన్నికల ముందు రోజు జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానని అధికారంలోకి వచ్చిన 9ఏండ్లలో ఎవరి ఖాతాలోనైనా పడ్డాయా? అని ప్రశ్నించారు. అందుకే బీజేపీకి ఒక్క ఓటు కూడా పడకూడదన్నారు. ఆ పార్టీకి సిగ్గుశరం ఉందా? మోడీ దేవుడని బండి సంజయ్ చెబుతుండు. సిలిండర్ ధర, పెట్రోల్, నిత్యాసవరాలు పెంచినందుకా మోడీ దేవుడా? అని పశ్నించారు. పసుపు బోర్డు ఇచ్చామని ఓట్లు అడుగుతున్న బీజేపీకి పొరపాటున కూడా ఓటు వేయొద్దన్నారు. బీజేపీ మత విద్వేశాలు రెచ్చగొట్టడమే తప్ప ప్రజల కోసం, పేదల కోసం ఆలోచించడం లేదన్నారు. మతం పేరు మీద చిచ్చుపెట్టడం.. నాలుగు ఓట్లు డబ్బాల వేసుకోవడం తప్ప మోడీ ఏం చేశారని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వ్యక్తిని, ఓటుకు నోటు దొంగను పార్టీ ప్రెసిడెంట్‌గా పెట్టుకున్న నక్కజిత్తుల కాంగ్రెసోళ్లు ఎన్ని మాటలు మాట్లాడినా ప్రజలు నమ్మొద్దని ప్రజలను కోరారు. కాంగ్రెస్ అవుట్ డేటెడ్ పార్టీ అని విమర్శించారు. సభలో ఎమ్మెల్యేలు విద్యాసాగర్ రావు, సుంకే రవి శంకర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత, ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ రాజేశం గౌడ్ పాల్గొన్నారు.

ఆశాలు, అంగన్‌వాడీల అరెస్ట్

జగిత్యాల జిల్లా మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లను పోలీసులు ఎక్కడికక్కడా అరెస్టు చేశారు. కొడిమ్యాల, మల్యాల, సారంగాపూర్, జగిత్యాల, బీర్పూర్ పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టులను తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) తీవ్రంగా ఖండించింది. 22రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ఆశావర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె శిబిరాలను తొలగించాలంటూ పోలీసులు రెండ్రోజులుగా బెదిరింపులకు పాల్పడ్డట్టు సీఐటీయూ నాయకులు తెలిపారు. సమస్యలపై మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కూడా అవకాశం కల్పించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అంగన్‌వాడీ ఉద్యోగులను విడుదల చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.జ్యోతి, కె.రజిత, జిల్లా అధ్యక్షులు సులోచన, సీఐటీయూ జిల్లా కన్వీనర్ డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో బీసీ గణన చేయండి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీ జనగణనతోనే బీసీ వర్గాలకు సమన్యాయం జరుగుతుందనీ, ఆ దిశలో బీసీ కుల గణన చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. న్యాయంగా తమకు దక్కాల్సిన వాటా కోసం ఆయా సామాజికవర్గాలు చేస్తున్న బీసీ జనగణన డిమాండ్‌కు కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ విషయంలో బీసీ సంఘాలు చేపట్టిన ప్రతి నిరసన ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచిందని తెలిపారు. ఈమేరకు మంగళవారం సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. మహిళా బిల్లును పార్లమెంటులో ఆమోదించిన సమయంలో కూడా రాహుల్ గాంధీ ఈ అంశాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కల్పించినా ఇండియా కూటమిలోని భాగస్వాములైన జేడీయూ,ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలతో కూడిన నితీశ్ కుమార్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం బీహార్ రాష్ట్రంలో బీసీ జనగణనను విజయవంతంగా చేపట్టిందని గుర్తు చేశారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని దేశ ప్రజలందరికీ అందిస్తామనే ఆశయాన్ని రాజ్యాంగం ప్రకటించిందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా...జనాభాలో సగ భాగమైన బీసీల పరిస్థితిలో ఏ మార్పు లేదని పేర్కొన్నారు. ఎవరి కుల దామాషా ప్రకారం వారు హక్కులు పొందటమే ప్రజాస్వామిక సామాజిక న్యాయం అని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన అని పేర్కొన్నారు. అరుదైన పక్షి, జంతు జాతులను రక్షించేందుకు ప్రభుత్వాలు వాటి లెక్కలు తీస్తున్నాయని తెలిపారు. కానీ, దేశ జనాభాలో సగం కన్నా ఎక్కువ ఉన్న బీసీల జనాభా ఎంతో తెలియదనీ, దేశంలో బీసీల జనాభా ఎంత ఉన్నదని తెలుసుకునేందుకు నేటికీ, బ్రిటీష్ పాలకులు చేపట్టిన జనాభా లెక్కలే ప్రామాణికంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన బీసీ వర్గాలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బీసీ కుల గణనతోనే బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని వివరించారు. బీసీ కుల గణనతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16 ప్రకారం విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు కల్పించిన రిజర్వేషన్లు మరింత కట్టుదిట్టంగా అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.ఆయా సామాజిక వర్గాలకు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుందని సూచించారు. జనాభాకు అనుగుణంగా విద్య, ఉద్యోగ, సామాజిక రంగాల్లో వెనుకబడిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం సాధ్యమవుతుందనీ, ఇప్పటి వరకు రిజర్వేషన్ ఫలాలు అందుకోలేని ఎన్నో వందల కులాలను వెలుగులోకి తీసుకురావచ్చునని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం బీసీ జనగణన డిమాండ్‌ను పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశంలో బీసీలు ఎంతమంది ఉన్నారు? వీళ్ల ఆర్థిక స్థితి గతులేమిటి? వారి చదువులు ఎలా వున్నాయి? వారి ఉద్యోగ అవకాశాలేమిటి? దారిద్ర్య రేఖకు దిగువన ఉండటానికి కారణాలేంటి? బీసీల్లో ఇంకా సంచారజాతులుగా వున్న వారి దీనస్థితికి విముక్తి ఎప్పుడు? ఈ సమాచారం లేకుండా దేశాభివృద్ధికి వ్యూహాలు రచించడం కష్టమని తెలిపారు. బీసీలకు ఎంతో చేస్తున్నామని చెప్పుకోవడమే తప్ప చేసింది శూన్యమని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమం కోసం ప్రత్యేక పాలసీ తెస్తామన్న మాట ఉత్తముచ్చటగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోనే కాకుండా కేవలం 20 సీట్లు మాత్రమే ఇచ్చి రాజకీయంగా కూడా బీసీలను అణగదొక్కాలనే కుట్రలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వారికి న్యాయంగా దక్కాల్సిన వాటా కావాలంటే, బీసీ జనగణనతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాబట్టి బీహార్ మాదిరిగా మీ ప్రభుత్వం కూడా తక్షణమే బీసీ జనగణన చేపట్టాలని కోరారు. 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అప్పుడే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలకు న్యాయంగా దక్కాల్సిన వాటా దక్కుతుందని రేవంత్ ఈ సందర్భంగా సీఎంను కోరారు.

పర్మినెంట్ చేయాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

బతకాలి. ఇదెక్కడి న్యాయం. గొడ్డుచాకిరీ చేస్తున్న మున్సిపల్ కార్మికుల మీద చిన్నచూపు ఎందుకు? వారం రోజులు పని బంద్ చేస్తే కోటి మందికిపైగా జనం ఇబ్బంది పడుతారు. దీన్ని ప్రభుత్వం గుర్తెరగాలి. మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి. లేకుంటే కేసీఆర్ ప్రభుత్వాన్ని 'వదలబోం' అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) అనుబంధం ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు.

వేలాది మంది మున్సిపల్ కార్మికులు తరలొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లాలని తీర్మానించారు. ధర్నానుద్దేశించి భాస్కర్ మాట్లాడుతూ..కరోనా కాలంలో ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మున్సిపల్ సిబ్బంది సేవలందించారని గుర్తుచేశారు. మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువ వేతనాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటే సరిపోదనీ, కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇస్తున్నదని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తన వేతనాన్ని పెంచుకున్న సీఎం, ఎమ్మెల్యేలకు మున్సిపల్ కార్మికులు కూడా మనుషులే, వాళ్లూ బతకడానికి కూడా జీతాలు పెంచాలనే సోయి ఎందుకు లేదని నిలదీశారు. ఉద్యోగులకు ఐఆర్ ఐదు శాతమే అంటే వారిని మోసం చేయడమేనన్నారు. జీవోను సవరించి దాన్ని కనీసం 20 శాతానికి పెంచాలనీ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ దాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్. కార్మికులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సమన్వయ కమిటీ(సీఐటీయూ) కన్వీనర్ ఎస్వీ.రమ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ఆలోపు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షన్నర మందికిపైగా స్కీం వర్కర్లు సమ్మెలో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పనికి తగ్గ ఫలితం, పర్మినెంట్ అడగటం తప్పా అని ప్రశ్నించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ..జీహెచ్‌ఎంసీలోని 26 వేల మంది, రాష్ట్రంలోని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలోని 65 వేల మంది కార్మికులు పారిశు ధ్య సేవల్ని ఆపేస్తే కోటి మంది ఆరోగ్యం మీద ప్రభావం పడదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మూడు శాతం మంది ఉద్యోగులే అని చిన్నచూపు చూస్తే వారే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఢిల్లీలో 19 వేలు, ఏపీలో 21 వేలు, కేరళలో రూ.26 వేలను మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నారని గుర్తుచేశారు. ఇక్కడ కూడా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ..సీఎం ఒక్కరోజు వేతనం తమకు నెల జీతంతో సమానమన్నారు. మున్సిపల్ కార్మికులకు కూడా తిండికీ, బట్టకీ, పిల్లల చదువులకు సరిపోయేలా జీతాలు ఇవ్వాలి కదా అని అడిగారు. మన సఫాయి కార్మికులు త్యాగమూర్తులనీ, సఫాయి అన్న లేకుంటే తెలంగాణ సమాజానికి ఎంతో ప్రమాదమనీ, వారిని పర్మినెంట్ చేస్తామన్న హామీలు ఏమయ్యాయని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఈ ధర్నాలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా నర్సింహులు, ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, నాగమణి, డి. కిషన్, జి. శ్రీను, గుర్రం అశోక్, టి. ఉప్పలయ్య, పుట్టా ఆంజనేయులు, ఎ. వెంకటేష్, ఆర్. వాణి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు పి.శ్రీకాంత్, యాటల సోమన్న, ఎ.సునీత, యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు రాజనర్సు, ఎస్. వెంకటస్వామి, ఎం. శ్రావణ్ కుమార్, యాదమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం అవార్డులు ప్రకటించింది. ఎలక్ట్రాన్ల పరిశీలనను సులభతరం చేయడానికి కృషి చేసినందుకు వీరికి నోబెల్ పురస్కారం దక్కింది. ఈ పురస్కారం కింద పది లక్షల డాలర్ల ప్రైజ్ మనీ లభిస్తుంది.

ఎలక్ట్రాన్ డైనమిక్స్‌పై అధ్యయనం చేసే ప్రక్రియలో ఆటో సెకండ్ పల్స్‌ను ఉత్పత్తి చేసే పద్ధతులు కీలకమైనవి. ఎందుకంటే పరమాణువులు, అణువుల్లో ఎలక్ట్రాన్ల కదలికలు వేగంగా ఉంటాయి. వీటిని ఆటో సెకండ్లలో కొలుస్తారు. అణువుల్లో ఎలక్ట్రాన్ డైనమిక్స్‌ను అధ్యయనం చేయడం, కాంతి తరంగాల ఆటో సెకండ్ పల్స్‌ను ఉత్పత్తి చేసే పరిశోధనలు చేయడం వల్ల వీరిని ఎంపిక చేశామని స్వీడిష్ సైన్స్ అకాడమీ సెక్రటరీ జనరల్ హన్స్ ఎలెగ్రెన్ చెప్పారు.

ఆ ముగ్గురే టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ విజయం సాధించింది. ఎన్నికల తర్వాత రాజకీయ పరిణామాల దృష్ట్యా ఈ ప్రాంత ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి అధికార పార్టీ బీఆర్ఎస్‌లో చేరారు. దాంతో జిల్లాలో కాంగ్రెస్ నుంచి అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహించే వారు కరువయ్యారు. పార్టీపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది. చేతి గుర్తుకు ఓటు వేస్తే ఫలితం లేకుండా పోయిందనే ప్రచారం క్షేత్రస్థాయిలోకి వెళ్లింది. దీని ప్రభావం రాష్ట్రంలో జరిగిన నాలుగు ఉప ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. అందుకే ఈసారి కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలను ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకుంది. ఎలాగైనా వీరిని ఓడించాలని ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది.

సిట్టింగ్‌లపై తీవ్ర వ్యతిరేకత

ఈ మూడు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరడంతో ప్రజల్లో వీరిపై తీవ్ర వ్యతిరేకత మొదలైంది. తమ స్వార్థం కోసం మాత్రమే వీరు పార్టీ మారారని ప్రజలు భావిస్తున్నారు. దీనికితోడు బీఆర్ఎస్‌లో ఎప్పటి నుంచో ఉన్న ఉద్యమకారులు, ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కోసం పనిచేసి టికెట్ ఆశించిన వారు సైతం సిట్టింగ్‌లపై వ్యతిరేకతతో ఉన్నారు. దీన్ని కాంగ్రెస్ అందిపుచ్చుకుని సిట్టింగ్‌లను ఓడించి, ఇక్కడ పాగా వేసేందుకు కసరత్తు చేస్తోంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌వి.. తెరవెనుక నాటకాలు

(మొదటిపేజీ తరువాయి)

రాజరికం కావాలని కేసీఆర్ భావిస్తున్నారని, అందుకే తన తర్వాత తన కొడుకును సీఎం చేయాలని కేసీఆర్ చూస్తున్నారని, ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకమని, కరోనా సమయంలో వ్యాక్సిన్‌ను ప్రపంచానికి అందించిన కీర్తి తెలంగాణకు దక్కిందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చేందుకు ప్రతిపక్షాలను బలవంతంగా ఒప్పించే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇండియా కూటమి ఈ విషయంలో ప్రజలకు జవాబు ఇవ్వాలన్నారు. పేదరిక నిర్మూలనే తన సంకల్పమని, దీనికి ప్రతిపక్షాలు సైతం సంకల్పం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ మహిళల కాళ్లు తన తలపై పెట్టుకుంటానని, ఎందుకంటే వారు కష్టపడి పండించిన పసుపు కరోనా సమయంలో ప్రపంచాన్ని రక్షించిందని అన్నారు. అటువంటి రైతుల అభివృద్ధి కోసం నేషనల్ టెర్మినల్ బోర్డును ఏర్పాటు చేశామని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి కార్యకర్త బూత్ లెవల్ నుంచి కమలం పువ్వును ఇంటింటికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, డీకే అరుణ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త, బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వ లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ కు మంత్రి సింగిరెడ్డి ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మండలకేంద్రంగా ఏదుల ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ కు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయంతో ఏదులవాసుల కల నెరవేరిందని తెలిపారు. ఏదుల మండలంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.



అక్కడా.. ఇక్కడా ప్రాక్టీస్ లేదు!

నెదర్లాండ్స్‌తో వార్మప్ సైతం వర్షార్పణం

తిరువనంతపురం : ఐసీసీ ప్రపంచకప్ రెండు సార్లు చాంపియన్, ఆతిథ్య టీమ్ ఇండియా 2023 వన్డే వరల్డ్‌కప్ వేటను ప్రాక్టీస్ లేకుండానే ఆరంభించనుంది. ఆసియా కప్ విజయం అనంతరం స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో తలపడిన రోహిత్‌సేన.. ప్రపంచకప్ వార్మప్ షెడ్యూల్‌లో భాగంగా ఇంగ్లాండ్, నెదర్లాండ్స్‌తో ఆడాల్సి ఉంది. కుండపోత వర్షంతో గువహటిలో ఇంగ్లాండ్‌తో వార్మప్ మ్యాచ్ టాస్ అనంతరం రద్దు కాగా.. తిరువనంత పురంలోనూ అదే కథ పునరావృత మైంది. ఎడతెరిపి లేని వర్షంతో డచ్‌తో టీమ్ ఇండియా వార్మప్ సాధ్యపడలేదు. కనీసం టాస్ కూడా పడకుండానే.. మంగళవారం నాటి వార్మప్ మ్యాచ్ రద్దుగా ముగిసింది. ఐసీసీ ప్రపంచకప్‌లో అక్టోబర్ 8న ఆస్ట్రేలియాతో చెన్నైలో టీమ్ ఇండియా తొలి మ్యాచ్ ఆడనుండగా.. అక్టోబర్ 6న హైదరాబాద్‌లో పాకిస్థాన్‌తో నెదర్లాండ్స్‌తో తలపడనుంది. నేడు రోహిత్‌సేన చెన్నైకి చేరుకోనుండగా, డచ్ క్రికెటర్లు హైదరాబాద్‌కు రానున్నారు.

వార్మప్ లేకుండా..

ప్రపంచకప్ వేటను ప్రాక్టీస్ లేకుండా ఆరంభించటం టీమ్ ఇండియాపై ఏ విధంగా ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది. చివరగా సెప్టెంబర్ 27న భారత్ మైదానంలో కనిపించింది. సుమారు రెండు వారాల విరామం అనంతరం నేరుగా వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఆడటం కాస్త ఇబ్బందికరమే కావచ్చు!. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ బలంగా కనిపిస్తున్నప్పటికీ.. భారీ స్కోర్లు నమోదయ్యే టోర్నీలో ఆతిథ్య జట్టుకు నం.8 బ్యాటర్ బలహీనత వేధిస్తోంది. జట్టులో అందరూ కుడి చేతి వాటం బ్యాటర్లే కావటం సైతం ఏ విధంగా ప్రభావం చూపనుందో ముున్ముందే తెలియాలి.

బంగారు అథ్లెట్స్

- పారుల్ చౌదరి, అన్ను రాణికి స్వర్ణం
- అథ్లెటిక్స్, బాక్సింగ్, ఆర్చరీలో మెడల్స్

• 2023 హాంగ్జౌ ఆసియా క్రీడలు

హాంగ్జౌ ఆసియా క్రీడల్లో మన అథ్లెట్లు అదరగొడుతున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో టీమ్ ఇండియాకు పతక వరద కొనసాగుతుంది. పారుల్ చౌదరి, అన్ను రాణి బంగారు పతకాలు కైవసం చేసుకోగా..తేజస్విని శంకర్, మహ్మద్ అఫ్సాల్‌లు రజత పతకాలు సొంతం చేసుకున్నారు. పి. చిత్రవేల్, విత్య రామ్‌రాజ్‌లు కాంస్య పతకాలతో మెరవటంతో మంగళవారం హాంగ్జౌ అథ్లెటిక్స్‌లో భారత్ ఏకంగా ఆరు పతకాలు సొంతం చేసుకుంది. ఇతర ఈవెంట్లలో కలిపి తొమ్మిది పతకాలు భారత్ ఖాతాలో వేసుకుంది. 69 మెడల్స్‌తో పతకాల పట్టికలో భారత్ నాల్గో స్థానంలో కొనసాగుతుంది.

నవతెలంగాణ-హాంగ్జౌ

అథ్లెటిక్స్‌లో టీమ్ ఇండియాకు ఎదురు లేదు. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో మంగళవారం భారత్ మరో ఆరు పతకాలు కైవసం చేసుకుంది. రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలతో హాంగ్జౌను హెూరెత్తించింది. మహిళల 5000 మీటర్ల రేసులో పారుల్ చౌదరి పసిడి పరుగు తీసింది. పతక రేసును 15 నిమిషాల 14.75 సెకండ్లలో పూర్తి చేసిన పారుల్ చౌదరి.. స్వర్ణం సొంతం చేసుకుంది. జపాన్ స్ప్రింటర్ హిరోనాక 15.15.34 సెకండ్లతో సిల్వర్ సాధించగా, కజకిస్థాన్ అథ్లెట్ 15.23.12 సెకండ్లతో కాంస్య పతకం అందుకుంది. ఈ విభాగంలో పోటీపడిన మరో భారత అథ్లెట్ అంకిత 15.33.08 సెకండ్లతో ఐదో స్థానంలో సరిపెట్టుకుంది. జావెలిన్ త్రోలో సూపర్‌స్టార్ నీరజ్ చోప్రా కంటే ముందే మరో అథ్లెట్ బంగారు పతకం అందించింది. మహిళల జావెలిన్ త్రోలో అన్ను రాణి స్వర్ణం సాధించింది. ఫైనల్లో ఈటను 62.92 మీటర్ల దూరం విసిరిన అన్ను రాణి ఈ సీజన్లోనే అత్యుత్తమ ప్రదర్శన చేసింది. 61.57 మీటర్ల త్రోతో శ్రీలంక అథ్లెట్ లెకాగె సిల్వర్ సాధించగా, చైనా అథ్లెట్ 61.29 మీటర్ల త్రోతో కాంస్య దక్కించుకుంది. పురుషుల డెకథ్లాన్‌లో తేజస్విని శ్రీశంకర్ చరిత్ర సృష్టించాడు. ఆసియా క్రీడల్లో భారత్‌కు ఈ విభాగంలో 1974 తర్వాత తొలి మెడల్ అందించాడు. మంగళవారం జరిగిన 1500 మీటర్ల రేసును 4 నిమిషాల 48.32 సెకండ్లతో ముగించిన తేజస్విని శ్రీశంకర్ నాల్గో స్థానంలో నిలిచాడు. డెకథ్లాన్ ఈవెంట్‌లో 100మీ, లాంగ్ జంప్, షాట్‌పుట్, హై జంప్, 400 మీ, 110మీ హార్డిల్స్, డిస్కస్ త్రో, పోల్ వాల్ట్, జావెలిన్ సహా 1500మీ రేసు పోటీల ఉంటాయి.







ఈ అన్ని పోటీల అనంతరం ఓవరాల్‌గా అత్యుత్తమ ప్రదర్శన చేసిన టాప్-3 అథ్లెట్లు పతక విజేతలుగా నిలుస్తారు. తేజస్విని శ్రీశంకర్ సూపర్ ప్రదర్శనతో భారత్‌కు సిల్వర్ మెడల్ అందించాడు. పురుషుల 800 మీటర్ల రేసులో సైతం భారత్‌కు రజత పతకం దక్కింది. పి. మహ్మద్ అఫ్సల్ రేసును 1 నిమిషం 48.43 సెకండ్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. సౌదీ అరేబియా అథ్లెట్ 1.48.05 టైమింగ్‌తో స్వర్ణం, ఒమన్ అథ్లెట్ 1.48.51 టైమింగ్‌తో కాంస్యం అందుకున్నారు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో చిత్రవేల్ పి కాంస్య పతకంతో రాణించాడు. 16.68 మీటర్ల జంప్‌తో మెరిసిన చిత్రవేల్ పతక వేటలో మూడో స్థానంలో నిలిచాడు. చైనా అథ్లెట్లు స్వర్ణం, సిల్వర్ కైవసం చేసుకున్నారు. మహిళల 400 మీటర్ల హార్డిల్స్‌లో విత్య రామ్‌రాజ్ బ్రాంజ్ మెడల్ సాధించింది. రేసును 55.68 సెకండ్లలో ముగించిన విత్య మూడో స్థానంలో నిలిచి కాంస్య అందుకుంది. బహ్రెయిన్, చైనా అథ్లెట్లు వరుసగా గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు.



కానోయ్ స్ప్రింట్‌లో భారత్‌కు కాంస్య పతకం లభించింది. 3 నిమిషాల 53.329 సెకండ్ల టైమింగ్‌తో భారత్ మూడో స్థానంలో నిలువగా.. ఉజ్బెకిస్థాన్ 3.43.796, కజకిస్థాన్ 3.49.991తో టాప్-2లో నిలిచాయి. భారత్ నుంచి సునీల్ సింగ్, అర్జున్ సింగ్ జోడీ ఈ స్ప్రింట్‌లో పతక ప్రదర్శన చేసింది. ఇక మహిళల 50 కేజీల విభాగంలో తెలంగాణ సూపర్‌స్టార్ నిఖత్ జరీన్ కాంస్య పతకం సాధించింది. ఈ విభాగంలో ఈ రోజు పసిడి ఫైట్ జరగటంతో నిఖత్ జరీన్‌కు అధికారికంగా బ్రాంజ్ మెడల్ ప్రదానం చేశారు. పసిడి ఫేవరేట్‌గా బరిలో నిలిచిన ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ అనూహ్యంగా సెమీస్‌లో ఓటమిపాలై కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. ఒలింపిక్ మెడలిస్ట్ లవ్లీనా బోర్గొహైన్ పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌తో పాటు కనీసం రజతం ఖాయం చేసుకుంది. మహిళల 75 కేజీల విభాగం సెమీస్‌లో బోర్గొహైన్ 5-0తో థాయ్‌లాండ్ బాక్సర్‌ను చిత్తు చేసి పసిడి ఫైట్‌కు చేరుకుంది. మహిళల 54 కేజీల సెమీస్‌లో ప్రీతి 0-5తో నిరాశపరిచి, కాంస్యానికి పరిమితమైంది. మెన్స్ 92 ప్లస్ కేజీల విభాగం సెమీస్‌లో నరేందర్ 0-5తో నిరాశపరిచాడు. చైనా బాక్సర్‌కు ఫైనల్ బెర్త్ కోల్పోయి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. ఇక స్క్వాష్‌లో భారత్‌కు సౌరభ్ ఘోషల్.. అనహత్, అభయ్.. దీపిక పల్లికల్, హరిందర్ పాల్ సింగ్‌లు పతకాలు ఖాయం చేశారు. ఆర్చరీలో జ్యోతి సురేఖ, అభిషేక్ వర్మలు పతకాలు ఖాయం చేయగా.. మరో విభాగంలో టీమ్ ఇండియాకు ఏకంగా గోల్డ్, సిల్వర్ మెడల్ ఖాయమయ్యాయి. ఈ విభాగాల్లో పసిడి పోటీలు అక్టోబర్ 7న జరుగుతాయి.

స్పోర్ట్స్ కిట్స్ చరిత్రాత్మకం!

- మొదలైన క్రీడా సామాగ్రి పంపిణీ
- శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్

నవతెలంగాణ-హైదరాబాద్ : తెలంగాణ గ్రామీణ క్రీడాకారులు, యువతకు ప్రోత్సాహం అందించి, పతక వేటలో సంకల్ప బలం అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్)లు 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్'ను ప్రతి గ్రామానికి అందజేస్తున్నాయని శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. ' తెలంగాణకు తలమానికంగా మారిన రైతు బంధు, రైతు భీమా, కేసీఆర్ కిట్స్, న్యూట్రిషన్ కిట్స్ సరసన కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ నిలువనుండటం సంతోషం. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామానికి, ప్రతి క్రీడా ప్రాంగణానికి సమగ్ర స్పోర్ట్స్ కిట్లను అందజేయటం చరిత్రాత్మకం. రూ.100 కోట్లకు పైగా వ్యయంతో యువతకు క్రీడా కానుక అందించటం హర్షనీయం. గ్రామీణ క్రీడాకారులకు ఇది ఎంతో మేలు చేయనుందని' ఆంజనేయ గౌడ్ అన్నారు. మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేయనుండగా.. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాలోని హన్వాడ మండల కేంద్రంలో కార్యక్రమాన్ని అధికారంగా ప్రారంభించారు. క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, క్రీడాశాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, కలెక్టర్ రవి నాయక్‌లు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆరంభించారు. కేసీఆర్ స్పోర్ట్స్ కిట్‌లో రూ. 50 వేల విలువ చేసే 23 క్రీడా పరికరాలు ఉన్నాయి. ప్రతి కిట్‌లో భాగంగా 75 టీ షర్ట్‌లను సైతం అందజేయనున్నారు.





యశస్వి శతక జోరు

నేపాల్‌పై భారత్ ఘన విజయం

హాంగ్జౌ : 2023 ఆసియా క్రీడల (క్రికెట్) సెమీఫైనల్లో భారత్ అడుగుపెట్టింది. మంగళవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో నేపాల్‌పై భారత్ 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (100, 49 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో చెలరేగాడు. యశస్వికి రింకూ సింగ్ (37 నాటౌట్, 15 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), శివం దూబె (25 నాటౌట్, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) తోడవటంతో తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 20 ఓవర్లలో 4 వికెట్లకు 202 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. యశస్వి జైస్వాల్ 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 49 బంతుల్లోనే శతకం సాధించాడు. రుతురాజ్ గైక్వాడ్ (25)తో కలిసి తొలి వికెట్‌కు 103 పరుగులు జోడించిన యశస్వి.. భారత్‌కు భారీ స్కోరు అందించాడు. స్పిన్నర్ రవి బిష్ణోయ్ (3/24), పేసర్ అవేశ్ ఖాన్ (3/32)లు ఛేదనలో నేపాల్‌ను దెబ్బ కొట్టారు. దీంతో ఆ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 179 పరుగులే చేసింది. మరో క్వార్టర్‌ఫైనల్లో హాంగ్‌కాంగ్‌పై విజయంతో పాకిస్థాన్ సైతం సెమీస్‌కు చేరుకుంది.



చాంప్స్ అర్చిత, చాన్వి

ఐఎస్ఎస్ఓ బ్యాడ్మింటన్ టోర్నీ

హైదరాబాద్ : ఇంటర్నేషనల్ స్కూల్స్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఎస్ఓ) నేషనల్ గేమ్స్‌లో బ్యాడ్మింటన్ విజేతలుగా గాడియం స్కూల్ షట్లర్లు అర్చిత, చాన్వి నిలిచారు. బాలికల డబుల్స్ అండర్-14లో అర్చిత నితిన్ జోశి, చాన్వి పెట్టాలు పసిడి సాధించగా.. జయ, రేవలు సిల్వర్ మెడల్ అందుకున్నారు. బాలుర సింగిల్స్ అండర్-14లో సత్య దీపక్, సాయినాథ్, మహ్మద్ అయాన్‌లు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఐఎస్ఎస్ఓ ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు.



రవితేజ

టైగర్‌తో.. బాలీవుడ్ ఎంట్రీ

రవితేజ, వంశీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ కాంబినేషన్‌లో రూపొందిన పాన్ ఇండియన్ ఫిల్మ్ 'టైగర్ నాగేశ్వరరావు'. అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 20న గ్రాండ్‌గా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ,"టైగర్ నాగేశ్వరరావు'తో హిందీలోకి రావడం ఆనందంగా ఉంది. హిందీకి నేనే డబ్బింగ్ చెప్పాను' అని అన్నారు నిర్మాత అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ,'రవితేజతో ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు వంశీ చాలా హార్డ్ వర్క్ చేశారు. చాలా ప్యాషన్‌తో ఈ సినిమాని తీశాం' అని తెలిపారు. 'రవితేజ ఎంతగానో సపోర్ట్ చేశారు. అభిషేక్ చాలా గ్రాండ్‌గా ఈ సినిమా తీశారు. ఇది చాలా ప్రత్యేకమైన సినిమా' అని దర్శకుడు వంశీ తెలిపారు.

ఆ మ్యాజిక్ ఉంది..



శ్రీ విష్ణు, శర్వానంద్, సుధీర్ బాబు

సుధీర్ బాబు, హర్షవర్ధన్ దర్శకత్వంలో రూపొందిన యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'మామా మశ్చీంద్ర'. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పిపై నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ ద్విభాషా చిత్రాన్ని సృష్టి సెల్యులాయిడ్ సోనాలి నారంగ్, సృష్టి సమర్పిస్తున్నారు. ఈనెల 6న సినిమా విడుదలౌతున్న నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. హీరోలు శర్వానంద్, విశ్వక్ సేన్, శ్రీవిష్ణు, డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ ప్రీరిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ,' మంచి సినిమా చేశాం. ఈ సందర్భంగా నారాయణ్ దాస్ నారంగ్‌ని గుర్తు చేసుకుంటున్నాం. ఆయన్ని మిస్ అవుతున్నాం. ఆయనకి ఈ సినిమా అకింతం చేయొచ్చని అనుకుంటున్నాం. ఇందులో చాలా సర్ప్రైజ్‌లు ఉంటాయి. ప్రతి పది నిమిషాలకు ఒక మలుపు వస్తుంది. కథ యూనిక్‌గా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ ఒత్తిళ్ళు వుంటాయి. ఈ సినిమా చూస్తున్నపుడు ఆ ఒత్తిళ్ళు అన్నీ మరిచిపోతారు' అని తెలిపారు. 'ప్రేక్షకులు ఉన్నారనే ధైర్యంతో ఈ సినిమా చేశాను. ఇందులో అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. 'గుండెజారే, మనం..' లాంటి మ్యాజిక్ ఉన్న కథ ఇదిఅని దర్శకుడు హర్షవర్ధన్ చెప్పారు.

నవచిత్రం

హాయ్ నాన్న నుంచి గాజు బొమ్మ..



కియారా ఖన్నా, నాని

నాని నటిస్తున్న తాజా చిత్రం 'హాయ్ నాన్నా'. పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ జర్నీ 'సమయమా..'తో ప్రారంభమైంది. ఈ పాటలో లీడ్ పెయిర్ –నాని, మృణాల్ ఠాకూర్ మధ్య బ్యూటీఫుల్ కెమిస్ట్రీని చూపించింది. ఇక లేటెస్ట్‌గా ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'గాజు బొమ్మ..'ను ఈనెల 6న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. నాని, కియారా ఖన్నా ముచ్చటగా మాట్లాడుకుంటున్న వీడియో ద్వారా ఈ విషయాన్ని అనౌన్స్ చేశారు. 'లవ్ సాంగ్ రిలీజ్ చేశావ్.. మరి మన సాంగ్? అని బేబీ కియారా నానిని అడుగుతుంది. నాని పాపని గాజు బొమ్మ అని పిలుస్తాడు.

తండ్రీ కూతురు నేపథ్యంలో ఈ పాట 'హాయ్ నాన్నా' సోల్‌గా ఉండబోతుందని తెలుస్తుంది. ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాతో శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 21న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.



ఆద్యంతం నవ్వుల హంగామా

యువ నటీనటులు నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యాన్ నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్'. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు.

ప్రధాన నటీ నటులు సంగీత్ శోభన్, రామ్ నితిన్, గోపికా ఉద్యన్ మంగళవారం మీడియాతో సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విశేషాలను షేర్ చేసుకున్నారు.

సంగీత్ శోభన్ మాట్లాడుతూ, 'నాగ వంశీ ఒక హాస్యభరితమైన కథ ఉందని నన్ను సంప్రదించారు. కేవలం ఐదు నిమిషాల కథలోనే కాలేజీ వైబ్, కామెడీ నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పైగా టాలీవుడ్‌లో ఇలాంటి కథ వచ్చి చాలా సంవత్సరాలైంది' అని అన్నారు.

'యూట్యూబ్ సిరీస్‌లతో నా నటనా జీవితాన్ని ప్రారంభించాను. ఆ తర్వాత, హలో వరల్డ్ అనే సిరీస్ చేశాను. అది విడుదలైన రెండు రోజుల్లోనే నాగ వంశీ నుంచి నాకు కాల్ వచ్చింది. ఒక ప్రముఖ ప్రొడక్షన్ హౌస్ నుండి ఆఫర్ రావడం, స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చేశాను' అని రామ్ నితిన్ చెప్పారు.

గోపికా ఉద్యన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాతో తెలుగులో అరంగేట్రం చేస్తున్నాను. ఆసిఫ్ అలీతో మలయాళంలో ఓ ఫీచర్ ఫిల్మ్ చేశాను' అని తెలిపారు.

ఈ సినిమా ఈనెల 6న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో ఎన్టీఆర్ విడుదల చేశారు. ఆద్యంతం వినోదంతో ఉన్న ట్రైలర్ తనకు ఎంతగానో నచ్చిందని చెప్పిన ఆయన చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.



చిన్నా రిలీజ్‌కి రెడీ

సిద్ధార్థ్

సిద్ధార్థ్ సరికొత్త పాత్రలో నటించిన చిత్రం 'చిన్నా'. ఎమోషనల్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను ఎటాకి సంస్థ నిర్మించింది. ఏషియన్ సినిమాస్ ద్వారా తెలుగులో విడుదలవుతోంది చిత్రం. చిన్నాన్నకి, అతని అన్నయ్య కూతురుకి మధ్య ఉన్న అందమైన అనుబంధంతో ఎస్.యు. అరుణ్‌కుమార్ దర్శకత్వం వహించారు. మంగళవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రై.లి హెడ్ జాన్వీ మాట్లాడుతూ, 'తమిళంలో ఈ సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. చాలా స్పెషల్ మూవీ అని చెబుతున్నారు. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులు కూడా అలాంటి రెస్పాన్స్‌నే అందిస్తారని భావిస్తున్నాం. ఈనెల 6న థియేటర్స్‌లో కలుద్దాం' అని అన్నారు. హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా నా లైఫ్ డ్రీమ్. నా కెరీర్‌లోనే బెస్ట్ సినిమా ఇది. నేను కె.విశ్వనాథ్ సినిమాలను చూసే మూవీస్ గురించి నేర్చుకున్నాను. అందుకనే ఈ సినిమాను ఆయనకు అంకితమిస్తున్నాను' అని అన్నారు.

భారీ యుద్ధ కథ



1960వ దశకంలో ఢిల్లీ అధికారం కోసం జరిగే భారీ యుద్ధ కథతో 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ' సిరీస్ రూపొందింది. అర్నాబ్ రే రాసిన 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ: అసెన్షన్' అనే పుస్తకం ఆధారంగా దర్శకుడు మిలన్ లుథ్రియా దర్శకత్వంలో ఈ సిరీస్‌ను రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది. ఈనెల 13 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కావడానికి ఈ సిరీస్ సిద్ధంగా ఉంది.

ఈ సిరీస్ ప్రేక్షకుల్ని ఒక ఆసక్తికరమైన ప్రయాణంలో తీసుకెళ్లడానికి అన్ని రకాల హంగులతో రూపొందింది. ఇందులో తాహిర్ రాజ్ భాసిన్, అంజుమ్ శర్మ, వినయ్ పాఠక్, నిశాంత్ దహియా, అనుప్రియా గోయెంకా, మౌని రాయ్, హర్లీన్ సేథి మెహ్రీన్ పిర్జాదా కీలక పాత్రల్లో నటించారు. 60వ దశకంలోని పాతకాలపు కాలపు మాయాజాలాన్ని పునఃసృష్టిస్తూ ఢిల్లీలోని అతిపెద్ద అక్రమ ఆయుధాల వ్యాపారి జగన్ సేథ్‌తో కలిసి పనిచేసే అర్జున్ భాటియా కథే 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ'. అధికారం కోసం జరిగే భారీ యుద్ధం ఇది. దీని గురించి దర్శకుడు మిలన్ లుథ్రియా మాట్లాడుతూ, 'మా టీజర్‌కి ఇంత స్పందన వస్తుందని ఊహించలేదు. ప్రేక్షకులు ఈ సిరీస్‌ని పూర్తి స్థాయిలో ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

సహజత్వం ఉట్టి పడే సినిమా



నవీన్ చంద్ర

నవీన్ చంద్ర, స్వాతిరెడ్డి ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. దర్శకుడు శ్రీకాంత్ నాగోతి ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించగా, యశ్వంత్ ములుకుట్ల క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్‌పిక్డ్ స్టోరీస్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న సందర్భంగా హీరో నవీన్ చంద్ర మీడియాతో మాట్లాడుతూ, 'దర్శకుడు శ్రీకాంత్ నాగోతితో ఇది నాకు రెండవ సినిమా. కథ, పాత్రలు సహజత్వంతో ఉంటాయి. నా పాత్ర పేరు మధుసూధనరావు. చదువుకున్న రోజుల్లో ఫ్రెండ్స్ అతన్ని హీరోలా చూస్తుంటారు. మందు, సిగరెట్‌కి అలవాటు పడిపోతాడు. ఒకరి కింద ఉద్యోగం చేయాలని ఉండదు. తనకి డబ్బు పై కూడ ఆశ లేదు. తనకి ఏ లక్ష్యం ఉండదు? ఏ బాధ్యత తీసుకోడు. చిన్నప్పటి నుంచి అందరూ ఒక హీరో ఇమేజ్‌తో చూడటంతో అందులోనే ఉండిపోతాడు. ఇందులో మధుమతి పాత్ర యుఎస్ ఎన్ఆర్ఐ. మంత్ ఆఫ్ మధు అంటే ఇద్దరం. ఆ అమ్మాయికి ఇచ్చిన ఒక నెల.. ఈ నెలలో తనతో నా పాత్ర స్నేహం, దీంతో స్వాతితో పాటు మా ఇద్దరి జీవితాలు ఎలా మారాయనేది కథ. ప్రస్తుతం శంకర్ 'గేమ్ ఛేంజర్'తోపాటు మరో 8 సినిమాల్లో నటిస్తున్నాను' అని చెప్పారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.